13-05-26 Samayam_Layout 1 5/13/2026 5:21 AM Page 1

SAMAYAM


epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక
**విలేకరులు కావలెను**
తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.
**7036644111, 9490140565**

సంపుటి: 19 | సంచిక: 185 | ఎడిటర్ : విక్రం కుమార్ | బుధవారం 13 మే 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |



## చిన్నారి హత్య కేసులో మరణ శిక్ష

కూకట్‌పల్లి కోర్టు సంచలన తీర్పు
సహకరించిన వ్యక్తికి ఏడేళ్ల జైలు
2023లో సనత్‌నగర్‌లో జరిగిన దారుణం

3



## కవితకు రైల్వే కోర్టు సమన్లు

- నేడు సికింద్రాబాద్ కోర్టుకు హాజరుకావాలని ఆదేశం
- కామారెడ్డి రైల్ రోకో కేసులో విచారణ

2



## హైకోర్టును ఆశ్రయించిన బండి భగీరథ్

- రేపు విచారించనున్న వెకేషన్ బెంచ్
- నేడు విచారణకు రావాలని సిట్ నోటీసు

2

# ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం సహించం

**సజావుగా వరి, మొక్కజొన్న కొనుగోళ్లు**



రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్లలో ఏమాత్రం జాప్యం జరిగినా, నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఒప్పందం ప్రకారం ధాన్యం తరలింపునకు లారీలు పంపని కాంట్రాక్టర్లపై అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. "ధాన్యం తరలింపులో జాప్యం జరిగితే సహించం. అవసరమైతే పోలీస్ సహాయం తీసుకుని పకడ్బందీగా ధాన్యం సేకరణ చేపట్టాలి" అని ఆయన తేల్చిచెప్పారు. రవాణాలో లారీల కొరత ఉంటే స్థానికంగా ఉన్న ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించుకోవాలని దిశానిర్దేశం చేశారు.



### ధాన్యం వెంటనే లారీల్లో తరలించాల్సిందే..

### అవసరమైతే పోలీస్ సాయంతో ధాన్యం సేకరణ

### లారీలు పంపకుంటే క్రిమినల్ కేసులు పెట్టండి

### కలెక్టర్లకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు

**హైదరాబాద్, మే 12:** ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోలు, వరి ధాన్యం సేకరణపై జిల్లా కలెక్టర్లతో సమీక్ష చేశారు. ధాన్యం లోడ్ తరలించేందుకు ఒప్పందం మేరకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లను ఉపేక్షించొద్దని.. అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులకు వెనకాడవద్దని ఆదేశించారు. మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులకు ఇబ్బందులు కలగొద్దని తెలిపారు. అవసరమైన చోట పోలీస్ సహాయం తీసుకుని కలెక్టర్లు ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలా చూడాలని సూచించారు.

మిగతా 2 లో



## పామిడిలో జగన్ మాస్ 'క్రేజ్'

మాజీ సీఎం రాకతో దద్దరిల్లిన అనంతపురం
జనసంద్రమైన పామిడి వీధులు

5

## జూన్ 2 నుంచి రెండో విడుత ఇండ్ల పంపిణీ

**ఆదిలాబాద్‌లో ప్రారంభించనున్న మంత్రి పొంగులేటి**

**21న కేబినెట్ భేటీలో విధివిధానాల ఖరారు.. ఇళ్ల పంపిణీకి 'స్పెషల్ డ్రైవ్'**

**నియోజకవర్గమే యూనిట్‌గా ఇళ్ల నిర్మాణం.. అక్రమ రిజిస్ట్రేషన్లపై సీరియస్**



**హైదరాబాద్, మే 12:** రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో విడతను ప్రారంభించనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ఆదిలాబాద్ వేదిక కానుందని ఆయన వెల్లడించారు. మంగళవారం హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

మిగతా 2 లో

## వైసీపీ కుట్రలు సాగవు

5



- అమరావతికి భూములిచ్చిన రైతులకు 98 శాతం ప్లాట్ల కేటాయింపు
- రాజకీయ దురుద్దేశంతోనే వైసీపీ రాద్ధాంతం
- వారం రోజుల్లో ఎమ్మెల్యే క్వార్టర్లను జీఏడీకి అప్పగిస్తాం
- అమరావతిలో రోడ్లు, భవనాలు, ఇతర పనులు వేగంగా జరుగుతున్నాయి
- మీడియాతో మంత్రి నారాయణ



## లక్షల మంది విద్యార్థుల కలలు కల్లలు

- తల్లిదండ్రుల త్యాగాలను బీజేపీ ప్రభుత్వం వృథా చేసింది
- నీట్ పరీక్ష రద్దుపై మండిపడ్డ రాహుల్

4

## నీట్ ప్రవేశ పరీక్ష రద్దు

4

- పేపర్ లీక్ వ్యవహారంతో ఎన్‌టీఏ నిర్ణయం
- సీబీఐ విచారణకు ఆదేశించినట్లు వెల్లడి
- 13మందిని అరెస్ట్ చేసిన పోలీసులు



13-05-26 Samayam_Layout 1 5/13/2026 5:21 AM Page 2





# బీఆర్ఎస్ ముఖ్యనేతలతో అధినేత కేసీఆర్ భేటీ

## పార్టీ సంస్థాగత నిర్మాణంపై ప్రధానంగా దృష్టి

## బండి కుమారుడి కేసు వ్యవహారం కూడా చర్చ!

**గజ్వేల్, మే 12:** బీఆర్ఎస్ ముఖ్య నేతలతో పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ భేటీ దాదాపు ఆరు గంటలుగా కొనసాగింది. ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో కేసీఆర్ వివిధ అంశాలపై పార్టీ నేతలతో సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా పార్టీ సంస్థాగత నిర్మాణం, సభ్యత్వ నమోదు ప్రక్రియ, పార్టీ ఇన్‌ఛార్జ్‌ల నియామకం సహా పార్టీ బలోపేతం వంటి ముఖ్యమైన విషయాలపై కేసీఆర్ అధ్యక్షతన చర్చ జరిగినట్లు సమాచారం. ఈ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా పార్టీ ప్రధాన కార్యదర్శులు, మండలి, శాసనసభా పక్షాల ఉపనాయకులు పాల్గొన్నారు. అలాగే అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, శాసన మండలి ఫ్లోర్ లీడర్ సిరికొండ మధుసూదనాచారి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు ఎల్.రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు ఉన్న గ్రామ, మండల, జిల్లా స్థాయి కమిటీల రద్దుపైనా సుదీర్ఘ చర్చ కొనసాగినట్లు తెలుస్తోంది. ఈ కమిటీల స్థానంలో కొత్త కమిటీలను ఎన్నుకోవాలని కేసీఆర్ ఆదేశించినట్లు సమాచారం. కమిటీల్లో పార్టీ కోసం కష్టపడి పని చేసే యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ, జీహెచ్ఎంసీ ఎన్నికలపైనా నేతలతో కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల తెలంగాణ పర్యటనపైనా కేసీఆర్ ఆరా తీస్తున్నట్లు సమాచారం. బండి సంజయ్ కుమారుడి కేసు వ్యవహారం కూడా చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ అంశం గురించి కేసీఆర్‌కు బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ వివరించినట్లు సమాచారం. కొత్తగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపైనా బీఆర్ఎస్ నేతలతో కేసీఆర్ చర్చించారు. అలాగే ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై బలంగా పోరాటాలు చేయాలని నేతలను కేసీఆర్ ఆదేశించినట్లు తెలుస్తోంది. ప్రధానంగా పార్టీ బలోపేతం, కొత్త కమిటీల నియామకంపై దృష్టి సారించారు.

# హైకోర్టును ఆశ్రయించిన భగీరథ్



## రేపు విచారించనున్న వెకేషన్ బెంచ్

**హైదరాబాద్, మే 12:** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ హైకోర్టును ఆశ్రయించాడు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో మధ్యంతర బెయిల్ కోరుతూ బండి భగీరథ్ పిటిషన్ దాఖలు చేశాడు. హైకోర్టుకు వేసవి సెలవులు కావడంతో వెకేషన్ బెంచ్‌లో పిటిషన్ వేశాడు. పిటిషన్‌పై రేపు (గురువారం) హైకోర్టు వెకేషన్ బెంచ్ విచారణ జరిపే అవకాశం ఉంది. అయితే సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు బండి భగీరథ్ కేసుపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేస్తూ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసు సున్నితమైనది కావడంతో మహిళా ఐపీఎస్ అధికారి పర్యవేక్షణలో దర్యాప్తు కొనసాగించాలని డీజీపీ నిర్ణయించారు. ఇప్పటికే బాధితురాలి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశారు. సిట్ ఏర్పాటు నేపథ్యంలో మరోసారి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసే అవకాశం ఉంది. మరోవైపు బండి భగీరథ్ కోసం పోలీసుల గాలింపు కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించి అన్ని ఆధారాలను సేకరిస్తున్నామని, నేరం రుజువైతే నిందితుడిని కచ్చితంగా అరెస్ట్ చేస్తామని కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ స్పష్టం చేశారు.

## నేడు విచారణకు రావాలని భగీరథకు సిట్ నోటీసులు

కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం భగీరథ్‌కు నోటీసులు జారీ చేసింది. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు విచారణకు హాజరు కావాలని సిట్ అధికారులు ఆదేశించారు. సిట్ అధికారులు బుధవారం పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో భగీరథ్‌ను విచారించనున్నారు. ఈ కేసుకు సంబంధించిన పలు అంశాలపై ప్రశ్నించే అవకాశం ఉన్నట్లు సమాచారం. బాధితురాలి స్టేట్‌మెంట్ నమోదు చేసిన అనంతరం పోలీసులు ఈ కేసులోని సెక్షన్లను మార్చారు. గతంలో నమోదు చేసిన పోక్సో యాక్ట్ సెక్షన్లను సవరించారు.

# కవితకు రైల్వే కోర్టు సమన్లు

## నేడు సికింద్రాబాద్ కోర్టుకు హాజరుకావాలని ఆదేశం

## కవితతో పాటు మరో 12 మంది నేతలపై కేసులు



**హైదరాబాద్, మే 12:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల డిమాండ్ చేస్తూ నిర్వహించిన రైల్ రోకో కార్యక్రమం కేసులో తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు సమన్లు జారీ అయ్యాయి. బుధవారం విచారణకు హాజరు కావాలని సికింద్రాబాద్ రైల్వే కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కొంతకాలం క్రితం కామారెడ్డి జిల్లా కేంద్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ కవిత ఆధ్వర్యంలో రైల్ రోకో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే రవాణాకు అంతరాయం కలిగిందని రైల్వే ఏఎస్ఐ రవీంద్రబాబు ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైంది. రైల్ రోకోతో నిజామాబాద్–హైదరాబాద్ రూట్‌లో అంతరాయం ఏర్పడింది. నేటి ఉదయం 10:30కి విచారణకు హాజరు కావాలని సికింద్రాబాద్ రైల్వే కోర్టు ఆదేశించింది. దేవగిరి ఎక్స్‌ప్రెస్‌తో పాటు గూడ్స్ రైలు నిలిపివేతపై రైల్వే యాక్ట్ సెక్షన్ల కింద కవితపై న్యాయస్థానం కేసు నమోదు చేసింది. ఈ కేసులో కవితతో పాటు మరో 12 మంది బీఆర్ఎస్ నాయకులపై కూడా కేసులు నమోదయ్యాయి. రైల్వేచట్టాల ఉల్లంఘన, ప్రజా రవాణాకు ఆటంకం కలిగించడం వంటి ఆరోపణలపై కేసులు నమోదు చేసినట్లు తెలుస్తోంది. ఈ కేసు విచారణలో భాగంగా నేడు సికింద్రాబాద్ రైల్వే కోర్టుకు కవిత, బీఆర్ఎస్ నేతలు హాజరవుతారా లేదా అనేది ఉత్కంఠగా మారింది. బీసీ రిజర్వేషన్ల అంశం తెలంగాణ రాజకీయాల్లో కీలకంగా మారిన నేపథ్యంలో ఈ కేసు ప్రాధాన్యం సంతరించుకుంది.

# ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం సహించం

మొదటి పేజీ తరువాయి

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సీఎం ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలని.. గన్నీ బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటి కప్పుడు గోడౌన్స్‌కు తరలించాలని అన్నారు. ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉండేలా చూడాలని రవాణా శాఖ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాల్సిందే అని.. ప్రతి అధికారి జవాబుదారీ తనంతో వ్యవహరించాల్సిందే అని తేల్చిచెప్పారు. నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపై చర్యలకు ప్రభుత్వం వెనకాడదని హెచ్చరించారు. గోడౌన్స్ సమస్య ఉన్న ప్రాంతాల్లో అవసరాన్నిబట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. రైతుబజార్లు, ఫంక్షన్ హాల్స్‌ను ఎంగేజ్ చేసి ధాన్యాన్ని తరలించాలన్నారు. వెసులుబాటు ఆధారంగా అక్కడినుంచి గోడౌన్స్‌కు తరలించేలా ప్రణాళికలుండాలని తెలిపారు. కొనుగోళ్లపై ఎప్పటికప్పుడు సీఎస్‌కు పోర్ట్ పంపించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.



ధాన్యం లోడింగ్‌లో జాప్యం జరగకుండా స్థానికంగా ఉన్న హమామీలను గుర్తించి వారితో పని చేయించుకోవాలని రేవంత్ తెలిపారు. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో లారీల కొరత ఉంటే ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించాలని సూచించారు. అకాల వర్షాల సమయంలో ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. అకాల వర్షాల సమయంలో నష్టం జరగకుండా శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. వాతావరణ శాఖ సూచనల ఆధారంగా ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని సీఎం ఆదేశించారు. వాతావరణ సూచనలను రైతులకు చేరవేసేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి ఐకేపీ సెంటర్‌కు ఒక అధికారిని నియమించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి రైస్ మిల్లు దగ్గర ఒక బాధ్యతాయుతమైన అధికారిని నియమించి పర్యవేక్షించాలన్నారు. మిషన్ మోడ్‌లో పనిచేస్తేనే సమస్యలు వేగంగా పరిష్కారమవుతాయని తెలిపారు. కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు తలెత్తవని.. ఏ సమస్య వచ్చినా కలెక్టర్లదే బాధ్యత అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 2 నుంచి రెండో విడుత ఇండ్ల పంపిణీ

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రెండో విడత అమలుకు సంబంధించిన పూర్తి విధివిధానాలను ఈ నెల 21న జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి ఖరారు చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీలో జరుగుతున్న జాప్యంపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించేందుకు తక్షణమే 'స్పెషల్ డ్రైవ్' నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ నెలాఖరులోపు లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ పూర్తి కావాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా హైదరాబాద్ పరిధిలో సొంత స్థలాలు ఉండి, ఇల్లు లేని అర్హులకు ఈ నెల చివరలోనే మంజూరు పత్రాలు అందజేయాలని అధికారులకు డెడ్‌లైన్ విధించారు. గత ప్రభుత్వం నగరం నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఇళ్లు కట్టడం వల్ల పేదలు నివసించడానికి వెనుకాడుతున్నారని పొంగులేటి విమర్శించారు. "ప్రస్తుత ప్రభుత్వం ఆ తప్పు చేయదు. పేదవాడు నివసించే ప్రాంతానికి 5 నుండి 8 కిలోమీటర్ల పరిధిలోనే ఇళ్లు నిర్మించాలని నిర్ణయించాం. నియోజకవర్గాన్ని యూనిట్‌గా




తీసుకుని స్థల సేకరణ చేయాలి" అని అధికారులకు సూచించారు. కాలనీల్లో డ్రైనేజీ, మంచినీరు వంటి కనీస వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.

## సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలకు ఆదేశం

ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో మంత్రి కఠిన వైఖరిని ప్రదర్శించారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో నిబంధనలకు విరుద్ధంగా యూఎల్సీ భూములను రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంగుళం భూమి అన్యాక్రాంతమైనా సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో స్పీకర్ ప్రసాద్ కుమార్, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైనది

## వారిది ఉద్యోగం కాదు.. నిరంతర సేవ

## ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

## 1919 మంది నర్సింగ్ ఆఫీసర్లకు నియామక పత్రాలు

**హైదరాబాద్, మే 12:** ఆరోగ్యశాఖలో ఉద్యోగాలు పొందిన 1919 మంది నర్సింగ్ ఆఫీసర్లకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నియామక పత్రాలు అందజేశారు. కోఠి ఉస్మానియా మెడికల్ కాలేజీ గ్రౌండ్‌లో మంగళవారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, మీర్జా రహ్మత్ బేగ్, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ, డీఎంఈ నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, డీపీహెచ్ రవింద్ర నాయక్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నర్సులను ఉద్దేశించి ప్రసంగించారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని నర్సులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించిన నర్సింగ్ ఆఫీసర్లకు, వారి కుటుంబ సభ్యులకు హృదయపూర్వక అభినందనలు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం రోజునే నియామక పత్రాలు అందించడం ఎంతో సంతోషంగా ఉంది. ఈరోజు మీకు జీవితాంతం గుర్తుండిపోతుంది. నర్సింగ్ అనేది కేవలం ఒక వృత్తి కాదు.. మానవత్వానికి చేసే గొప్ప అవకాశం. రోగులకు చికిత్స అందించడమే కాదు.. వారికి ధైర్యం, భరోసా, ఆశను కల్పించేది నర్సులే. ప్రపంచ నర్సింగ్ రంగానికి మార్గదర్శకురాలైన ఫ్లోరెన్స్ నైటింగేల్ సేవలను ఈ సందర్భంగా మనం స్మరించుకోవాలి. పరిశుభ్రత,



క్రమశిక్షణ, శాస్త్రీయ వైద్య సేవల ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయురాలు ఆమె. మీరు అందరూ ఆమెను ఆదర్శంగా తీసుకుని పనిచేయాలి. కోవిడ్‌లో కుటుంబ సభ్యులు కూడా పేషెంట్ల దగ్గర ఉండలేని పరిస్థితి, అటువంటి భయంకర మైన పరిస్థితుల్లో కూడా నర్సులు సేవలు అందించారు. తెలంగాణ ప్రజలు ఆ సేవలను ఎప్పటికీ గుర్తుంచు కుంటారు. గతంలో ప్రభుత్వ హాస్పిటళ్లలో భారీగా ఖాళీలు ఉండటం వల్ల వైద్య సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి ఉండేది. ఈ సమస్యను మా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో తీసుకుని భారీ స్థాయిలో నియామకాలు చేపట్టింది. గత రెండున్నరేళ్లలో ఆరోగ్యశాఖలో దాదాపు 13 వేల పోస్టులను భర్తీ చేశాం. ఇదే గ్రౌండ్‌లో ఇప్పటికే 1,257 మంది ల్యాబ్ టెక్నీషియన్లకు నియామక పత్రాలు అందజేశాం. ఇక్కడే 623 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్‌లకు నియామక పత్రాలు అందించాం. ఇక్కడే 132 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్‌లకు నియామక పత్రాలు అందించాం. ఈరోజు ఇక్కడే 1919 మంది నర్సింగ్ ఆఫీసర్లకు నియామక పత్రాలు అందిస్తున్నాం అని మంత్రి వివరించారు. గతంలో 6956 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులు భర్తీ చేశాం. రెండున్నర సంవత్సరాల్లో 9 వేల నర్సింగ్ పోస్టులను భర్తీ చేసిన ఘనత మన ప్రభుత్వానికి దక్కుతుంది. దాదాపు మరో 5 వేల పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో సుమారు 2 వేల ఏఎన్ఎం పోస్టుల ఫలితాలు మరో ఒకటి, రెండు రోజుల్లో ప్రకటిస్తాం. న్యాయపరమైన కారణాలతో ఆలస్యమైన 732 ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీని కూడా త్వరలో పూర్తి చేస్తాం అని మంత్రి దామోదర వెల్లడించారు.

# సనత్‌నగర్ టిమ్స్‌లో వైద్యసేవల ట్రయల్ రన్

## స్వయంగా పరిశీలించిన మంత్రి దామోదర

## జూన్‌లో ప్రారంభిస్తామని వెల్లడి

**హైదరాబాద్, మే 12:** సనత్‌నగర్ టిమ్స్‌లో జరుగుతున్న వైద్య సేవల ట్రయల్ రన్‌ను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పరిశీలించారు. హాస్పిటల్ బ్లాకులన్నీ మంత్రి కలియ తిరిగారు. ఓపీ రిజిస్ట్రేషన్, ఐపీ వార్డులు, ఎమర్జెన్సీ డిపార్ట్ మెంట్, సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ల్యాబులు, మెకనైజ్డ్ ల్యాండ్రీ, కిచెన్ తదితర అన్ని డిపార్ట్‌మెంట్లను మంత్రి పరిశీలించారు. పెండింగ్ పనులన్నీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ, ఆరోగ్యశాఖ అధికారులకు మంత్రి సూచించారు. హాస్పిటల్‌కు నీళ్లు, పవర్ సప్లైలో ఎలాంటి ఆటంకం ఉండకూడదని, 24 గంటల సరఫరా ఉండాలని మంత్రి సూచించారు. ఫైర్ సేఫ్టీ విషయంలో రాజీ ఉండకూడదని, అన్ని ఫ్లోర్లలో మరోసారి పూర్తిస్థాయి పరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు. రిసెప్షన్ ఏరియా, హెల్ప్ డెస్క్, ఓపీ కౌంటర్లు, వెయిటింగ్ హాల్, ఓపీ కన్సల్టేషన్



రూమ్స్, డయాగ్నస్టిక్స్, ఇన్ పేషెంట్ వార్డులు, ఫార్మసీ తదితర ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి.. రిజిస్ట్రేషన్ కౌంటర్స్, ఫార్మసీ కౌంటర్స్ పెంచాలని మంత్రి సూచించారు. సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ఎక్స్ రే, అల్ట్రాసౌండ్ తదితర యంత్రాలను పరిశీలించిన మంత్రి.. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ యంత్రాలు పూర్తిస్థాయిలో పేషెంట్లకు ఉపయోగపడాలని, ఇందుకు అవసరమైన డాక్టర్లు, ఇతర సిబ్బందిని సిద్ధంగా ఉంచుకోవాలని ఆరోగ్యశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. జూన్‌లో సనత్‌నగర్ టిమ్స్‌ను ప్రారంభిస్తామని అన్నారు. ఇక్కడ సక్సెస్‌ఫుల్‌గా వైద్య సేవల ట్రయల్ రన్ జరుగుతోంది. కొన్ని ఫినిషింగ్ వర్క్స్ జరుగుతున్నాయి. ఆ పనులన్నీ గడువులోగా పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ, ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించామన్నారు. ఇది వెయ్యి బెడ్ల హాస్పిటల్, ఇందులో 300 ఎమర్జెన్సీ బెడ్లు ఉంటాయి. అత్యవసర పరిస్థితుల్లో బాధితుల ప్రాణాలు నిలిపే గొప్ప హాస్పిటల్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నాం. గుండె సంబంధిత వ్యాధుల చికిత్సలు, ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీలకు ఈ హాస్పిటల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ఉంటుందని వివరించారు. ఇక్కడే అద్భుతమైన రీసెర్చ్ సెంటర్ అందుబాటులోకి తీసుకొస్తాం అని దామోదర అన్నారు.



# చిన్నారి హత్య కేసులో నిందితుడికి మరణ శిక్ష

## కూకట్‌పల్లి కోర్టు సంచలన తీర్పు

**హైదరాబాద్, మే 12:** ఓ బాలుడి హత్య కేసులో కూకట్‌పల్లి కోర్టు సంచలన తీర్పునిచ్చింది. చిన్నారిని హత్య చేసిన వ్యక్తికి మరణశిక్ష విధించింది. హైదరాబాద్ సనత్‌నగర్‌లో 2023 సంవత్సరంలో జరిగిన మైనర్ హత్యోదంతం సంచలనం సృష్టించింది. ఇమ్రాన్ అలీ ఖాన్ (33) అనే వ్యక్తి చిన్నారిని హత్య చేయగా.. అతనికి మహమ్మద్ రఫీక్ (32) సహకరించాడనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనపై సనత్‌నగర్ పోలీసులు అప్పుడే కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులు ఇమ్రాన్ అలీ ఖాన్, మహమ్మద్ రఫీక్‌ను గుర్తించి అరెస్టు చేశారు. కేవలం సాంకేతిక సాక్ష్యాలతో కేసును ఛేదించి.. వివరాలను కోర్టుకు సమర్పించారు. పకడ్బందీగా సాక్ష్యాలు ఉండటంతో సంతృప్తి చెందిన కూకట్‌పల్లి కోర్టు.. చిన్నారిని వారే హత్య చేసినట్లు నిర్ధారిస్తూ దోషులుగా తేల్చింది. ఇమ్రాన్ అలీ ఖాన్‌కు మరణశిక్ష, అతనికి సహకరించిన మహమ్మద్ రఫీక్‌కు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. ఈ మేరకు 3వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎం.వెంకటేశ్వర రావు తీర్పు వెలువరించారు.

# వరంగల్‌లో మూడు చోట్ల చైన్ స్నాచింగ్‌లు

## ఆందోళనలో స్థానిక ప్రజలు

**వరంగల్, మే 12:** జిల్లాలో చైన్ స్నాచర్లు, పోకిరీల రెచ్చిపోతున్నారు. సోమవారం రాత్రి మూడు చోట్ల చైన్ స్నాచింగ్ సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఒక వ్యక్తితో సహా ఇద్దరు మహిళల మెడలో బంగారు గొలుసులను దొంగలు తెంచుకెళ్లారు. ఈ సంఘటనలు స్థానికులను తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నాయి. వరంగల్ మిల్స్ కాలనీలో పోకిరీలు హంగామా సృష్టించారు. రాత్రి సమయంలో కొందరు యువకులు బైక్‌లపై తిరుగుతూ ప్రజలను భయపెడుతున్నట్లు తెలుస్తోంది. కాలనీలోని ఓ టీ స్టాల్ యజమానిపై పోకిరీలు దాడి చేశారు. దాడిలో టీ స్టాల్ యజమాని తీవ్రంగా గాయపడ్డాడని, అతన్ని స్థానికులు ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. నగరంలో పోలీసు పెట్రోలింగ్ పూర్తిగా కనిపించడం లేదని ప్రజలు తీవ్రంగా విమర్శలు గుప్పిస్తున్నారు. రాత్రి సమయంలో మహిళలు, వృద్ధులు ఒంటరిగా బయటకు రావడానికి భయపడుతున్న పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. రాత్రి సమయాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురంలో దొంగలు బీభత్సం సృష్టించారు. రాత్రి ఓ ఇంటి తాళాలు పగలగొట్టిన దుండగులు భారీగా బంగారు నగలు, వెండిని అపహరించారు. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# సంగారెడ్డిలో అగ్నిప్రమాదం

## గోడౌన్‌లో మంటలు చెలరేగి వాహనాలు దగ్ధం

**సంగారెడ్డి, మే 12:** సంగారెడ్డి జిల్లాలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. పటాన్‌చెరులోని శ్రీరామ్ ఆటో ఫైనాన్స్‌కు చెందిన వాహనాల గోడౌన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ మంటల్లో మూడు టిప్పర్లు, డీసీఎం, రెండు ఆటోలు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోడౌన్‌లో నిల్వ ఉంచిన వాహనాల మధ్య నుంచి మంటలు వ్యాపించాయి. క్షణాల్లోనే మంటలు తీవ్రరూపం దాల్చడంతో గోడౌన్ మొత్తం దగ్ధమైంది. అక్కడ పార్క్ చేసిన పలు కార్లు పూర్తిగా కాలిపోయినట్లు సమాచారం. అగ్నిప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# బీదర్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

## బైకును ఢీకొని బోల్తాపడ్డ కర్నారటక ఆర్టీసీ బస్సు

## ప్రమాదంలో ముగ్గురు మృతి...ఇద్దరు సంగారెడ్డి వాసులు

**సంగారెడ్డి, మే 12:** కర్ణాటకలోని బీదర్ సమీపంలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రహదారిపై వెళ్తున్న బైక్‌ను కర్ణాటక రోడ్డు రవాణా సంస్థకు చెందిన బస్సు ఢీ కొట్టింది. అనంతరం ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఐదుగురు ప్రయాణికులు అక్కడికక్కడే మరణించారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. అదే రహదారిపై వెళ్తున్న వాహనదారులు వెంటనే స్పందించి.. పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను బీదర్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుల్లో ఇద్దరు సంగారెడ్డి జిల్లా వాసులు ఉన్నారని పోలీసులు వివరించారు. బీదర్ నుంచి ఆర్టీసీ బస్సు హైదరాబాద్ వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు చెప్పారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం నిమిత్తం బీదర్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంపై మృతుల కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించారు.

# ఆనాటి జైళ్లు దుర్భరంగా ఉండేవి

- బ్రిటిష్ హయాంలో నరక కూపాలుగా జైళ్లు
- తానూ ఎమర్జెన్సీలో జైలుకు వెళ్లి వచ్చా
- చంచల్‌గూడాలో మ్యూజియం, ఫీల్ ది జైల్ ప్రారంభంలో గవర్నర్



**హైదరాబాద్, మే 12:** స్వాతంత్ర్యానికి ముందు జైళ్లు ఎంత అమానవీయంగా ఉండేవో ప్రజలకు తెలియజేయాల్సి ఉందని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తెలిపారు. మంగళవారం చంచల్‌గూడ జైలులో ఏర్పాటు చేసిన మ్యూజియం, ఫీల్ ది జైల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ.. స్వాతంత్రానికి పూర్వం జైల్లో గడిపిన వారు ఎలా ఉండేవారనే విషయం ఈ మ్యూజియంను చూస్తే తెలుస్తుందన్నారు. తెలంగాణ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో మ్యూజియం, ఫీల్ ది జైల్ ప్రారంభించడం తనకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ మ్యూజియంలో ఉన్నది కేవలం ఇతిహాసానికి సంబంధించిన వస్తువులు కాదన్నారు. స్వాతంత్రానికి ముందు జైళ్లలో ఉన్నవారు ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నారో ఈ మ్యూజియం ద్వారా తెలుస్తుందని చెప్పారు. శిక్షల పేరుతో సంస్కారాన్ని, శరీరాన్ని, మనస్తత్వాన్ని విరగ్గొట్టే ప్రయత్నం చేశారని బ్రిటిష్ పాలనలో సాగిన అకృత్యాలను ఆయన వివరించారు. మన కోసం మన పూర్వీకులు పడ్డ కష్టాన్ని తెలుసుకునేందుకు ప్రతి ఒక్కరు ప్రయత్నం చేయాలని ప్రజలకు తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. విద్యార్థి నాయకుడిగా ఉన్న సమయంలో తాను పలుమార్లు జైలుకు వెళ్లానన్నారు. ఎమర్జెన్సీ సమయంలో 21 రోజులు తాను జైల్లో ఉన్నానని ఆయన గుర్తు చేసుకున్నారు. అప్పుడే జైలు ఎలా ఉంటుందో తనకు తెలిసిందని వివరించారు. గతంలో ఉత్తరప్రదేశ్‌లో కళ్యాణ్ సింగ్ ప్రభుత్వంలో జైళ్ల శాఖ మంత్రిగా తాను పని చేశానని తెలంగాణ గవర్నర్ గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా జైళ్లలో తాను పలు సంస్కరణలు తీసుకొచ్చానని తెలిపారు. ఈ సంస్కరణలతో ఖైదీలు సంతోషం వ్యక్తం చేశారని చెప్పారు. ఈ రోజు మ్యూజియంలో చూసిన దృశ్యాలతో.. మళ్లీ ఆనాటి జ్ఞాపకాలు తనకు గుర్తుకు వచ్చాయన్నారు. ఖైదీలలో ప్రతి ఒక్కరూ క్రిమినల్స్ కాదని.. పరిస్థితులు వారిని ఆ సమయంలో నిందితులుగా మార్చాయని వివరించారు. ఖైదీలలో మార్పు తీసుకురావడానికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జైలు అధికారులకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. మరోసారి తప్పుచేసే ఆలోచన రాకుండా ఖైదీల్లో పరివర్తన తీసుకురావాలని అధికారులకు స్పష్టం చేశారు. సాధారణ ప్రజల కోసం చంచల్‌గూడ జైలు అధికారులు వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. జైలు ఆవరణలో 'జైల్ మ్యూజియం', 'ఫీల్ ది జైల్' పేరుతో ప్రత్యేక బ్లాక్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ప్రారంభించారు. ఇప్పటికే గోవా, కోల్‌కతా వంటి ప్రాంతాల్లో జైలు మ్యూజియాలు ఉన్నాయి. తాజాగా హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలు కూడా ఈ జాబితాలో చేరింది. జైల్ మ్యూజియంలో జైలు చరిత్ర, ఉపయోగించిన పాత వస్తువులు, ఖైదీల జీవితం, శిక్షల విధానాలు వంటి అంశాలను ప్రదర్శించనున్నారు. ఇది విద్యార్థులు, పర్యాటకులు, సాధారణ ప్రజలకు జైలు వ్యవస్థ గురించి అవగాహన కల్పించడానికి ఉపయోగపడనుంది. 'ఫీల్ ది జైల్' బ్యారక్ ద్వారా సాధారణ ప్రజలు ఒకరోజు జైలు జీవితాన్ని అనుభవించేలా జైలు అధికారులు అవకాశం కల్పించారు. ఫీజు చెల్లించి రిజర్వేషన్ చేసుకున్నవారు జైలు రూల్స్ ప్రకారం ఒక రోజు బ్యారక్‌లో ఉండి, జైలు ఆహారం, రొటీన్ కార్యకలాపాలు, శిక్షల వాతావరణాన్ని అనుభవించవచ్చు. ఇది జైలు జీవితం ఎంత కష్టమో అర్థం చేసుకోవడానికి సహాయపడుతుందని అధికారులు తెలిపారు.

# కన్నపేగు తల్లడిల్లుతోంది.. నా కుటుంబాన్ని బజారున పడేశారు

- నా కొడుక్కి సమయం ఇవ్వకపోవడమే నేను చేసిన తప్పు
- తప్పు చేస్తే నా కొడుకైనా శిక్ష అనుభవించాల్సిందే
- కుట్రలు చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు
- లంకను దహనం చేసినట్లు అవినీతి వ్యవస్థను అంతం చేస్తా
- 'హిందూ ఏక్తా యాత్ర'లో కేంద్ర మంత్రి బండి సంజయ్





**కరీంనగర్, మే 12:** తన కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసుపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తొలిసారి స్పందిస్తూ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. మంగళవారం కరీంనగర్‌లో నిర్వహించిన 'హిందూ ఏక్తా యాత్ర'లో పాల్గొన్న ఆయన, ఈ వ్యవహారంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. చట్టానికి ఎవరూ అతీతులు కారని, తప్పు చేసిన వారు తన కుమారుడైనా సరే శిక్ష అనుభవించాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. అయితే, తన కుమారుడిని ఒక నేరస్థుడిలా చూపేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. "బండి సంజయ్‌ను గెలికారు.. నా కుటుంబాన్ని బజారున పడేశారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా నా కుటుంబంపై దాడి చేస్తున్న ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు" అని సంజయ్ హెచ్చరించారు. హనుమంతుడి తోకకు నిప్పు పెడితే లంక మొత్తం దహనమైనట్లు, తనకు పెట్టిన ఈ నిప్పుతో రాష్ట్రంలోని దళారీ, అవినీతి, కుటుంబ పాలన వ్యవస్థలను దహనం చేస్తానని ధ్వజమెత్తారు. తన కుమారుడు ఏ తప్పూ చేయలేదని తనతో చెప్పాడని, ఈ కేసు నుంచి నిర్దోషిగా బయటకు వస్తాడన్న నమ్మకం తనకు ఉందని పేర్కొన్నారు. ప్రజలే తన కుటుంబమని భావించి, తన సొంత పిల్లల కంటే ప్రజల కోసమే ఎక్కువ సమయం కేటాయించానని సంజయ్ చెప్పారు. "నా కుమారుడికి సమయం ఇవ్వలేకపోయాను, కనీసం మాట్లాడలేదు. అదే నేను చేసిన తప్పు. ఇందుకోసం బీజేపీ కార్యకర్తలకు క్షమాపణలు చెబుతున్నాను" అని పేర్కొన్నారు. తన భార్య ప్రస్తుతం తీవ్ర డిప్రెషన్‌లో ఉందని, కన్నపేగు తల్లడిల్లిపోతోందని చెబుతూ ఆయన భావోద్వేగానికి గురయ్యారు. తనపై జరుగుతున్న కుట్రలు, తప్పుడు ప్రచారాలను కార్యకర్తలు నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. తన గుండె మీద కాషాయ జెండా, తల మీద అమ్మవారి ఆశీస్సులు ఉన్నాయని, ధర్మం కోసమే తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. శ్రీరామచంద్రుడికే అరణ్యవాసం తప్పలేదని, ఈ కష్టకాలం నుంచి తాము మరింత బలంగా బయటకు వస్తామని ధీమా వ్యక్తం చేశారు.

# పోక్సో కేసులో కుల ప్రసక్తి ఉండదు

## చట్టం అందరికీ ఒకేలా ఉంటుంది

## టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్



**హైదరాబాద్, మే 12:** తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ వాఖ్యలను టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఖండించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కేసు వ్యవహారంలో మంత్రి పొన్నం చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి లేదా ప్రభుత్వానికి పొన్నం వ్యాఖ్యలతో ఎలాంటి సంబంధం లేదని తేల్చిచెప్పారు. మంగళవారం గాంధీభవన్‌లో మహేశ్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. కులసంఘం మధ్యవర్తిత్వం, వివాహం ద్వారా ఇలాంటి తీవ్రమైన కేసులను పరిష్కరించుకోవాలని పొన్నం అన్నారని తెలిపారు. పొన్నం సూచనలను కాంగ్రెస్ ఖండిస్తోందని మహేశ్ గౌడ్ వ్యాఖ్యానించారు. మైనర్ల విషయంలో చట్టపరంగా ఇబ్బందులు తప్పవని చెప్పుకొచ్చారు. పోక్సో చట్టప్రకారం నిందితులకు కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. నేర పరిశోధనలో నిందితుడి కులం లేదా సామాజిక హోదాతో సంబంధం లేదని తెలిపారు. బండి సంజయ్ ఈ కేసులో కుల రాజకీయాలను తీసుకురావడం దురదృష్టకరమని అన్నారు. ఈ కేసులో ఎవరినీ వ్యక్తిగతంగా టార్గెట్ చేయాల్సిన అవసరం కాంగ్రెస్‌కి ఏమాత్రం లేదని స్పష్టం చేశారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని తేల్చిచెప్పారు. 'నారీ శక్తి' అని నినాదాలు చేసే బీజేపీ, ఇప్పుడు బాలికపై జరిగిన దాడి విషయంలో మౌనంగా ఉండటం దేనికి సంకేతం..? అని మహేశ్ గౌడ్ ప్రశ్నించారు. బాలిక కుటుంబ సభ్యులను భగీరథ్ బెదిరిస్తున్నట్లు వస్తున్న వార్తలపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని అన్నారు. నిజమని తేలితే పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ కేసు విషయంలో ఎలాంటి రాజకీయ జోక్యం, కుల మతాల ప్రభావం లేకుండా పారదర్శకంగా విచారణ జరుగుతుందని స్పష్టం చేశారు. నిందితుడు ఎంతటి శక్తివంతుడైనా సరే, బాధితురాలికి తాము అండగా నిలుస్తామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# చెరువులు, సరస్సులు, వెట్‌ల్యాండ్స్ పరిరక్షణ


## మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్, మే 12:** తెలంగాణ రాష్ట్రంలో చెరువులు, సరస్సులు, వెట్‌ల్యాండ్స్ పరిరక్షణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల సమీక్షా సమావేశం మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర వెట్‌ల్యాండ్స్ అథారిటీ కార్యకలాపాలు, వెట్‌ల్యాండ్స్ కాలుష్య నియంత్రణపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్రంలోని చెరువులు, సరస్సుల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు సమగ్ర వివరాలు సమర్పించారు. ఈ సమావేశానికి అటవీ, రెవెన్యూ, ఇరిగేషన్, ఫిషరీస్ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్రంలోని చెరువులు, సరస్సుల పునరుద్ధరణ, అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికపై సమీక్షించారు. వెట్‌ల్యాండ్స్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. చెరువుల ఆక్రమణలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. అక్రమ నిర్మాణాలు, కాలుష్య నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు ప్రత్యేక చర్యలు అవసరమని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. పక్షులు, జలచరాలు, పర్యావరణ సమతుల్యతకు వెట్‌ల్యాండ్స్ కీలకమని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో వెట్‌ల్యాండ్స్ పాత్ర అత్యంత ముఖ్యమని, వాటి సంరక్షణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వెట్‌ల్యాండ్స్ మ్యాపింగ్, మానిటరింగ్ పక్రియపై కూడా సమావేశంలో చర్చించారు. చెరువుల స్థితిగతులు, ఆక్రమణలు, కాలుష్య పరిస్థితులపై నిరంతర పర్యవేక్షించాలని అధికారులు అభిప్రాయపడ్డారు. చెరువుల పునరుద్ధరణకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భూగర్భ జలాల సంరక్షణలో కూడా వెట్‌ల్యాండ్స్ కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెట్‌ల్యాండ్స్ సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, జీవ వైవిధ్య పరిరక్షణలో కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు.

13-05-26 Samayam_Layout 1 5/13/2026 5:21 AM Page 4





## సంపాదకీయం

# ఖర్చుల తగ్గింపు

## మోదీ నుంచే మొదలవ్వాలి!

**ప్రజలకు పొదుపు పాఠాలు చెప్పే ముందు రాజకీయ దుబారా తగ్గించాలి**

**జీతభత్యాలు, కాన్వాయ్‌లు, విదేశీ టూర్లపై కోత విధించాలన్న డిమాండ్**

**దేశంలో ఖర్చులు తగ్గించుకోవాలని ప్రధాని నరేంద్రమోదీ పిలుపు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. బంగారం కొనుగోళ్లు తగ్గించాలి.. ఇంధన వినియోగాన్ని నియంత్రించాలి.. వాహనాల వినియోగాన్ని తగ్గించాలి అంటూ ప్రధాని చేసిన సూచనలు దేశ ఆర్థిక పరిస్థితులపై కొత్త చర్చకు దారితీశాయి. అయితే "ఈ ఖర్చుల తగ్గింపు ఎక్కడి నుంచి మొదలవ్వాలి?" అన్న ప్రశ్న ఇప్పుడు బలంగా వినిపిస్తోంది.**

సామాన్యులకు పొదుపు పాఠాలు చెప్పే ముందు రాజకీయ నాయకుల దుబారా ఖర్చులపై కత్తెర వేయాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాని నుంచి ఎమ్మెల్యేల వరకు జీతభత్యాలు, కాన్వాయ్‌లు, ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్లు, విదేశీ పర్యటనలు, అట్టహాసపు సభలు, ప్రమాణ స్వీకార వేడుకల ఖర్చులను తగ్గించాలని ప్రజల్లో డిమాండ్ పెరుగుతోంది.

దేశ ప్రజలు ఇంధన వినియోగం, బంగారం కొనుగోళ్లు, వంటనూనెల వినియోగం తగ్గిస్తే విదేశీ మారక ద్రవ్య నిల్వలు పెరుగుతాయని కేంద్రం అంచనా వేస్తోంది. ఏడాదిలో దాదాపు 4500 కోట్ల డాలర్ల మేర విదేశీ మారక నిల్వలు ఆదా చేయవచ్చని చెబుతోంది. కానీ అదే సమయంలో రాజకీయ వ్యవస్థలో జరుగుతున్న కోట్లాది రూపాయల దుబారా ఖర్చులపై కూడా చర్యలు తీసుకోవాలనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రత్యేక విమానాల్లో పర్యటనలు, భారీ కాన్వాయ్‌లు, విలాసవంతమైన ప్రభుత్వ ఖర్చులు, రాజకీయ ప్రచారాల కోసం ప్రజాధన వినియోగం, ఉచిత పథకాల పేరిట ఖజానాపై పడుతున్న భారాన్ని తగ్గించకుండా కేవలం సామాన్యులకు మాత్రమే పొదుపు సందేశాలు ఇవ్వడం ఎంతవరకు సమంజసం అన్న ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.

**రాజకీయ నాయకుల జీతాలు, పెన్షన్లు, విదేశీ టూర్లు, ప్రభుత్వ వాహనాల వినియోగంపై కఠిన నియంత్రణలు అవసరమని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులు దెబ్బతింటున్న సమయంలో అనవసర ఖర్చులను తగ్గించకపోతే భవిష్యత్తులో మరింత సంక్షోభం తలెత్తే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.**

ఇక బంగారం కొనుగోళ్లపై ప్రధాని చేసిన వ్యాఖ్యలు కూడా చర్చకు దారితీశాయి. భారతీయులు ఏడాదికి 700 నుంచి 900 టన్నుల వరకు బంగారం కొనుగోలు చేస్తున్నారని అంచనా. ఇందులో ఎక్కువ భాగం విదేశాల నుంచే దిగుమతి అవుతోంది. దీంతో భారీ స్థాయిలో విదేశీ మారక ద్రవ్యం ఖర్చవుతోంది. కాబట్టి బంగారం కొనుగోళ్లు తగ్గిస్తే దేశ ఆర్థిక వ్యవస్థకు మేలు జరుగుతుందని కేంద్రం భావిస్తోంది. అయితే "స్వయం సమృద్ధి", "డిజిటల్ ఇండియా", "మేక్ ఇన్ ఇండియా", "అచ్చే దిన్" వంటి భారీ నినాదాల మధ్య సామాన్యుడి జీవితం మాత్రం ఇంకా భారంగానే ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. విద్య, వైద్యం, నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగిపోయాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుతోందని ప్రభుత్వం చెబుతున్నా.. అదే సమయంలో అప్పులు, నిరుద్యోగం, పెరిగిన జీవన వ్యయం సామాన్యుడిని ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్న విమర్శలు ఉన్నాయి. "రాజకీయ నాయకులు బలపడుతున్నారు.. ప్రజలు బలహీనపడుతున్నారు" అన్న భావన కూడా ప్రజల్లో పెరుగుతోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అందుకే ఖర్చుల తగ్గింపు అనే ఆలోచన నిజంగా కార్యరూపం దాల్చాలంటే అది రాజకీయ వ్యవస్థ నుంచే ప్రారంభం కావాలనే డిమాండ్ బలపడుతోంది. ప్రధాని మోదీ ముందడుగు వేసి రాజకీయ నాయకుల జీతభత్యాలు, పెన్షన్లు, విదేశీ పర్యటనలు, విలాసవంతమైన ఖర్చులపై నియంత్రణలు తీసుకొస్తేనే ప్రజలకు ఇచ్చే సందేశానికి విశ్వసనీయత పెరుగుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# నీట్ ప్రవేశ పరీక్ష రద్దు

- పేపర్ లీక్ వ్యవహారంతో ఎన్‌టిఎ నిర్ణయం
- సీబీఐ విచారణకు ఆదేశించినట్లు వెల్లడి






**న్యూఢిల్లీ, మే 12:** జాతీయ అర్హత పరీక్ష నీట్ యూజీ-2026ను రద్దు చేసారు. పేపర్ లీక్ ఆరోపణలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. నీట్ పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రం రాజస్థాన్‌లో లీకైనట్లు వచ్చిన వార్తలు పెనుదుమారం రేపాయి. ఈ నేపథ్యంలో జాతీయ పరీక్ష సంస్థ (ఎన్‌టీఏ) కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా మే 3న జరిగిన నీట్ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. త్వరలోనే కొత్త పరీక్ష తేదీలను వెల్లడిస్తామని తెలిపింది. విద్యార్థుల ప్రయోజనాలు, జాతీయ పరీక్షా వ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని కాపాడేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్‌టీఏ వెల్లడించింది. కొత్త పరీక్ష కోసం విద్యార్థులు మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని, పరీక్ష ఫీజు చెల్లించనక్కర్లేదని తెలిపింది. పరీక్ష తేదీలను నిర్ణయించిన తర్వాత మళ్లీ అడ్మిట్ కార్డులు విడుదల చేస్తామని పేర్కొంది. ఇక, ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్‌టీఏ తెలిపింది. ఈనెల 3న జరిగిన నీట్ పరీక్షలో కెమిస్ట్రీ విభాగంలో వచ్చిన సుమారు 120కి పైగా ప్రశ్నలతో ఉన్న ఓ ప్రాక్టీసు పేపరును గుర్తించినట్లు రాజస్థాన్ అదనపు డీజీపీ విశాల్ బన్సాల్ వెల్లడించారు. ఈ మెటీరియల్ రాజస్థాన్‌లోని సికార్‌లో పరీక్షకు 42 గంటల ముందు వాట్సాప్‌లో అందుబాటులోకి వచ్చినట్లు గుర్తించారు. ఇందులోని సమాచారం.. నీట్ ప్రశ్నపత్రంలోని 600 మార్కుల ప్రశ్నలతో పోలి ఉండటం గమనార్హం. కొన్ని ప్రశ్నల్లోని జవాబుల క్రమం కూడా అచ్చం ఒకేలా ఉండడం పలు అనుమానాలకు తావిచ్చింది. ఆ ప్రాక్టీసు పేపరు కేరళలోని ఓ వైద్య కళాశాలలో చదువుతున్న ఎంబీబీఎస్ విద్యార్థికి చెందినదిగా దర్యాప్తులో వెల్లడైంది. ఆ వ్యక్తి ఈనెల 1న సికార్‌లోని తన స్నేహితుడికి ఈ మెటీరియల్ ఇచ్చాడని.. ఆ తర్వాత అది పీజీ వసతిగృహాలు, కోచింగ్ నెట్‌వర్క్‌లు, కెరీర్ కౌన్సిలర్లు, పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు చేరిందని అధికారులు తెలిపారు. ఆ మెటీరియల్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీకి సంబంధించిన 300కు పైగా చేతిరాత ప్రశ్నలు ఉన్నాయని వెల్లడించారు. దీనిని విద్యార్థులకు రూ.20వేల నుంచి రూ.2 లక్షల వరకు విక్రయించారని, కొందరు అభ్యర్థుల నుంచి ముందుగానే రూ.30 వేలకు పైగా వసూలుచేశారని గుర్తించామని రాజస్థాన్ పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి ఇప్పటికే పలువురు అనుమానితులను అరెస్ట్ చేశారు.

# బడులు, గుడులు, బస్టాండ్ల వద్ద వైన్‌షాప్‌ల ఎత్తివేత

- రెండు వారాల్లోగా మూసేయాలంటూ ఆదేశాలు
- తమిళ సీఎం విజయ్ సంచలన నిర్ణయం
- విజయ్ సోషల్ మీడియాకు పెరుగుతున్న ఆదరణ



**చెన్నై, మే 12:** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థలు, దేవాలయాలు, బస్‌స్టాండ్స్‌కి 500 మీటర్ల దూరంలో ఉన్న 717 వైన్ షాపులన్నింటినీ క్లోజ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. తమిళనాడు రాష్ట్ర మార్కెటింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ దుకాణాలను రెండు వారాల్లోగా మూసివేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత విజయ్ జారీ చేసిన తొలి ఉత్తర్వు ఇది. ప్రస్తుతం తమిళనాడు రాష్ట్రంలో టాస్మాక్ 4,765 మద్యం దుకాణాలను నిర్వహిస్తోంది. వీటిలో 276 మద్యం దుకాణాలు ప్రార్థనా స్థలాల సమీపంలో, 186 విద్యా సంస్థల సమీపంలో, 255 బస్ స్టాండ్‌ల సమీపంలో ఉన్నాయి. వీటిని వెంటనే తొలగించాలని సీఎం ఆదేశించారు. కాగా మద్యం అమ్మకాల ద్వారానే రాష్ట్రానికి భారీగా ఆదాయం సమకూరుతోంది. అయినప్పటికీ.. ప్రజా సంక్షేమం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తమిళనాడు ప్రభుత్వం వెల్లడించింది. 2025 సంవత్సరంలో మద్యం అమ్మకాల ద్వారా రాష్ట్రానికి రూ.48,000 కోట్ల ఆదాయం వచ్చినట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఇకపోతే తమిళనాట దళపతి విజయ్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. వయసుతో సంబంధం లేకుండా అన్ని వర్గాల్లో ఆయనను అభిమానించే వారు ఉన్నారు. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పార్టీ ఏకంగా 108 స్థానాల్లో విజయం సాధించింది. రెండు రోజుల క్రితం విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ముఖ్యమంత్రి హోదాలో అసెంబ్లీకి వెళ్లారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగానే తమిళనాడు సీఎంఓ ఆఫీస్ సోషల్ మీడియా ఖాతాల డీపీలు మారాయి. ముఖ్యమంత్రి విజయ్ ఫొటోలను డీపీలుగా పెట్టారు. విజయ్ ఫొటో డీపీగా పెట్టిన గంటల్లోనే మ్యాజిక్ జరిగింది. సోషల్ మీడియా ఖాతాలకు ఫాలోవర్స్ క్యూ కట్టారు. తమిళనాడు సీఎంఓ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు మొదట 4 లక్షల ఫాలోవర్స్ ఉండేవారు. విజయ్ ఫొటో పెట్టిన తర్వాత 16 లక్షలకు ఫాలోవర్స్ సంఖ్య పెరిగింది. ఇక ఎక్స్ ఖాతాకు కూడా 4 లక్షల మంది ఫాలోవర్స్ ఉండేవారు. ఇప్పుడు 22 లక్షల మంది అయ్యారు. అందుకే ఆయన తీసుకునే నిర్ణయాలకు ప్రజలు జై కొడుతున్నారు.



# నీట్ పేపర్ లీక్ కేసు

## 13మందిని అరెస్ట్ చేసిన పోలీసులు

**జైపూర్, మే 12 :** రాజస్థాన్‌లోని సికార్‌లో నీట్ పేపర్ లీక్ కేసు వ్యవహారంలో 13 మందిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వీరిని పోలీసులు విచారిస్తున్నారు. 'గెస్ పేపర్' పేరుతో మార్కెట్‌లోకి ఈ నీట్ ప్రశ్నాపత్రం వచ్చింది. ప్రభుత్వం నిర్వహించిన ప్రశ్నాపత్రంతో ఈ 'గెస్ పేపర్' 100 శాతం సరి పోలినట్లు అధికారులు గుర్తించారు. అలాగే మే 3వ తేదీన ఈ నీట్ పరీక్ష నిర్వహించగా.. అంతకు ముందే ఈ పరీక్ష పేపర్ లీక్ అయినట్లు అధికారులు ధృవీకరించారు. ఈ ప్రశ్నాపత్రం రూ. 20 వేల నుంచి రూ. 2 లక్షల వరకు విక్రయించినట్లు గుర్తించారు. కేరళలోని ఒక ఎంబీబీఎస్ విద్యార్థి వద్ద ఈ పేపర్ లీక్ అయినట్లు పోలీసులు కనుగొన్నారు. మే 1వ తేదీన సికార్‌లోని స్నేహితుడితో ఎంబీబీఎస్ విద్యార్థి ఈ ప్రశ్నాపత్రం పంచుకున్నట్లు తెలుస్తుంది. ఆ తర్వాత కోచింగ్ సెంటర్లు, అభ్యర్థులకు ఈ పేపర్ లీక్ అయినట్లు సమాచారం. పరీక్షల్లో అసలు ప్రశ్నాపత్రంలోని 140 ప్రశ్నలు సరి పోలాయి. ఈ 140 ప్రశ్నలు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరలయ్యాయి. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం ఈ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ పరీక్ష నిర్వహించే తేదీలు త్వరలో ప్రకటిస్తామని వెల్లడించింది.

# రూ. 8 వేల కోట్ల మోదీ విమానాన్ని అమ్మేయాలి

**పొదుపు అనేది పాలకుల నుంచే మొదలవ్వాలి**

**'గోవిష్ట్ యాత్ర'లో స్వామి అవిముక్తేశ్వరానంద**



**లక్నో, మే 12:** పశ్చిమాసియా సంక్షోభం, ఆర్థిక సవాళ్ల నేపథ్యంలో దేశ ప్రజలకు ప్రధాని మోదీ చేసిన పొదుపు సూచనలపై జ్యోతిర్మఠం శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద ఘాటుగా స్పందించారు. ప్రజలకు సుద్దులు చెప్పే ముందు, పాలకులు తమ విలాసాలను వదులుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని సోన్‌భద్రలో జరిగిన 'గోవిష్ట్ యాత్ర'లో పాల్గొన్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. దుబారా ఖర్చులు తగ్గించుకోవాలని ప్రజలకు పిలుపునిస్తున్న ప్రధాని, ముందుగా తాను వినియోగిస్తున్న సుమారు 8 వేల కోట్ల రూపాయల ఖరీదైన 'ఎయిర్ ఇండియా వన్' విమానాన్ని అమ్మేయాలని స్వామీజీ సూచించారు. ఆ విమానానికి బదులుగా ఇంధనం తక్కువ ఖర్చయ్యే సాధారణ విమానాలను వాడాలని విమర్శించారు. "ఖర్చులు తగ్గించుకోవాలని ప్రజలకు చెప్పడం కాదు.. ఆచరణలో చూపాలి. పొదుపు అనేది అధికారంలో ఉన్న వ్యక్తుల నుంచే మొదలవ్వాలి. ధర్మం ఎప్పుడూ ఇంటి నుంచే ప్రారంభం కావాలి" అని ఆయన అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ పర్యటనలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. దేశహితం కోసం ప్రజలు కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఏడాది పాటు బంగారం కొనుగోళ్లు ఆపాలని, విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలని, పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించి ప్రజా రవాణా వ్యవస్థను వాడాలని సూచించారు. రాబోయే ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మోదీ ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తున్నప్పటికీ, స్వామి అవిముక్తేశ్వరానంద చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. సామాన్యుడికి పొదుపు మంత్రం చెప్పే ముందు ప్రభుత్వ పెద్దలు తమ ఖర్చులను తగ్గించుకోవాలన్న వాదనకు ఈ వ్యాఖ్యలు మరింత బలాన్ని చేకూర్చాయి.

# లక్షల మంది విద్యార్థుల కలలు కల్లలు

## నీట్ పరీక్ష రద్దుపై మండిపడ్డ రాహుల్



**న్యూఢిల్లీ, మే 12:** నీట్ ప్రశ్నాపత్రం లీక్ కారణంగా నీట్ పరీక్ష రద్దు కావడంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని లక్షల మంది కష్టాన్ని, కలల్ని బీజేపీ ప్రభుత్వం ఛిద్రం చేసిందని విమర్శించారు. ఇది కేవలం పరిపాలనా వైఫల్యం మాత్రమే కాదని, యువత భవిష్యత్తును కాలరాసే నేరమని ఆరోపించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో రాహుల్ గాంధీ ఓ ట్వీట్ చేశారు. దేశవ్యాప్తంగా 22 లక్షల మందికి పైగా విద్యార్థుల కష్టం, తల్లిదండ్రుల త్యాగాలు, ఎన్నో కుటుంబాల ఆశలు ఈ అవినీతి పాలన వల్ల నాశనమయ్యాయని రాహుల్ గాంధీ అన్నారు. కొంతమంది తండ్రులు అప్పులు చేశారని, తల్లులు తమ నగలు అమ్మారని, లక్షలాది మంది విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి చదివారని, అయితే పేపర్ లీకులు, ప్రభుత్వ నిర్లక్ష్యం, విద్యా వ్యవస్థలో అవినీతి వారికి శాపంలా మారాయని విమర్శించారు. ప్రతిసారి పేపర్ మాఫియా తప్పించుకుంటోందని, నిజాయతీగా చదివిన విద్యార్థులే శిక్ష అనుభవిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కష్టం కాదు.. డబ్బు, పరిచయాలే భవిష్యత్తును నిర్ణయిస్తే విద్యకు అర్థమేంటి? ప్రధాని చెప్పే అమృత కాలం దేశ యువతకు విష కాలంగా మారింది' అని రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత తీసుకురావాలని, పరీక్షల నిర్వహణలో కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు



# జగన్ మాస్ 'క్రేజ్'

## మాజీ సీఎం రాకతో దద్దరిల్లిన అనంతపురం!

## వధూవరులను ఆశీర్వదించిన వైసీపీ బాస్

## జనసంద్రమైన పామిడి వీధులు

**పామిడి, మే 12:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటనతో అనంతపురం జిల్లా పామిడిలో ఒక్కసారిగా రాజకీయ వేడి రాజుకుంది. మంగళవారం పామిడిలో జరిగిన ఎమ్మెల్సీ డాక్టర్ ఎ. మధుసూధన్ కుమారుడు చైతన్య మిత్ర, ఏడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ ఎం. వీరాంజనేయులు కుమార్తె లిఖితల వివాహ రిసెప్షన్ వేడుకకు జగన్ హాజరయ్యారు. తాడేపల్లి నుంచి ప్రత్యేక కాన్వాయ్‌లో బయలుదేరిన ఆయనకు జిల్లా సరిహద్దుల నుంచే పార్టీ శ్రేణులు, అభిమానులు అడుగడుగునా ఘనస్వాగతం పలికారు. 'జై జగన్' నినాదాలతో పామిడి వీధులన్నీ మారుమోగిపోయాయి. రిసెప్షన్ వేదిక వద్దకు చేరుకున్న జగన్‌ను చూసేందుకు జనం ఎగబడ్డారు. నూతన వధూవరులను మనసారా ఆశీర్వదించిన ఆయన, వారితో కలిసి ఫోటోలు దిగారు. జగన్ రాకతో పెళ్లి వేడుకలో ఒక్కసారిగా పండుగ వాతావరణం నెలకొంది. పార్టీ కీలక నేతలు, కార్యకర్తలతో జగన్ ఆప్యాయంగా కరచాలనం చేస్తూ ఉత్సాహపరిచారు. ఈ క్రమంలో తనను కలిసేందుకు వచ్చిన అభిమానులను చిరునవ్వుతో పలకరిస్తూ.. వారిలో కొత్త జోష్ నింపారు. సామాన్య కార్యకర్త నుండి జిల్లా స్థాయి నేతల వరకు భారీ సంఖ్యలో తరలిరావడంతో జగన్ పర్యటన ఒక 'మాస్ ఈవెంట్'ను తలపించింది. రాజకీయంగా ఎన్ని సవాళ్లు ఎదురైనా జనంలో తనకున్న ఆదరణ తగ్గలేదని ఈ పర్యటన ద్వారా జగన్ మరోసారి నిరూపించారు. దాదాపు గంటకు పైగా పామిడిలో గడిపిన ఆయన, పార్టీ నేతలతో క్షేత్రస్థాయి పరిస్థితులపై ఆరా తీసి, తిరిగి తాడేపల్లికి తిరుగు ప్రయాణమయ్యారు. జగన్ పర్యటన పొడవునా పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.

# గడ్కరీతో లోకేష్ భేటీ

## గౌహతి విమానాశ్రయంలో సమావేశం

### ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై ప్రశంసలు.. మౌలిక వసతులపై చర్చ



**గౌహతి, మే 12:** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ గౌహతి విమానాశ్రయంలో కేంద్ర రహదారులు, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దేశ నిర్మాణం, మౌలిక వసతుల అభివృద్ధిపై గడ్కరీ చూపుతున్న దూరదృష్టిని లోకేష్ ప్రశంసించారు. "భారత్ హైవే మాన్"గా గుర్తింపు పొందిన నితిన్ గడ్కరీ దేశవ్యాప్తంగా ఆధునిక రహదారుల నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని లోకేష్ పేర్కొన్నారు. వేగవంతమైన, బలమైన భారత నిర్మాణానికి ఆయన చేస్తున్న కృషి అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై గడ్కరీ ప్రశంసలు వ్యక్తం చేసినట్లు లోకేష్ తెలిపారు. రాష్ట్రంలో ప్రపంచ స్థాయి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఆయన అభినందించినట్లు పేర్కొన్నారు. గడ్కరీ ప్రోత్సాహం తమకు మరింత ఉత్సాహాన్ని ఇస్తోందని లోకేష్ అన్నారు. రాష్ట్రంలో వేగవంతమైన అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, మౌలిక వసతుల విస్తరణ లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. ఈ సమావేశంలో పలు అభివృద్ధి అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. ముఖ్యంగా రహదారులు, కనెక్టివిటీ, పారిశ్రామిక వృద్ధికి సంబంధించిన అంశాలు ప్రాధాన్యత పొందినట్లు తెలుస్తోంది. కేంద్ర-రాష్ట్ర సమన్వయంతో అభివృద్ధి పనులు మరింత వేగవంతం అవుతాయని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# బంగాళాఖాతంలో అల్పపీడనం

**విశాఖపట్టణం, మే 12:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతోంది. రానున్న 48 గంటల్లో ఇది మరింత బలపడే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ద్రోణి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొన్నారు. కోస్తా జిల్లాల్లో వచ్చే ఐదు రోజుల పాటు వానలు పడే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు. రాయలసీమ నుంచి తమిళనాడు, కర్ణాటక వరకు ద్రోణి విస్తరించి ఉందని అధికారులు చెప్పారు. మరోవైపు నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఈరోజు ఉదయం 8:30 గంటల సమయానికి అదే ప్రాంతంలో కొనసాగుతోందని ఐఎండీ తెలిపింది. ఇది సముద్ర మట్టానికి సగటున 4.5 కిలోమీటర్ల ఎత్తు వరకూ విస్తరించి ఉందని వెల్లడించింది. ఇది రాబోయే 48 గంటల్లో మరింత బలపడే అవకాశం ఉందని పేర్కొంది. నైరుతి ప్రాంతం కాకుండా మిగిలిన బంగాళాఖాతం, అండమాన్ సముద్రంలో వాతావరణం సాధారణంగా ఉంటుందని చెప్పింది. ఈ వారం చివరి నాటికి దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ సముద్రం, అండమాన్ అండ్ నికోబార్ దీవుల్లోని కొన్ని ప్రాంతాల్లో నైరుతి రుతుపవనాల ప్రవేశానికి పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయని ఐఎండీ తెలిపింది. ఈ మేరకు ఓ ప్రకటన జారీ చేసింది.

# కుట్రలు సాగవు.. రాజధాని నిర్మాణం ఆగదు

- అమరావతికి భూములిచ్చిన రైతులకు 98 శాతం ప్లాట్ల కేటాయింపు పూర్తి
- ప్లాట్ల రిజిస్ట్రేషన్ 89 శాతం పూర్తి
- రాజధానిలో నిబంధనల ప్రకారమే ప్లాట్ల కేటాయింపు జరిగింది
- రాజకీయ దురుద్దేశంతోనే వైసీపీ రాద్ధాంతం చేస్తోంది
- వారం రోజుల్లో ఎమ్మెల్యే క్వార్టర్లను జీఏడీకి అప్పగిస్తాం
- అమరావతిలో రోడ్లు,భవనాలు,ఇతర పనులు వేగంగా జరుగుతున్నాయి
- మీడియాతో మంత్రి నారాయణ



**అమరావతి, మే 12:** రాజధానికి భూ ములిచ్చిన రైతులకు 98 శాతం ప్లాట్ల కేటాయింపు పూర్తయిందని మంత్రి నారాయణ తెలిపారు. ఇంకా కేవలం 674 మందికి మాత్రమే ప్లాట్ల కేటాయింపు చేయాల్సి ఉందన్నారు. కేటాయించిన ప్లాట్లలో 89 శాతం రిజిస్ట్రేషన్ కూడా పూ-ర్తయిందని వెల్లడించారు.కోర్టు కేసులు,కుటుంబ వివాదాలు ఉన్న వారికి మాత్రమే ప్లాట్ల కేటాయింపు పెండింగ్ లో ఉ ందని స్పష్టత ఇచ్చారు.రాజకీయ కుట్రతోనే వైసీపీ రైతుల విషయంలో రాద్ధాంతం చేస్తుందని ఆరో పించారాయన.ప్రభుత్వంపై బురద చల్లాలని చూస్తే ప్రజలు క్షమించరని మండి పడ్డారు.రాజధానిలో ప్లాట్ల కేటాయింపులో పాలసీ ప్రకారం నిబంధనలకు అనుగుణంగానే ముం దుకెళ్లామన్నారు.భూసేకరణ విషయంలో కోర్టు నిర్ణయం ప్రకారం ముందుకెళ్తామన్నారు. అమరావతిలో దాదాపు నిర్మాణం పూర్తయిన ఎమ్మెల్యే,ఎమ్మెల్సీ క్వార్టర్లను మంత్రి నారాయణ పరిశీలించారు...ఆయా టవర్లలో ప్లాట్ల ఇంటీరియర్ తో పాటు మౌలిక సదుపాయాలను పరిశీలించారు మంత్రి..ఆ తర్వాత అక్కడే మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. అమరావతిలో ట్రంక్ రోడ్లు,లే అవుట్ రోడ్లు,ఇతర నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రి నారాయణ చెప్పారు. అమరావతి నిర్మాణం గురించి ఇతర రాష్ట్రాల్లో కూడా చర్చించుకుంటున్నారని అన్నారు. అమరావతిలో అధికారులు,ఉద్యోగుల కోసం 4026 ఇళ్లను నిర్మిస్తున్నామన్నారు మంత్రి.అందులో ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలకు 12 టవర్లు దాదాపు పూర్తయినట్లు చెప్పారు..వారం రోజుల్లో ఎమ్మెల్యేల ఫ్లాట్లను జీఏడీకి అప్పగిస్తామని తెలిపారు.మరో 15 రోజుల్లో ఎమ్మెల్సీల ఇళ్లను హ్యాండోవర్ చేస్తామని తెలిపారు..ఆలిండియా సర్వీస్ అధికారుల భవనాలు,మంత్రుల బంగళాలు తుది దశకు చేరుకున్నాయి...ఈ నెలాఖరుకు కొన్ని ఇళ్లను వచ్చే నెలాఖరుకు మిగిలిన భవనాలు ప్రభుత్వానికి అందజేస్తాం..అలాగే గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్-డి భవనాల అంతర్గత పనులు కూడా తుది దశకు చేరుకున్నాయి..ఐకానిక్ టవర్స్ 2028 ఆగస్టు కు పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు సూచించారు...సీఎం సూచనలతో షెడ్యూల్ ప్రకారం నిర్మాణాలు పూర్తి చేస్తామని మంత్రి నారాయణ స్పష్టం చేసారు. రాజధానిలో రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించలేదని చేస్తున్న ఆరోపణలకు లెక్కలతో సహా సమాధానం ఇచ్చారు మంత్రి.రాజధాని కోసం ఇప్పటివరకూ 30,753 మంది రైతులు 35,017 ఎకరాల భూమి ఇస్తే వాటిలో 30,079 మంది రైతులకు అంటే 97 శాతం మందికి 34,527 ఎకరాల భూమికి సంబంధించి ప్లాట్లు కేటాయింపు పూర్తయిందన్నారు...అనగా 98.6 శాతం ప్లాట్ల కేటాయింపు పూర్తయినట్లు మంత్రి నారాయణ చెప్పారు.ఇంకా కేవలం 674 మంది రైతులు ఇచ్చిన 489 ఎకరాలకు మాత్రమే ప్లాట్ల కేటాయింపు జరపాల్సి ఉందన్నారు...అది కూడా వివిధ కారణాలతో పెండింగ్ లో ఉన్నట్లు మంత్రి తెలిపారు...కోర్టు కేసులతో 65 మందికి,అసైన్డ్ కేటగిరీ 4 భూములకు సంబంధించిన 45 మందికి,కనీస ప్లాటుకు అర్హత లేకపోవడం వలన 324 మందికి,ప్లాట్లు ఇచ్చిన వారు మరణించడం,లంక భూముల రిపోర్ట్ కలెక్టర్ వద్ద పెండింగ్ లో ఉండటం వంటి కారణాలతో పెండింగ్ లో ఉందన్నారు...మరో 59 మందికి చెందిన 140.25 ఎకరాలకు ప్లాట్ల కేటాయింపునకు సంబంధించి లాటరీ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మరోవైపు రైతులకు కేటాయించిన ప్లాట్ల రిజిస్ట్రేషన్ కూడా 89.3 శాతం పూర్తయినట్లు మంత్రి నారాయణ చెప్పారు...మొ-్తం 30,079 మంది రైతులకు 70,824 ప్లాట్లు కేటాయించగా వాటిలో 63,295 ప్లాట్లు అనగా 89.3 శాతం ప్లాట్ల రిజిస్ట్రేషన్ పూర్తయిందన్నారు..ఇంకా కేవలం 7,529 ప్లాట్లు మాత్రమే రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంది.అయితే వివిధ కారణాలతో ప్లాట్ల రిజిస్ట్రేషన్ పెండింగ్ లో ఉ ంది...కోర్టు కేసులతో 186 మందికి చెందిన 312 ప్లాట్లు,పలు రకాల వివాదాలతో 774 మంది రైతులకు చెందిన 1862 ప్లాట్ల రిజిస్ట్రేషన్ పెండింగ్ లో ఉందన్నారు మంత్రి. కేటగిరి 4 లో ఉన్న 96 మంది రైతులకు 215 ప్లాట్లు,ఇనాం, దేవదాయ వివాదాలతో 47 మంది రైతులకు చెందిన 63 ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయలేదన్నారు మంత్రి నారాయణ....ఇలా కుటుంబ సభ్యుల అంతర్గత సమస్యలు,ఇతర కారణాలతో మాత్రమే రిజిస్ట్రేషన్ పెండింగ్ ఉందన్నారు. ల్యాండ్ పూలింగ్ కు రైతులు ముందుకు రాని చోట్ల తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే ల్యాండ్ అక్విజిషన్ నోటిఫికేషన్ ఇచ్చినట్లు మంత్రి నారాయణ తెలిపారు...ఇప్పటికీ ఆయా రైతులను ల్యాండ్ పూలింగ్ కు రావాలని కోరుతున్నామన్నారు...కొంతమంది ముందుకు వస్తున్నప్పటికీ మరికొంత మంది ఇష్టపడటం లేదన్నారు.అయితే కొంతమంది కోర్టును ఆశ్రయించారని....కోర్టు ఎలా నిర్ణయిస్తే దాని ప్రకారం ముందుకు వెళ్తామని స్పష్టం చేసారు.

# దొంగలపై పోలీసుల కాల్పులు

## నిడుబ్రోలు రైల్వే స్టేషన్ వద్ద ఉద్రిక్తత

## సిగ్నల్ వ్యవస్థ ధ్వంసానికి దుండగుల కుట్ర

## అడ్డుకున్న ఆర్‌పిఎఫ్, జీఆర్‌పీ సిబ్బంది



**పొన్నూరు, మే 12:** గుంటూరు జిల్లా పొన్నూరు సమీపంలోని నిడుబ్రోలు రైల్వే స్టేషన్ వద్ద మంగళవారం తెల్లవారుజామున తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. రైల్వే ఆస్తులను ధ్వంసం చేసి, ప్రయాణికుల భద్రతకు ముప్పు కలిగించేలా వ్యవహరించిన దుండగులను అడ్డుకునే క్రమంలో రైల్వే పోలీసులు జరిపిన కాల్పులు స్థానికంగా కలకలం రేపాయి. మంగళవారం తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.నిడుబ్రోలు రైల్వే కేబిన్ సమీపంలోని ఆలూరు గేట్ వద్ద కొందరు వ్యక్తులు సిగ్నలింగ్ పాయింట్ల వద్ద ట్యాంపరింగ్‌కు పాల్పడుతుండటాన్ని కీ-మ్యాన్ గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన స్టేషన్ మాస్టర్ సమాచారంతో ఆర్‌పిఎఫ్ (రాఫ్), ప్రభుత్వ రైల్వే పోలీస్ (+రా) సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. పోలీసులను చూసిన దుండగులు లొంగిపోవడానికి బదులుగా విచక్షణారహితంగా రాళ్ల దాడికి దిగారు. ఈ దాడి నుండి ఆత్మరక్షణ కోసం, అలాగే రైల్వే ఆస్తులను కాపాడటం కోసం పోలీసులు సుమారు 10 రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపినట్లు జీఆర్‌పీ డీఎస్పీ అక్కేశ్వరరావు తెలిపారు. పోలీసులు తుపాకులు ఎక్కుపెట్టి కాల్పులు జరపడంతో భయాందోళనకు గురైన దుండగులు చీకటిని అడ్డం పెట్టుకుని సమీపంలోని పొలాల్లోకి పారిపోయారు. సమాచారం అందుకున్న రైల్వే ఉ న్నతాధికారులు, డాగ్ స్క్వాడ్ మరియు క్లూస్ టీమ్ సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలను సేకరించారు. రైల్వే వ్యవస్థను దెబ్బతీసేందుకు జరిగిన ఈ కుట్ర వెనుక ఉన్న వ్యక్తుల కోసం స్థానిక పోలీసుల సహకారంతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ ఘటనతో ప్రయాణికులు కొంత ఆందోళనకు గురైనప్పటికీ, ప్రస్తుతం రైళ్ల రాకపోకలు యథావిధిగా కొనసాగుతున్నాయి

# ట్రాన్స్‌జెండర్ వెల్ఫేర్ బోర్డుకు కొత్త సభ్యులు

- విశాఖ తిరుపతి కలెక్టర్లకు బోర్డులో ప్రాతినిధ్యం
- బోర్డులో కొత్తగా ముగ్గురు ట్రాన్స్‌జెండర్లకు చోటు




**అమరావతి, మే 12:** ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ స్టేట్ వెల్ఫేర్ బోర్డుకు కొత్త సభ్యులను నియమిస్తూ చంద్రబాబు సర్కార్ ఉ త్తర్వులు జారీ చేసింది. ట్రాన్స్‌జెండర్ హక్కుల పరిరక్షణ చట్టం-2019 ప్రకారం ఈ నియామకాలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు ప్రాతినిధ్యం కల్పించేలా కలెక్టర్లను ప్రభుత్వం నామినేట్ చేసింది. విశాఖపట్నం కలెక్టర్‌ను ఆంధ్ర ప్రాంతానికి ప్రతినిధిగా నియమించగా, తిరుపతి కలెక్టర్‌ను రాయలసీమ ప్రాంతానికి ప్రతినిధిగా నియమించింది. ఈ నిర్ణయం ద్వారా ప్రాంతీయ స్థాయిలో ట్రాన్స్‌జెండర్ సమస్యలు, సంక్షేమ కార్యక్రమాల అమలు మరింత సమర్థవంతంగా జరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది. ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ స్టేట్ వెల్ఫేర్ బోర్డులో నామినేట్ సభ్యులుగా ముగ్గురు ట్రాన్స్‌జెండర్ ప్రతినిధులకు అవకాశం కల్పించింది. కోట ప్రేమ్ సాగర్ రాయ్, నక్క జీవన్ కుమారి, బోను దుర్గలను బోర్డు సభ్యులుగా నియమించింది. ఈ నియామకాల ద్వారా ట్రాన్స్‌జెండర్లకు సంబంధించిన సమస్యలు నేరుగా ప్రభుత్వ దృష్టికి వెళ్లే అవకాశం ఉ ంటుందని అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం, నియమిత సభ్యుల పదవీకాలం రెండేళ్ల పాటు ఉంటుంది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఈ నియామకాలు అమల్లో ఉంటాయని ఏపీ సర్కార్ స్పష్టం చేసింది. మహిళా, శిశు, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జీఓ ఎంఎస్ నంబర్14 విడుదల చేసింది. ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఈ ఉత్తర్వుల్లో పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్లకు విద్య, ఉపాధి, ఆరోగ్యం, సామాజిక భద్రత వంటి అంశాల్లో మరింత సహకారం అందించేందుకు చర్యలు చేపడుతోంది. ట్రాన్స్‌జెండర్ హక్కుల పరిరక్షణ చట్టం-2019 అమల్లో భాగంగా సంక్షేమ బోర్డు కీలక పాత్ర పోషించనుంది. సమాజంలో ట్రాన్స్‌జెండర్లకు సమాన హక్కులు, గౌరవం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు. ట్రాన్స్‌జెండర్ వెల్ఫేర్ బోర్డుకు సభ్యులను నియమించడంపై ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారంశైలజ మీడియాతో మాట్లాడారు. ట్రాన్స్‌జెండర్ల హక్కులు, సంక్షేమంపై కూటమి ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. ట్రాన్స్‌జెండర్ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను మే 4వ తేదీన మంత్రి నారా లోకేశ్ దృష్టికి తాను తీసుకెళ్లానని ప్రస్తావించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ట్రాన్స్‌జెండర్ల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేయడం కూటమి సర్కారు చిత్తశుద్ధికి నిదర్శనమని రాయపాటి శైలజ పేర్కొన్నారు.

# పాశ్చత్య సంస్కృతిని విడనాడి హైందవ సంస్కృతిని పాటించాలని పిలుపు

**రాయికోడ్ సమయం న్యూస్ మే 12** హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలోరాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్100 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటూ, హిందువులందరిని ఏకతాటిపైకి తీసుకువచ్చి వారిలో చైతన్యం నింపాలనే ఉద్దేశ్యంతో సోమవారం సాయంత్రం ఘనంగా హిందూ సమ్మేళనంను నిర్వహించడం జరిగింది .ముందుగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇందూర్ ఆశ్రమ పీఠాధిపతి చెన్న మల్లిఖార్జున స్వామి,ముఖ్య వక్తలుగా విచ్చేసిన పట్లోళ్ల సంగీత లక్ష్మి (లెక్చరర్),పట్లోళ్ల మురళీధర్ రెడ్డి(ఆర్ఎస్ఎస్ విభాగ్ సంఘచాలక్ మరియు తెలంగాణ ప్రాంత కుటుంబ ప్రబోధన్ ప్రముఖ్) భారతమాత చిత్రపటానికి పూజాకార్యక్రమం నిర్వహించి జ్యోతి ప్రజ్వలన గావించారు.ఈ సందర్భంగా వక్త తపస్ జిల్లా కన్వీనర్ ఎస్.విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతిఒక్కరు మన హిందు ధర్మాన్ని పాటిస్తూ తమ బాధ్యతగా పంచ పరివర్తన్(5 పనులను) చేయాలని వాటి గురించి వివరిస్తూ మొదటగా సమాజంలోని హిందువులందరిని ఏకతాటిపైకి తీసుకువచ్చి మన ధర్మ సంరక్షణ కోసం పాటుపడేవిధంగా చైతన్యం నింపాలని, రెండు స్వదేశీ వస్తువులనే ఉపయోగించాలని, మూడు కుటుంబ వ్యవస్థను విచ్ఛిన్నం కాకుండా అందరూ ఉమ్మడి కుటుంబంగా వుండాలని, నాలుగవ పని పౌర హక్కులను అనగా రూల్స్ ను తూచా తప్పకుండా పాటించాలని, ఐదవ పని పర్యావరణ పరిరక్షణ కొరకు ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని అలాగే పురుగు మందులు వాడకుండా సేంద్రియ వ్యవసాయం చేస్తూ భూమిని కాపాడాలని,ప్రకృతిని కాపాడేందుకు చెట్లను పెంచి వాటి పెరుగుదలకు తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.వక్త పట్లోళ్ల మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ



హిందువులందరిని ఏకతాటిపైకి తీసుకువచ్చి మన సనాతన ధర్మాన్ని పాటిచాలనే ఉద్యేశంతోరాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ను 1925 విజయదశమి పర్వదినాన డాక్టర్ కేశవరావు బలిరామ్ పంత్ హెడ్గేవార్ మహారాష్ట్రలోని నాగపూర్ లో కొద్దిమందితో స్థాపించి నేడు లక్షల మంది స్వయంసేవకులు హిందూ ధర్మం కోసం పాటుపడుతూ, వరదలు వచ్చిన చోట మరియు ఆపద సమయాన స్వచ్ఛందంగా వివిధ రకాల సేవ కార్యక్రమాలు చేస్తున్న సంస్థ ఆర్ఎస్ఎస్ అని తెలిపారు. అలాగే దశాబ్దాల చరిత్ర కలిగిన మన సనాతన హైదవసంస్కృతిలో భాగంగా గతంలో అందరూ హిందూ ధర్మాన్ని పాటిస్తూ కట్టుబొట్టు,నడవడిక,ఇతరులపై గౌరవ మర్యాదలు కలిగి ఉండేవారని కానీ నేడు విదేశీ సంస్కృతిని పాటిస్తూ ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించడం,సభ్యసమాజం తలదించుకునేలా వస్త్రధారణ, తల్లిదండ్రులు, గురువులను, పెద్దలను గౌరవంఇవ్వకుండా ప్రవర్తించడం సిగ్గు చేటు అని తెలుపుతూఇప్పటికైనా పాశ్చత్య సంస్కృతిని విడనాడాలని సూచించారు.ముఖ్య అతిథి చెన్న మల్లిఖార్జున స్వామి మాట్లాడుతూ మన ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని గుర్తుచేస్తూ మన దేశాన్ని, ధర్మాన్ని కాపాడాల్సి వచ్చినప్పుడు ముందు ఉండాలి అని అలాగే అందరూ భగవంతుని నామస్మరణతో భక్తి మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు.

# జనగణన ప్రతి పౌరుడి బాధ్యత

# సమగ్రసమాచారం దేశాభివృద్ధికి పునాది.

■ **జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**సంగారెడ్డి జిల్లా సమయం న్యూస్ మే 12:-**జనగణన ప్రతి పౌరుడి బాధ్యత అని, సమగ్ర మరియు ఖచ్చితమైన సమాచారం దేశాభివృద్ధికి పునాదిగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు.జనగణనపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో మంగళవారం జిల్లా కలెక్టరేట్ నుండి ఐబీ వరకు నిర్వహించిన "జనగణన అవగాహన మారథాన్ వాక్" కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జనగణనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని అన్నారు.జిల్లాలోజనగణన ప్రక్రియలో భాగంగా మే 10 వరకు స్వీయ గణన నిర్వహించగా, మే 11 నుంచి ఇంటింటి గణన ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నారని తెలిపారు .జనగణన సిబ్బందికి ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేశామని, ప్రజలు వారికి సహకరించాలని కోరారు. జనగణనలో సేకరించే వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు.జనగణన ద్వారా ప్రభుత్వానికి ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులపై స్పష్టమైన అవగాహన ఏర్పడి, సంక్షేమ పథకాల రూపకల్పన మరియు అమలులో ఉపయోగపడుతుందని తెలిపారు. దేశ అభివృద్ధికి ఖచ్చితమైన గణాంకాలు ఎంతో అవసరమని కలెక్టర్



పేర్కొన్నారు.ప్రతి కుటుంబం సరైన వివరాలు అందించి జనగణన విజయవంతానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, రెవెన్యూ,పోలీస్ అధికారులు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఎన్యూమరేటర్లు, ఆశా వర్కర్లు,వివిధ కళాశాలల విద్యార్థులు, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు, యువత,తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ అంతరాయాలకు అడ్డుకట్ట

- **ఏబీ స్విచ్‌ల ఏర్పాటుతో వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా**
- **ఉత్తమ్ జాడే ఎస్ఈ స్పష్టీకరణ**

**ఆసిఫాబాద్ మే12( సమయం న్యూస్). :** విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించాలనే లక్ష్యంతో తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ పరిధిలోని ఆసిఫాబాద్ సర్కిల్‌లో విద్యుత్ వ్యవస్థ బలోపేత పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని ఉత్తమ్ జాడే సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆసిఫాబాద్ తెలిపారు.ఇప్పటివరకు సర్కిల్ పరిధిలో క్షేత్రస్థాయిలో గ్రామాలలో సింగిల్ ఫేజ్ ఏబీ స్విచ్‌లు పెట్టినామని, దీని ద్వారా గ్రామాలలో ఎక్కడైన అంతరాయం ఏర్పడితే లైన్ మొత్తం విద్యుత్ సరాఫరా నిలపకుండా కేవలం సింగిల్ ఫేజ్ ట్రాన్స్ఫార్మర్ వద్ద నిలిపి మిగతా ప్రాంతం అంత విద్యుత్ సరఫరా ఉంటుందని ఏబీ స్విచ్‌లు పెట్టడం వలన అంతరాయం ఒకే పరిధికి మాత్రమే పరిమితం అవుతుందని తెలిపారు . అలాగే త్రిఫేజ్ లైన్లలో కూడా ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేశామని వివరించారు. ఈ అధునాతన సాంకేతికత అమలుతో గ్రామాలతో పాటు పట్టణ ప్రాంతాలలో విద్యుత్ అంతరాయాలు గణనీయంగా తగ్గినాయని , వినియోగదారులకు మరింత మెరుగైన విద్యుత్ సరఫరా అందిస్తున్నామని పేర్కొన్నారు.

**ఏబీ స్విచ్‌ల ఉపయోగం:**విద్యుత్ లైన్లలో సాంకేతిక లోపాలు, చెట్ల కొమ్మలు తగలడం, భారీ వర్షాలు, ఈదురు గాలులు వంటి కారణాలతో ఏర్పడే అంతరాయాలను తక్షణమే గుర్తించి, సమస్య ఉన్న ప్రాంతానికి మాత్రమే విద్యుత్ సరఫరాను నిలిపివేసి, మిగతా ప్రాంతాలకు నిరాటంకంగా విద్యుత్ అందించడానికి ఏబీ స్విచ్‌లు ఎంతో కీలకంగా ఉపయోగపడుతున్నాయని తెలిపారు.

**వినియోగదారులకు చేకూరే ప్రధాన ప్రయోజనాలు:**నిరంతరాయ విద్యుత్ సేవలు: గతంలో చిన్న లైన్ ఫాల్ట్ వచ్చినా మొత్తం గ్రామం లేదా ఫీడర్ పరిధిలోని



కాలనీలన్నింటికీ విద్యుత్ సరఫరా నిలిచిపోయేది. ప్రస్తుతం ఏబీ స్విచ్‌ల వల్ల సమస్య ఉన్న ప్రాంతంలో మాత్రమే సరఫరా నిలిపివేసి, మిగతా ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా కొనసాగుతుంది.

**త్వరితగతిన లోపాల గుర్తింపు:**ఫాల్ట్ ఎక్కడ ఏర్పడిందో సులభంగా గుర్తించి మరమ్మతు పనులు వేగంగా చేపట్టే అవకాశం ఏర్పడింది.

**ట్రిప్పింగ్ సమస్యలకు తగ్గింపు:**తరచూ ఎదురయ్యే ట్రిప్పింగ్ సమస్యలు గణనీయంగా తగ్గి విద్యుత్ నాణ్యత మెరుగుపడుతోంది.

**సిబ్బంది భద్రతకు ప్రాధాన్యం:**మరమ్మతు పనుల సమయంలో విద్యుత్ నియంత్రణ సులభమై సిబ్బంది భద్రత మరింత పెరుగుతోంది.

**వ్యవస్థ సామర్థ్యం పెంపు:**ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యుత్ పంపిణీ వ్యవస్థ మరింత పటిష్టంగా ,మెరుగ్గా మారుతోంది.

వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ఆధునిక సాంకేతికతతో విద్యుత్ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని ఎస్ఈ తెలిపారు. వినియోగదారుల సంతృప్తి, వారి సౌకర్యార్థం ఎన్నో మౌలిక వసతులు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

అత్యవసర విద్యుత్ సమస్యల ఫిర్యాదుల కోసం వినియోగదారులు టోల్ ఫ్రీ నంబర్ 1912 లో సంప్రదించాలని కోరారు .

# జనగణన ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

■ **క్షేత్రస్థాయిలో జనగణన ప్రక్రియ పరిశీలించిన జాయింట్ డైరెక్టర్ సుబ్బారాజు**

**గ్రేటర్ వరంగల్ మే 12:( సమయం న్యూస్). :** జనగణన--2027 ప్రక్రియను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని హైదరాబాద్ జనగణన శాఖ జాయింట్ డైరెక్టర్ డి. సుబ్బారాజు అధికారులకు సూచించారు.మంగళవారం హనుమకొండలోని 28వ డివిజన్ పరిధిలో గోవిందరాజుల గుట్ట, సత్యం లేన్, స్టేషన్ రోడ్ ప్రాంతాల్లో జరుగుతున్న జనగణన ఎన్యుమరేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటి సర్వే నిర్వహణ, వివరాల నమోదు విధానం, ప్రజలకు అవగాహన కల్పిస్తున్న తీరును పరిశీలించి ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు పలు సూచనలు చేశారు.ప్రతి కుటుంబ వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. జనగణన దేశాభివృద్ధికి కీలకమైన ప్రక్రియ అని, ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.ఈ పరిశీలనలో జనగణన శాఖ సెక్షన్ ఆఫీసర్ సతీష్, రెవెన్యూ అధికారి బి. శ్రీనివాస్, ఆర్ఐ అశోక్ కుమార్, వార్డ్ ఆఫీసర్, బిల్ కలెక్టర్ కుమారస్వామి, సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లు, తదితరులు హాజరయ్యారు.

## నల్లగొండ--రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం లిమిటెడ్ (నార్ముల్), నేషనల్ డెయిరీ డెవలంప్‌మెంట్ బోర్డు(NDDB)తో త్రైపాక్షిక ఒప్పందం కుదుర్చుకుంది.



**హైదరాబాద్ మే12( సమయం న్యూస్).**15 ఏళ్లపాటు డెయిరీ అభివృద్ధి చేసే బాధ్యతను చీఐఐదీ తీసుకోనుంది. ఒప్పందంలో భాగంగా మొదట పాడి రైతుల బకాయిలను చెల్లించేందుకు రూ.10 కోట్ల రూపాయలను చెల్లించనుంది. చీఐఐదీ అధికారులతో తెలంగాణ రాష్ట్ర డెయిరీ విభాగం అధికారులు ఒప్పందాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, పశు సంవర్ధక, డెయిరీ, ఫిషరీస్ సెక్రటరీ ఇలంబర్తి, మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, చీఐఐదీ అధికారులు పాల్గొన్నారు.

# రేపటినుండి ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు

■ **నిర్వహణకు సర్వం సిద్ధం**



**పెద్దపల్లి మే12( సమయం న్యూస్). :** ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు ఈనెల 13 నుండి 21 వరకు పరీక్ష రెండు సెషన్లలో ఉదయం 9 గంటల నుండి 12:00 వరకు మరియు మధ్యాహ్నం 2:30 గంటల నుండి 5:30 గంటల వరకు జరుగును. 13 పరీక్ష కేంద్రాలలో ఫస్ట్ ఇయర్ విద్యార్థులు 3664 సెకండ్ ఇయర్ విద్యార్థులు 1414,మొత్తం విద్యార్థులు 5078 మంది పరీక్షలు రాస్తున్నారు ఇట్టి పరీక్ష నిర్వహణ కొరకు ఇద్దరు ఐజుజ మెంబర్స్, ఇద్దరు సిట్టింగ్ స్క్వాడ్, ఒక ఫ్లయింగ్ టీం, మరియు ఒకరు కస్టోడియన్ లను ఏర్పాటు చేయడం జరిగింది పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు త్వరగా చేరుకునేలా బస్సు రూట్ లను ఏర్పాటు చేయడం జరిగింది విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు సరైన వెలుతురు, తాగునీటి సదుపాయం ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిని పరీక్ష నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు తెలియజేయడం జరిగింది.

# ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేయించుకోవాలి

■ **కలెక్టర్ కోయ శ్రీహర్ష**

■ **ప్రభుత్వ పథకాల ప్రయోజనాలకు రైతు నమోదు అత్యవసరం**

**పెద్దపల్లి మే 12( సమయం న్యూస్) పెద్దపల్లి, మే 12:** జిల్లాలోని ప్రతి పట్టాదార్ పాసుబుక్ కలిగిన రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ (రైతు నమోదు) ప్రక్రియను పూర్తి చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కోరారు.రైతులు తమ సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ)ను సంప్రదించి ఆన్లైన్‌లో రైతు నమోదును పూర్తి చేయించుకోవాలని సూచించారు. నమోదు పూర్తైన అనంతరం ప్రతి రైతుకు ప్రత్యేక రైతు నమోదు సంఖ్య కేటాయించబడుతుందని తెలిపారు.ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోని రైతులు భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ, వ్యవసాయ పథకాల ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.ఎరువుల కొనుగోలు, పంట రుణాల మంజూరు, వరి, మొక్కజొన్న తదితర ధాన్యాల విక్రయాల కోసం కూడా రైతు నమోదు సంఖ్య తప్పనిసరిగా అవసరమవుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు.అందువల్ల జిల్లాలోని అన్ని రైతులు వెంటనే ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేయించుకుని ప్రభుత్వ ప్రయోజనాలు పొందాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష విజ్ఞప్తి చేశారు.

# మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానం

■ **జిల్లా మైనారిటీ అధికారి శ్రీనివాసరావు**

**మహబూబాబాద్, మే.12( సమయం న్యూస్). :** మైనారిటీల సంక్షేమ శాఖ ఆధ్వర్యములో తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్, హైదరాబాద్ వారి ద్వార ఖూజా - జూూ. 2027 పరీక్ష కోసం 2026-27 విద్యా సంవత్సరమునకు (100) తెలంగాణకు చెందిన మైనారిటీ అభ్యర్థులకు (ముస్లిములు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు మరియు పారశీలు) ఉచిత శిక్షణ అందించబడునని జిల్లా మైనారిటీ అధికారి శ్రీనివాసరావు నేడు ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి శిక్షణకు రిజర్వేషన్ల నియమ ప్రకారం మహిళా అభ్యర్థులకు 33.33% సీట్లు మరియు అన్ని రిజర్వ్ కేటగిరీలలో వికలాంగులకు 5% సీట్ల కేటాయించబడునని తల్లిదండ్రులు/సంరక్షకుల వార్షిక ఆదాయంసంవత్సరానికి రూ.5 .00లక్షలకుమించకుండా, హైదరాబాద్ లోని తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్ లో మొదటిసారి ప్రవేశం పొందే అభ్యర్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకొనవలెనని అన్నారు. ప్రవేశం పూర్తిగా మెరిట్ ప్రాతిపదికన ఉండునని యుపిఎస్సి (సిఎస్ఎటి - 2027) యొక్క సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్ లో ప్రవేశం కోసం తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలోని సాధారణ / ప్రొఫెషనల్ డిగ్రీ పూర్తి చేసిన మైనారిటీస్ అభ్యర్థుల నుండి ఆన్లైన్ https://cet.cgg.gov.in/tmreis వెబ్ సైట్ ద్వారా దరఖాస్తులు స్వీకరించబడును. దరఖాస్తులు చేసుకొనుటకు చివరి తేదీ: 31.05.2025 మరియు స్క్రీనింగ్ టెస్ట్ ప్రవేశ పరీక్షా తేదీ: 14.06.2026న జిల్లా కేంద్రము లో గల తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించబడును. ఇతర వివరములకు 040-23236112, 9182540680 కార్యాలయ సమయములు ఉదయం 10:30 నుండి సాయంత్రం 05:00 గంటల పని దినాలలో సంప్రదించగలరని అన్నారు అర్హులైన ఆసక్తి కలిగిన మైనారిటీస్ విద్యార్థులు ఇట్టి సదవకాశాన్ని సద్వినియోగపర్చుకోగలరని అధికారి ఈ సందర్భంగా కోరారు.

## ఎర్రవెల్లి నివాసంలో, బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ గారి అధ్యక్షతన ప్రారంభమైన కీలక సమావేశం.

**ఎర్రవెల్లి మే12( సమయం న్యూస్) :** ఈ సమావేశంలో...బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా,పార్టీ ప్రధాన కార్యదర్శులు, మండలి మరియు శాసనసభా పక్షాల ఉప నాయకులు పాల్గొన్నారు. వారిలో..అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు, టి. హరీశ్ రావు, పి. సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ ఎస్.మధుసూదనాచారి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు ఎల్ రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి,.

**పార్టీ ప్రధాన కార్యదర్శులు...** తక్కెల్లపల్లి రవీందర్రావు ఎమ్మెల్సీ, డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి ఎమ్మెల్యే, డా. బండా ప్రకాష్ ముదిరాజ్ ఎమ్మెల్సీ, శ్రీ వి. గంగాధర్ గౌడ్ మాజీ ఎమ్మెల్సీ, జోగినపల్లి సంతోష్ కుమార్ మాజీ ఎంపీ, నారదాసు లక్ష్మణరావు మాజీ ఎమ్మెల్సీ, ఆర్. శ్రవణ్ కుమార్ రెడ్డి, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ రిటైర్డ్ ఐపీఎస్, టి. జీవన్ రెడ్డి మాజీ మంత్రి, సోమా భరత్ కుమార్ గుప్తా మాజీ చైర్మన్, సత్యవతి రాథోడ్ మాజీ ఎమ్మెల్సీ, రావుల చంద్రశేఖర్ రెడ్డి మాజీ ఎంపీ,.లు పాల్గొన్నారు.ప్రత్యేక ఆహ్వానితులుగా.. కె ఆర్ సురేష్ రెడ్డి మాజీ ఎంపీ, మహమ్మద్ అలీ మాజీ మంత్రి, శ్రీ మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాజీ చైర్మన్...హాజరయ్యారు.ఈ సందర్భంగా...పార్టీ సంస్థాగత నిర్మాణం, సభ్యత్వం నమోదు ప్రక్రియ, పార్టీ ఇన్చార్జిల నియామకం.. సహా పార్టీ బలోపేతం,, తదితర ముఖ్య విషయాలపై కెసిఆర్ గారి అధ్యక్షతన కీలక సమావేశంలో చర్చించనున్నారు.

## నీట్ యూజీ--2026 పరీక్ష రద్దు

**న్యూఢిల్లీ, మే 12( సమయం న్యూస్). :** దేశవ్యాప్తంగా మే 3న నిర్వహించిన నీట్ యూజీ--2026 పరీక్షను రద్దు చేస్తూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్ణయం తీసుకుంది. రాజస్తాన్‌లో వెలుగుచూసిన పేపర్ లీక్ ఆరోపణలు, దర్యాప్తు సంస్థల నివేదికల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

www.ndtv.com +1పరీక్షను మళ్లీ నిర్వహించనున్నట్లు, కొత్త తేదీలను త్వరలో ప్రకటిస్తామని ఎన్‌టీఏ తెలిపింది. అభ్యర్థులు మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని, అదనపు ఫీజు కూడా చెల్లించాల్సిన అవసరం లేదని వెల్లడించింది. ఇప్పటికే చెల్లించిన పరీక్ష ఫీజుపై కూడా రీఫండ్ ప్రకటన చేసినట్లు వార్తా నివేదికలు పేర్కొన్నాయి. PW Live +1 ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా పరీక్ష రాసిన సుమారు 22.79 లక్షల మంది విద్యార్థులు ప్రభావితమయ్యారు. తదుపరి పరీక్ష తేదీలు, కొత్త అడ్మిట్ కార్డుల వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో ప్రకటించే అవకాశం ఉంది.

## పాలీసెట్-2026 నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**● మే 13న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష**




**సంగారెడ్డి, మే 12 ( సమయం న్యూస్) :** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలలో మూడు సంవత్సరాల ఇంజనీరింగ్ డిప్లమా కోర్సులతో పాటు వ్యవ సాయ, వెటర్నరీ డిప్లమా కోర్సులలో ప్రవేశాల కోసం నిర్వహించనున్న పాలీసెట్-2026 పరీక్షకు సంగారెడ్డి జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కోఆర్డినేటర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పి. జానకి దేవి తెలిపారు.ఈ నెల 13వ తేదీ బుధవారం ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సంగారెడ్డి పట్టణం మరియు జోగిపేట్‌లో ఏర్పా టు చేసిన మొత్తం 6 పరీక్ష కేంద్రాలలో 2,068 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు.

**పరీక్ష కేంద్రాల వివరాలు ఈ విధంగా ఉన్నాయి:**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల (మహిళా), సంగారెడ్డి
సెయింట్ ఆంథోనీ హై స్కూల్, విద్యానగర్, సంగారెడ్డి
ప్రభుత్వ జూనియర్ కళాశాల (గర్ల్స్), సంగారెడ్డి
ఎస్.వి. జూనియర్ కాలేజ్, రాజంపేట రోడ్, సంగారెడ్డి
ప్రభుత్వ హై స్కూల్ ఫర్ బాయ్స్, అప్పర్ బజార్, ఓల్డ్ బస్టాండ్, సంగారెడ్డి
ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, శివంపేట్ (జోగిపేట్)

విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు ఉదయం 9:30 గంటలకల్లా చేరుకోవాలని సూచించారు. ఉదయం 10:00 గంటల నుండి మాత్రమే పరీక్ష కేంద్రాలలోకి అనుమతి ఉంటుందని తెలిపారు. ఉదయం 11:00 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించరని స్పష్టం చేశారు.విద్యార్థులు ఇటీవల డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టికెట్ తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. అలాగే హెచ్‌బీ పెన్సిల్, బాల్ పాయింట్ పెన్, ఎరేజర్, షార్పనర్ వెంట తీసుకురావాలని ఆమె తెలిపారు.

## పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS



**పెద్దేముల్ మండలం, మే,12(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఖ్రూా మంగళవారం పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి, స్టేషన్ పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా ఎస్పీ తొలుత స్టేషన్ ఆవరణను, పరిసరాలను పరిశీలించి పరిశుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఎస్‌హెచ్‌ఓ (ఖాూ) గది, రిసెప్షన్ సెంటర్, రైటర్స్ రూమ్, లాకప్ గదులతో పాటు మహిళా మరియు పురుషుల బ్యారక్‌లను, వాష్‌రూమ్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో రిసెప్షన్ అధికారులు ప్రవర్తించే తీరును అడిగి తెలుసుకున్న ఎస్పీ, పెండింగ్‌లో ఉన్న రికార్డులను, ఫైళ్లను స్వయంగా తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ రిసెప్షన్ అధికారులు, బ్లూ కోల్ట్స్ అధికారులకు , సెక్షన్ హెడ్ కానిస్టేబుళ్లు మరియు మహిళా సిబ్బందితో ముఖాముఖి మాట్లాడి వారి విధుల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఇట్టి కార్యక్రమం ఎస్పీ మాట్లాడుతూ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, ముఖ్యంగా 'డైల్ 100'ద్వారా వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు భరోసా కల్పించాలని ఆదేశించారు.అధికారులెవరూ పని ఒత్తిడికి గురికాకుండా ఎస్‌హెచ్‌ఓ సమన్వయం చేసుకోవాలని సూచించారు.పెద్దేముల్ ప్రాంతం కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో ఉన్నందున, అంతర్రాష్ట్ర సరిహద్దుల వద్ద ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ హెచ్చరించారు. ముఖ్యంగా వరి అక్రమ రవాణా ను, బక్రీద్ సందర్భంగా కర్ణాటక సరిహద్దుల నుండి అక్రమ పశువుల రవాణా మరియు ఇతర అక్రమ రవాణా లను అరికట్టేందుకు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలన్నారు. స్థానికంగా నమోదయ్యే నేరాల సరళిని విశ్లేషించి, ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా నేరాల నియంత్రణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పెండింగ్‌లో ఉన్న దొంగతనం కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితులను త్వరగా పట్టుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పెద్దేముల్ ఎస్సై ప్రశాంత్ వర్ధన్ తో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటమి విజయానికి తొలిమెట్టు

**● పదవ తరగతి విద్యార్థులకు అభ్యసన మెరుగుదల తరగతులను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**అదిలాబాద్ మే12( సమయం న్యూస్). :** ఓటమి అనేది విజయానికి ఒక సోపానం వంటిదని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని ఖుర్షాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (గెజిటెడ్ నెంబర్-1)లో పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం అభ్యసన మెరుగుదల తరగతులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఇంచార్జి జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్వర్ తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ, ఓటమి అనేది విజయానికి ఒక సోపానం వంటిదని, పరీక్షల్లో అనుతీర్ణులు అయినందుకు ఎవరూ నిరాశ చెందవద్దని ధైర్యం చెప్పారు. పరీక్ష అనేది ఒక నిరంతర ప్రక్రియ అని, ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని సూచించారు. తన వ్యక్తిగత అనుభవాన్ని విద్యార్థులతో పంచుకుంటూ, తాను కూడా మొదటి ప్రయత్నంలో సివిల్ సర్వీసెస్ పరీక్షలో విజయం సాధించలేదని గుర్తు చేసుకున్నారు. ఓటమికి గల కారణాలను విశ్లేషించుకుని, పట్టుదలతో మళ్ళీ చదివి ఇండియన్ రైల్వే అకౌంట్స్ సర్వీస్ సాధించానని, ఆపై మరింత స్ఫూర్తితో ఐ.ఏ.ఎస్ లక్ష్యాన్ని చేరుకున్నానని వివరించారు. విద్యార్థులు కూడా ఎందుకు ఫెయిల్ అయ్యామో ఆలోచించి, లోపాలను సరిదిద్దుకుని కష్టపడితే ఖచ్చితంగా విజయం సాధిస్తారని భరోసా ఇచ్చారు. ఈ ప్రత్యేక తరగతులకు విద్యార్థులంతా క్రమం తప్పకుండా హాజరుకావాలని, క్రమశిక్షణతో చదవాలని సూచించారు. ఏదైనా అంశం అర్థం కాకపోతే సంకోచించకుండా ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని, అవసరమైతే తరగతుల సమయాన్ని పెంచమని కోరవచ్చని తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం డిజిటల్ క్లాసులు, స్నాక్స్ వంటి ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొంటూ, సానుకూల దృక్పథంతో సప్లిమెంటరీ పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నీలాదేవి, ఏంఈఓ సోమయ్య, డీసీఈబీ సెక్రటరీ గజేందర్, ఏఏంఓలు లక్ష్మణ్, అజయ్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

**● కలెక్టర్ ఇలా త్రిపాఠి**



**నిజామాబాద్, మే 12( సమయం న్యూస్)** విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. పదవ తరగతిలో వివిధ సబ్జెక్టులలో ఫెయిల్ అయిన వారికి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించేందుకు వీలుగా జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో రెమిడియల్ క్యాంప్ పేరిట ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని శంకర్ భవన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థిని విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులతోనూ భేటీ అయ్యారు. ఒకటి, రెండు సబ్జెక్టులలో తప్పిపోయినంత మాత్రాన అనవసర ఆందోళనకు గురి కావద్దని సూచించారు. అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు మరో మూడు వారాల వరకు సమయం మిగిలి ఉన్నందున ఏకాగ్రతతో శ్రద్ధగా చదువుకోవాలని, శిక్షణ తరగతులకు క్రమం తప్పకుండా హాజరు కావాలని కలెక్టర్ సూచించారు. మీరు మీ కోసం కష్టపడి చదివి మంచి మార్కులు సాధిస్తే, మీ తల్లిదండ్రులు కూడా ఎంతో సంతోషిస్తారని అన్నారు. జీవితంలో ఓటములు ఎదురవడం సహజమేనని, వాటిని భవిష్యత్తు విజయాలకు సోపానాలుగా మార్చుకోవాలని హితవు పలికారు. ఉన్నత స్థానాలకు చేరాలంటే షార్ట్ కట్స్ అంటూ ఏవీ ఉండవని, విద్యార్థి దశలో కష్టపడితే జీవితం అంతా సుఖ సంతోషాలతో గడపవచ్చని మార్గనిర్దేశం చేశారు. స్పష్టమైన గమ్యాన్ని నిర్దేశించుకుని, ప్రణాళికాబద్ధంగా అంకిత భావంతో కృషి చేయాలని సూచించారు. అడ్వాన్స్ సప్లిమెంటరీలో మంచి మార్కులు సాధించడమే లక్ష్యంగా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని,సెల్ ఫోన్లను కొన్నాళ్ళ పాటు పక్కన పెట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ విషయంలో తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను కట్టడి చేయాలని, వారి ఉజ్వల భవిష్యత్తు కోసం స్మార్ట్ ఫోన్ల విషయంలో కొంత కటువుగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు.

**సమ్మర్ క్యాంప్ ను సందర్శించిన కలెక్టర్**

కాగా, వేసవి సెలవులను దృష్టిలో పెట్టుకుని విద్యార్థుల కోసం శంకర్ భవన్ పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ ను కలెక్టర్ ఇలా త్రిపాఠి సందర్శించారు. ఈ శిబిరంలో విద్యార్థులకు వివిధ అంశాలలో అందిస్తున్న తర్ఫీదు గురించి ఆరా తీశారు. చిన్నారులతో కలెక్టర్ ముచ్చటిస్తూ వారి అభిరుచుల గురించి అడిగి తెలుసుకున్నారు. వేసవి సెలవులను చక్కగా సద్వినియోగం చేసుకోవాలని, డాన్స్, సింగింగ్, ఇండోర్ గేమ్స్ వంటి వాటిలో మెళుకువలను నేర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలు అంశాలపై ప్రశ్నలు వేస్తూ, చక్కగా సమాధానాలు ఇచ్చిన చిన్నారులకు కలెక్టర్ ప్రత్యేకంగా బహుమతులు, చాక్లెట్లు అందజేశారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యా శాఖ అధికారి పి. అశోక్, ఎంఈఓ లు సాయిరెడ్డి, అరవింద్ గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయన్న తదితరులు ఉన్నారు.

## ఈ నెల 13న జరిగే పాలీసెట్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి

**● జిల్లా పాలీసెట్ కోఆర్డినేటర్ డా.ఎం.శ్రీనివాసులు**




**నారాయణపేట, మే 12 (సమయం న్యూస్) :** రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్న పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (పాలీసెట్--2026) పరీక్షకు నారాయణపేట జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా పాలీసెట్ కోఆర్డినేటర్ డా. ఎం. శ్రీనివాసులు తెలిపారు. జిల్లాలో మొత్తం 5 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.అందులో నారాయణపేట పట్టణంలో 3 కేంద్రాలు, కోస్గిలో 2 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పరీక్షకు జిల్లాలో మొత్తం 1330 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని చెప్పారు.పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించబడుతుందని తెలిపారు. పరీక్షా కేంద్రాలలో తాగునీరు, విద్యుత్, ఫర్నిచర్, సీసీ కెమెరాలు, వైద్య సదుపాయాలు తదితర ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు.అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు ఉదయం 10 గంటలలోపు చేరుకోవాలని, ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించబడరని స్పష్టం చేశారు. అభ్యర్థులు తప్పనిసరిగా పాలీసెట్ హాల్ టికెట్, ఆధార్ కార్డు, హెచ్‌బీ పెన్సిల్, బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్, ఎరేజర్ వెంట తీసుకురావాలని సూచించారు.ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్ ఫోన్లు, కాలిక్యులేటర్లు పరీక్షా కేంద్రాలకు అనుమతించబడవని తెలిపారు.పరీక్షను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం, విద్యాశాఖ అధికారులు, కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. పరీక్ష విజయవంతం కావడానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజల సేవే లక్ష్యం.

**● చలివేంద్రాల ఏర్పాటు అవసరం: ప్రభాకర్ రెడ్డి**



**రాయపోల్, మే 12:** ఎండాకాలంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రం రాయపోల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ప్రజల సేవే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని,వేసవిలో ప్రజల దాహాన్ని తీర్చేందుకు చలివేంద్రాల ఏర్పాటు ఎంతో అవసరమని పేర్కొన్నారు.ఇటువంటి సేవా కార్యక్రమాలను పార్టీ తరఫున నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పలు పథకాలను అమలు చేస్తోందని, రైతులకు ఆర్థిక భరోసా, మహిళల సాధికారత, యువతకు ఉపాధి అవకాశాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.పేదల సంక్షేమం కోసం ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత విద్యుత్,మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఆరోగ్య సేవలను విస్తరించి అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్తుగారి కిష్టారెడ్డి, ఉషనగళ్ళ స్వామి,నాగేశ్వర్ రావు, యూసుఫ్,నర్సింగరావు, అశోక్,స్వామి,వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# సోలార్ విలేజ్ గా రఘునాథపాలెంను అభివృద్ధి చేయాలి

● జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

**ఖమ్మం, మే 12 : (సమయం న్యూస్) :** జిల్లాలో పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా రఘునాథపాలెం గ్రామాన్ని సోలార్ రూఫ్ టాప్ వ్యవస్థ కలిగిన పైలట్ గ్రామంగా అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. రఘునాథపాలెం గ్రామంలో అమలవుతున్న సోలార్ మోడల్ ప్రాజెక్టును జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. గ్రామంలో ఏర్పాటు చేస్తున్న సోలార్ రూఫ్‌టాప్‌ల పురోగతిపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.గ్రామంలో మొత్తం 1081 మంది గృహజ్యోతి లబ్ధిదారులు ఉన్నారని, వారిలో 821 ఇళ్లలో సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేయడానికి అనుకూల పరిస్థితులు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 110 ఇళ్లలో సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటు పూర్తయిందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ రఘునాథపాలెంను భవిష్యత్తులో సోలార్ విలేజ్"గా తీర్చిదిద్దుతామని తెలిపారు. ప్రతి ఇంటికి కనీసం 2 కిలోవాట్ల సామర్థ్యంతో సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. గ్రామంలోని కమ్యూనిటీ హాళ్లు, ప్రభుత్వ భవనాలు, ఇతర సామూహిక ప్రదేశాలపై కూడా సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.గ్రామంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన అదనపు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులకు సూచించారు. సోలార్ రూఫ్‌టాప్‌ల ద్వారా ఉత్పత్తి అయ్యే అదనపు విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.గ్రామంలో జరుగుతున్న సెన్సస్–2027 కార్యక్రమంపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. జనగణన సిబ్బందికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. ప్రజలు సరైన సమాచారాన్ని అందించాలని, ఎటువంటి అపోహలకు లోనుకాకుండా తప్పుడు సమాచారం ఇవ్వవద్దని సూచించారు. జనగణన కారణంగా ఎలాంటి ప్రభుత్వ పథకాలు ప్రభావితం కావని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రఘునాథపాలెం తహసీల్దార్ శ్వేత, ఆర్ఐ వహీద్, సంబంధిత శాఖల అధికారులు, విద్యుత్ శాఖ సిబ్బంది, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



## నారాయణపేట మున్సిపాలిటీ పరిధిలోని కౌన్సిలర్లు, దీూాలు మరియు సూపర్వైజర్లతో

● సమావేశం నిర్వహించిన జిల్లా ఓటర్

● నమోదు అధికారి మరియు రెవెన్యూ డివిజన్ అధికారి

● రాజేందర్ గౌడ్



**నారాయణపేట, మే,12(సమయం న్యూస్) :** నారాయణపేట ఓటర్ నమోదు అధికారి మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా త్వరలో నిర్వహించబడనున్న (ఎస్.ఐ. ఆర్) కార్యక్రమానికి సంబంధించి ప్రస్తుతం కొనసాగుతున్న ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియపై గౌరవ కౌన్సిలర్లకు అవగాహన కల్పించారు. అలాగే కౌన్సిలర్లు, బూత్ లెవెల్ ఏజెంట్లు మరియు రాజకీయ పార్టీల ప్రతినిధులు నారాయణపేట పట్టణంలోని దీూాలకు ఓటర్ మ్యాపింగ్ కార్యక్రమంలో పూర్తి సహకారం అందించాలని కోరారు.ప్రస్తుతం పట్టణ పరిధిలోని 40 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ మ్యాపింగ్ శాతం చాలా తక్కువగా ఉందని పేర్కొంటూ, పట్టణంలో తప్పనిసరిగా 90 శాతానికి పైగా ఓటర్ మ్యాపింగ్ పూర్తయ్యేలా బూత్ లెవెల్ అధికారులకు సహకరించాలని ఆర్డీవో కోరారు. అలాగే దీూాలు వేగవంతంగా ఓటర్ మ్యాపింగ్ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఓటర్ నమోదు అధికారి మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి,రాజేందర్ గౌడ్ నారాయణపేట.

# ఇంటర్ మీడియట్ సప్లమెంటరీ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు

● జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS.

● పరీక్ష కేంద్రాల వద్ద 163 BNSS (144 సెక్షన్) అమలు,

● పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు అప్రమత్తంగా ఉండాలి.

● పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లపై ప్రత్యేక నిఘా.



**నారాయణపేట,12(సమయం న్యూస్) :** ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షల దృష్ట్యా నారాయణపేట జిల్లా వ్యాప్తంగా మొత్తం 09 పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఝూ తెలిపారు. జిల్లాలో పరీక్షలు జరుగనున్న నేపథ్యంలో ప్రతి పరీక్ష కేంద్రం నుండి 100 మీటర్ల పరిధిలో జిరాక్స్ సెంటర్లు తెరిచి ఉంచకూడదని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద 163 బి.యన్.యస్.యస్ (144 సెక్షన్) అమలులో ఉంటుందని, కేంద్రాల వద్ద గుంపులుగా తిరగడం నిషేధమని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాలోకి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించరాదని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండి, పరీక్షలు వచ్చే విద్యార్థులను తనిఖీ చేసి పంపాలని, పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ప్రతి పరీక్ష కేంద్రాన్ని సంబంధిత పోలీసు అధికారులు ప్రత్యేకంగా సందర్శించి బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించాలని ఆదేశించారు. పరీక్ష సమయాల్లో కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అదేవిధంగా ప్రశ్నాపత్రాలను పోలీస్ స్టేషన్ నుండి పరీక్ష కేంద్రాలకు, పరీక్ష అనంతరం పోస్టాఫీస్‌కు తరలించే వరకు ప్రత్యేక ఎస్కార్ట్ ఏర్పాటు చేసి భద్రత కల్పించాలని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల లోపల ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరాదని సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఎగ్జామ్ సూపరింటెండెంట్ సూచనల మేరకు విధులు నిర్వహించాలని పోలీసు సిబ్బందికి సూచించారు.

## గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు కౌన్సిలింగ్.



**కొడంగల్, మే,12(సమయం న్యూస్) :** హైదరాబాద్, రంగారెడ్డి,మేడ్చల్, మల్కాజ్గిరి, వికారాబాద్ మరియు సంగారెడ్డి జిల్లాల పరిధి లో గల గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో 2026-27 మొదటి సంవత్సరం సీట్ల భర్తీ కొరకు ఈనెల 16-5-2026 న బాలురకు 18-5-2026 న బాలికలకు గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో ఉదయం 10 గంటలకు కౌన్సిలింగ్ నిర్వహించబడు నని రీజినల్ కోఆర్డినేటర్ నాగార్జున రావు ఒక ప్రకటనలో తెలియజేశారు.కావున ఆసక్తి గల విద్యార్థులు క్రింది ధ్రువ పత్రాలను తీసుకొని కౌన్సిలింగ్ కు హాజరు కాగలరు.

1)బదిలీ ధృవపత్రం (టీ.సి)

2) స్కూల్ సెకండరీ సర్టిఫికెట(S.S.C memo)

3) స్టడీ అండ్ కండక్ట్ సర్టిఫికెట్.

4) కుల ధ్రువీకరణ పత్రం

5)2026-27 కు సంబంధించిన ఆదాయ ధ్రువీకరణ పత్రం (వీరి సంవత్సర ఆదాయం 200000 లకు మించి ఉండరాదు)

6) ఆధార్ జిరాక్స్, స్పోర్ట్స్ సర్టిఫికెట్ (ఉన్నవారు)

7) పి హెచ్ సి సర్టిఫికెట్ (ఉన్నవారు)

8) మూడు కలర్ పాస్ ఫొటోస్.

9) పై తెలిపిన అన్ని ధ్రువీకరణ పత్రాలు రెండు జతల జిరాక్సాకాపీలతో హాజరు కాగలరు. సంబంధించిన గ్రూపులు:

వీూజ,దీఅూజ,జజుజ,ఎజుజ మరియు మీూ గ్రూపులో

పైన తెలిపిన రంగారెడ్డి, హైదరాబాదు రీజియన్ లో కలవు. గమనిక: ప్రతి గ్రూపు నందు ూ,ూజ,దీజ.ూజ విద్యార్థులతో పాటు స్పోర్ట్స్ మరియుూఎజ కోటాలో పరిమిత సీట్లు కలవు.కావున 16-5-2026 మరియు 18-5-2026 న జిన్నారం (సంగారెడ్డి) కళాశాలలో కౌన్సిలింగ్ కు హాజరు కాగలరు.తెలంగాణ గిరిజన సంక్షేమ కళాశాల ప్రిన్సిపల్ కె.కొండయ్య (ఎఫ్ఏసి) కొడంగల్

# రీ సర్వే ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలి

● జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్

**ఖమ్మం , మే 12 : ( సమయం న్యూస్ ) :** రీ సర్వే ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామంలో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మంగళవారం పరిశీలించి రీ సర్వే నిర్వహిస్తున్న అధికారులను కలిసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ కాకరవాయి గ్రామంలో ఆర్ఎస్ఆర్ పట్టా విస్తీర్ణ సమస్యలు ఉన్నందున వాటి పరిష్కారం కోసం రీ సర్వే చేపడుతున్నామని, భూ వివాదాల పరిష్కారం, భూ రికార్డుల నవీకరణ లక్ష్యంగా రీ సర్వే చేపట్టి, భూముల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయనున్నట్లు చెప్పారు.రైతు వేదికను కేంద్రంగా చేసుకుని అక్కడే కంప్యూటర్ ఏర్పాటు చేసి భూ వివరాలను నమోదు చేయాలని సూచించారు. గ్రామంలో రీ సర్వే నిర్వహణ కోసం ఐదు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి బృందంలో ఒక సర్వేయర్, జీపీవోలు ఉంటారని చెప్పారు. రీ సర్వే ప్రక్రియలో ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు, జీవో ప్రకారం విధి విధానాలు అమలు చేయాలని ఆదేశించారు. మొదట ఫారం-6 ఇవ్వాలని, అనంతరం 15 రోజుల గడువు పాటించిన తరువాతే తదుపరి ప్రక్రియ చేపట్టాలని తెలిపారు. నిబంధనల ప్రకారం పూర్తి ప్రక్రియను గుర్తించి అమలు చేయాలని సూచించారు. ఇందుకోసం ఎస్ఓపీ సిద్ధం చేసుకుని దశలవారీ విధానాన్ని ఖచ్చితంగా అనుసరించాలని తెలిపారు.గ్రామంలోని అన్ని రహదారులు, ప్రజా స్థలాలు, ప్రభుత్వ భూములు, ప్రభుత్వ సంస్థల భూముల వివరాలను కోఆర్డినేట్లతో సహా ఖచ్చితంగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూముల వివరాలను స్పష్టంగా పంచనామా చేసి నమోదు చేయాలని సూచించారు.ప్రతి బృందం రోజుకు 50 నుంచి 70 ఎకరాల వరకు రీ సర్వే పూర్తి చేయాలని, ఐదు బృందాలు కలిసి రోజుకు సుమారు 250 నుంచి 300 ఎకరాల వరకు సర్వే నిర్వహించాలని కలెక్టర్ లక్ష్యాలను నిర్దేశించారు. ప్రతిరోజూ ఉదయం 7 గంటలకే బృందాలు క్షేత్రస్థాయిలో పని ప్రారంభించాలని ఆదేశించారు. ప్రతి రైతు పేరు, భూ విస్తీర్ణం, పూర్తి వివరాలు సేకరించి నమోదు చేయాలని సూచించారు. ప్రతిరోజూ సర్వే నివేదికలు సమర్పించాలని, సర్వే వివరాల డేటా ఎంట్రీ, మ్యాప్ తయారీ ప్రక్రియ సమాంతరంగా కొనసాగాలని తెలిపారు. ఈ గ్రామంలో ఆర్ఎస్ఆర్ పట్టా విస్తీర్ణ సమస్యలు ఉన్నందున వాటి పరిష్కారం కోసం రీ సర్వే చేపడుతున్నామని తెలిపారు. రీ సర్వే ద్వారా ఎవరూ తమ భూమి విస్తీర్ణాన్ని కోల్పోరని స్పష్టం చేశారు.ప్రస్తుతం గ్రామంలో సర్వే నంబర్ల విషయంలో ఉన్న గందరగోళం పూర్తిగా తొలగిపోతుందని, అన్ని సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. రీ సర్వే విజయవంతంగా నిర్వహించాలంటే గ్రామ సభలు నిర్వహించడం తప్పనిసరి అని చెప్పారు. రెవెన్యూ గ్రామ పరిధిలో ఉన్న మూడు గ్రామాల ప్రజలందరినీ గ్రామ సభకు ఆహ్వానించాలని సూచించారు. రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో రీ సర్వే సమయంలో వివిధ సమస్యలు వచ్చే అవకాశముందని, అందుకే ఆర్డీఓ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే కమిటీకి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని, కమిటీ ఆమోదించిన తరువాత మాత్రమే సర్వే ప్రక్రియ కొనసాగించాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో అధికారులు ఎలాంటి వివాదాలకు దిగకుండా సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ విల్సన్, సర్వేయర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ నెల రోజుల ప్రత్యేక సభ్యత నమోదు కేంద్రాన్ని ప్రారంభించిన...జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక ఐఏఎస్




**నారాయణపేట, మే,12(సమయం న్యూస్) :** జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ నెల రోజుల ప్రత్యేక సభ్యత్వ నమోదు కేంద్రాన్ని కలెక్టర్ కార్యాలయం ప్రజావాణి హాల్లో ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ప్రియాంక ఐఏఎస్ . ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చట్టభద్ధంగా ఏర్పడ్డ ఒక స్వచ్ఛంద సేవా సంస్థ. ప్రజలకు విపత్తుల్లో సేవలందిస్తుంది. అందుకే ప్రజలు ఈ సంస్థ లో అధిక సంఖ్యలో సభ్యత్వం తీసుకొని సేవలు అందించాలని కోరారు. ఈ ప్రారంభ కార్యక్రమం లో జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ కె. సుదర్శన్ రెడ్డి తోపాటు, రాష్ట్ర రెడ్ క్రాస్ ఎంసీ మెంబెర్ ఆత్మరామ్, జిల్లా జూనియర్, యూత్ రెడ్ క్రాస్ కన్వీనర్ లు జొన్నల సుభాష్,ఆ నందు పటేల్, రెడ్ క్రాస్ పాట్రన్ జి.ఆర్.రెడ్డి మరియు మున్సిపల్ వైస్ ఛైర్పర్సన్ మంజుల, సభ్యులు ఉమేష్,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

13-05-26 Samayam_Layout 1 5/13/2026 5:21 AM Page 9



# చంచల్‌గూడలో తెలంగాణ జైలు మ్యూజియం ప్రారంభం

● "జైల్ అనుభవం"తో ప్రజలకు కారాగార జీవనంపై అవగాహన





**హైదరాబాద్, మే 12( సమయం న్యూస్). :** హైదరాబాద్‌లోని చంచల్‌గూడలో తెలంగాణ జైలు మ్యూజియం మరియు "జైల్ అనుభవం" కార్యక్రమాన్ని తెలంగాణ గవర్నర్ శ్రీ శివప్రతాప్ శుక్లా ప్రారంభిం చారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, జైలు వ్యవస్థ శిక్షా కేంద్రాల నుంచి సంస్కరణ, పునరావాసం, మానవీయ మార్పు కేంద్రాలుగా రూపాంతరం చెందిందన్నారు. ఈ పరిణామాన్ని తెలంగాణ జైలు మ్యూజియం ప్రజలకు చారిత్రకంగా, విద్యాత్మకంగా పరిచయం చేస్తుందన్నారు. పాత జైలు బ్యారక్కుల నమూనాలు, సంకెళ్లు, ఉరికంబాలు, అరుదైన జైలు వస్తువులు, చిత్ర గ్యాలరీలు, ఆడియో--విజువల్ ప్రదర్శనలు మ్యూజియంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. "జైల్ అనుభవం" కార్యక్రమం ద్వారా ప్రజల్లో చట్టాల పట్ల గౌరవం, క్రమశిక్షణ, బాధ్యత, మానవీయత పెరుగుతాయని గవర్నర్ పేర్కొన్నారు. ఈ వినూత్న కార్యక్రమాన్ని రూపొందించిన తెలంగాణ కారాగార శాఖను, డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ డాక్టర్ సౌమ్య మిశ్రా మరియు ఆమె బృందాన్ని గవర్నర్ అభినందించారు. డాక్టర్ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ, చంచల్‌గూడలో ఆధునిక రూపంలో జైలు మ్యూజియాన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ప్రజలకు 24 గంటలు లేదా 12 గంటల చెల్లింపు ఆధారిత "జైల్ అనుభవం" కల్పించనున్నట్లు చెప్పారు. ఇందులో జైలు వసతి, జైలు భోజనం, క్రమశిక్షణ, రోజువారీ కార్యకలాపాల అనుభవం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమం వినోదం కోసం కాకుండా అవగాహన, సహానుభూతి, బాధ్యత, కారాగార సంస్కరణలపై చైతన్యం కల్పించడమే లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు.

సందర్శనలు, ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్స్ కోసం www.telanganajailexperience.com వెబ్‌సైట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. వివరాల కోసం telanganafeelthejail@gmail.com, ఫోన్ ౦91 94946 32046 సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కారాగార శాఖ ఉన్నతాధికారులు, సిబ్బంది, ఆహ్వానితులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన మున్సిపల్ డీఈ



**కాకినాడ మే12( సమయం న్యూస్) :** సామర్లకోట మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మున్సిపల్ శాఖకు చెందిన డీఈ శశిధర్ లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. కాంట్రాక్టర్ వద్ద నుంచి రూ. 10 వేల లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు శశిధర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం ఆయనను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ ఘటన మున్సిపల్ కార్యాలయంలో కలకలం రేపింది.

# ములుగు జిల్లాలో విద్యుత్ పనులను పరిశీలించిన ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి.





**ములుగు మే12( సమయం న్యూస్). :** తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ సీఎండీ శ్రీ కర్నాటి వరుణ్ రెడ్డి ఐ.ఏ.ఎస్ ములుగు జిల్లాలో పలు విద్యుత్ అభివృద్ధి పనులను మంగళవారం పరిశీలించారు. ములుగులో కొత్తగా నిర్మిస్తున్న డిపార్ట్‌మెంటల్ ఎస్పీఎం షెడ్ పనులను పరిశీలించిన సీఎండీ జూన్ నెలాఖరు నాటికి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రైవేట్ ఎస్పీఎం షెడ్ ను సందర్శించి, ఫెయిల్యూర్ ట్రాన్స్‌ఫార్మర్ల రికార్డులు, నిర్వహణ విధానం, పనితీరును పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల ప్రక్రియను మరింత వేగవంతం చేసి రోలింగ్ స్టాక్ పెంచుకోవాలని సూచించారు . ట్రాన్స్ఫార్మర్ల ను రిపేర్లు చేసి త్వరితగతిన అందేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం 33 కెవి కొత్త లైన్ పనులను సీఎండీ పరిశీలించారు. ఈ లైన్ సుమారు 27 కిలోమీటర్ల అటవీ ప్రాంతం గుండా కర్లపల్లి సబ్ స్టేషన్ నుండి వస్తూ లింగాల కొత్త సబ్ స్టేషన్ కు కలుస్తుందని అధికారులు వివరించారు. అదేవిధంగా పస్రా సెక్షన్ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న సెక్షన్ ఆఫీస్ పనులను పరిశీలించి, ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ 33/11 కెవి లింగాలనూతన సబ్ స్టేషన్ ఏర్పాటుతో గుండాల, కొడిశెల లింగాల పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా మరింత మెరుగ్గా అందుతుందని సీఎండీ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ నాణ్యత మెరుగుపడటంతో పాటు అంతరాయాలు తగ్గుతాయని పేర్కొన్నారు. లో వోల్టేజ్ సమస్య ఉండదని వివరించారు . వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు అభివృద్ధి పనులను సమయానికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సీఎండీ గారి వెంట సి.ఈ రాజు చౌహాన్ , ఎస్ ఈ ములుగు బేతి బిక్షపతి , ములుగు డీఈ ఆపరేషన్ నాగేశ్వర్ రావు, డీఈ ఎటూరునాగారం పురుషోత్తం డీఈ (ఎంఆర్టీ ఢ సి) సదానందం, ఈఈ సివిల్ వెంకట్రాం , ఏ.డి.ఈ సివిల్ ప్రణయ్ , సందీప్ పాటిల్ తాడ్వాయి ఏ.డి.ఈ రాజేష్ , ములుగు ఏ.డి.ఈ వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు .

# జనగణన ప్రతి పౌరుడి బాధ్యత
## సమగ్రసమాచారం దేశాభివృద్ధికి పునాది

● జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి, మే 12( సమయం న్యూస్). :** జనగణన ప్రతి పౌరుడి బాధ్యత అని, సమగ్ర మరియు ఖచ్చితమైన సమాచారం దేశాభివృద్ధికి పునాదిగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు. జనగణనపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో మంగళవారం జిల్లా కలెక్టరేట్ నుండి ఐబీ వరకు నిర్వహించిన "జనగణన అవగాహన మారథాన్ వాక్" కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జనగణనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని అన్నారు. జిల్లాలోజనగణన ప్రక్రియలో భాగంగా మే 10 వరకు స్వీయ గణన నిర్వహించగా, మే 11 నుంచి ఇంటింటి గణన ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నారని తెలిపారు. జనగణన సిబ్బందికి ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేశామని, ప్రజలు వారికి సహకరించాలని కోరారు. జనగణనలో సేకరించే వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు. జనగణన ద్వారా ప్రభుత్వానికి ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులపై స్పష్టమైన అవగాహన ఏర్పడి, సంక్షేమ పథకాల రూపకల్పన మరియు అమలులో ఉపయోగపడుతుందని తెలిపారు. దేశ అభివృద్ధికి ఖచ్చితమైన గణాంకాలు ఎంతో అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి కుటుంబం సరైన వివరాలు అందించి జనగణన విజయవంతానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, రెవెన్యూ,పోలీస్ అధికారులు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఎన్యూమరేటర్లు, ఆశా వర్కర్లు,వివిధ కళాశాలల విద్యార్థులు, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు, యువత,తదితరులు పాల్గొన్నారు.

# 12 గంటల లోగా మిల్లర్లు దిగుమతి చేసుకోవాలి.



**సిద్దిపేట మే12( సమయం న్యూస్). :** మిల్లులలో వరి ధాన్యాన్ని దిగుమతిలో జాప్యం కాకుండా వచ్చిన 12 గంటల లోపు దిగుమతి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి మిల్లర్ యజమానులను ఆదేశించారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని హనుమాన్ నగర్ లోని రాజీవ్ రహదారి పక్కన గల జగదాంబ ఇండస్ట్రీస్, మందపల్లి లో లక్ష్మీ శ్రీనివాస ఆగ్రో ప్రొడక్ట్స్, చిన్నకోడూరు మండలం రామునిపట్ల గ్రామంలో శివ పార్వతి రైస్ మిల్, మల్లారం గ్రామాల్లోని రామాంజనేయ మిల్ లలో ధాన్యం దిగుమతి ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు సజావుగా జరగాలంటే లారీలు ట్రాక్టర్ లలో మిల్లులకు పంపించిన ధాన్యాన్ని దిగుమతిలో జాప్యం చేయకుండా వెనువెంటనే దిగుమతి చేసుకోవాలని మిల్లర్ యజమానులను ఆదేశించారు. మిల్లుకు వచ్చిన వాహనాలు 12 గంటల లోపు దిగుమతి చేసుకోవాలని లేనియెడల జరిమానా విధించాలని సివిల్ సప్లై అధికారులకు ఆదేశించారు. దిగుమతిలో జాప్యం కాకుండా ఎక్కువమంది హమాలీలను అందుబాటులో ఉంచుకోవాలని రోజు 30, 40 మంది హమాలీలు ఉండేలా తప్పనిసరిగా మెయింటైన్ చెయ్యాలని ఆదేశించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన వర్ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలని ప్రవేటుగా కొనుగోలు చేసిన ధాన్యాన్ని తర్వాత దింపుకోవాలని తెలిపారు. ధాన్యం దిగుమతి కాగానే మిల్లర్ అక్నాలజ్మెంట్, ట్రక్ షిట్ జెనరేట్, ఓపిఎంఎస్ అప్లోడ్ పెండింగ్ ఉంచకుండా వెంటనే పూర్తి చెయ్యాలని ఆదేశించారు. దిగుమతిలో జాప్యం కాకుండా రెవెన్యూ అధికారులను నియమించినట్లు వేగంగా దిగుమతి చెయ్యాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా సివిల్ సప్లై అధికారి తనూజ, జిల్లా తూనికల కొలతల శాఖ అధికారి శివరంజని ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి.

- సీఎం రేవంత్ రెడ్డి
- కొనుగోలు కేంద్రాల్లోనే నాణ్యత పరిశీలన పూర్తి చేసి వెంటనే రశీదులు ఇవ్వాలి.
- స్థానిక హమాలీలను వంద శాతం వినియోగించి ఎక్కడా కొరత రాకుండా చూడాలి.
- ఖాళీగా ఉన్న ట్రాక్టర్లు, డీసీఎంలు సహా అన్ని వాహనాలను రవాణాకు వినియోగించాలి.
- మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ముఖ్యమంత్రి




**నారాయణపేట, మే,12(సమయం న్యూస్) :** మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు లతో కలిసి అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక, అదనపు కలెక్టర్ రెవిన్యూ శ్రీను తో కలిసి పాల్గొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలో ఉన్న ప్రతి ప్రైవేట్ గోదామును అవసరమైతే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొని నిల్వ సదుపాయాలను పెంచాలని సూచించారు. కమ్యూనిటీ హాళ్లు, రైతు బజార్లను తాత్కాలిక షెడ్లుగా వినియోగించాలని ఆదేశించారు. అవసరమైన వాహనాల ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో స్థానిక హమాలీలను వంద శాతం వినియోగించుకునేలా కార్యాచరణ రూపొందించాలని, ఎక్కడా హమాలీల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. హమాలీలు అధిక మొత్తంలో డబ్బు డిమాండ్ చేస్తే వారి లైసెన్సులను రద్దు చేయాలని, కొనుగోలు కేంద్రాల్లోనే నాణ్యత పరిశీలన అనంతరం రైతులకు వెంటనే రశీదులు ఇవ్వాలని, రైస్ మిల్లుల వద్ద ఎలాంటి కోతలు ఉండకూడదని ఆదేశించారు. పంట రవాణా కోసం ఖాళీగా ఉన్న అన్ని వాహనాలు, ట్రాక్టర్లు, డీసీఎం లను పూర్తి స్థాయిలో వినియోగించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. తడిసిన ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రతి రోజు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి కొనుగోళ్ల పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 25 లక్షల 78 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులకు కనీస మద్దతు ధర చెల్లింపుల కోసం ఇప్పటివరకు 3 వేల 873 కోట్లను విడుదల చేసినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 18 కోట్ల 68 లక్షల గన్నీ సంచులను అందుబాటులో ఉంచామని, ఎటువంటి కొరత లేదని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు హమాలీలు, రవాణా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే ఫీడ్‌బ్యాక్ అందేలా వ్యవస్థ ఉండాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద గన్నీ సంచులు, హమాలీలు, రవాణా వాహనాల కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు చెల్లింపులు వేగంగా జరిగేలా ట్యాబ్ ఎంట్రీలు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ భారీగా మొక్కజొన్న దిగుబడి వచ్చిందని, రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలని అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం, మొక్కజొన్న తెలంగాణలోకి రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. అవసరమైన బందోబస్తు, విజిలెన్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. వర్షాల సూచనలపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ కొనుగోళ్ల వేగాన్ని పెంచాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు మాట్లాడుతూ రాష్ట్రంలో పెద్ద ఎత్తున ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు జరుగుతున్నాయని, రాబోయే ఒక నెల అత్యంత కీలకమని, రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ వెంకట్ రాములు, డిఎం సివిల్ సప్లై సైదులు, పౌర సరఫరాల శాఖ అధికారి బాల్ రాజ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం బస్తాల లోడింగ్, అన్ లోడింగ్ వేగంగా పూర్తి చేయాలి

## - జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఐఏఎస్.



**మద్దూర్, గుండుమాల్, మండలం, మే,12(సమయం న్యూస్)** కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు పూర్తయిన ధాన్యం బస్తాలను వెంటనే లోడింగ్ చేయించాలని,అలాగే రైస్ మిల్లర్లు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా వచ్చిన లారీల్లోని బస్తాలను త్వరగా అన్ లోడింగ్ చేయించాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఆదేశించారు. రబీ ధాన్యం సేకరణలో భాగంగా కేంద్రాల వద్ద లోడింగ్, మిల్లుల వద్ద లారీల అన్లోడింగ్ జాప్యం జరుగుతున్నదని తమ దృష్టికి వచ్చిందని, రెండు రోజుల్లో కేంద్రాల్లో ఉంచిన ధాన్యం బస్తాల లోడింగ్ పూర్తి కావాలని ఆమె స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టర్ జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ కుమార్ తో కలిసి జిల్లాలోని మద్దూరు, పల్లెగడ్డ తండా, దొరేపల్లి, గుండుమాల్, అమ్లికుంట పీ ఏ సి ఎస్, ఐ కే పీ కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా మద్దూరు కొనుగోలు కేంద్రానికి వెళ్లిన కలెక్టర్ ఇంతవరకు కేంద్రంలో ఎన్ని బస్తాల ధాన్యం కొనుగోలు చేశారని? ఇంకా ఎన్ని బస్తాల ధాన్యం విక్రయానికి వస్తుందని ? ప్రస్తుతం కేంద్రంలో ఎన్ని బస్తాలు ఉన్నాయని ప్రశ్నించారు.ఇప్పటివరకు 13 వేల బస్తాలు కొనుగోలు చేశామని, ఇంకో 10 వేల బస్తాలు విక్రయానికి వచ్చే అవకాశం ఉందని, కేంద్రంలో ప్రస్తుతం 5 వేల బస్తాలున్నాయని, లారీల కొరత కారణంగా లోడింగ్ నిలిచి పోయిందని కేంద్రం ఇన్ ఛార్జ్ కలెక్టర్ కు వివరించారు. స్పందించిన కలెక్టర్ వెంటనే ఆర్ టీ వో మేనకా గాంధీ కి ఫోన్ చేసి మాట్లాడి, వెంటనే మద్దూరు, గుండుమాల్, కోస్గి మండలాల పరిధిలోని కొనుగోలు కేంద్రాలలో నిల్వ ఉన్న ధాన్యం బస్తాలను లోడింగ్ చేసేందుకు వాహనాలను ( లారీలు) తెప్పించాలని ఆదేశించారు. తరవాత పల్లెగడ్డ తాండ కు చెందిన ఐకేపీ కేంద్రానికి వెళ్లి ధాన్యం కుప్పలను చూసి తేమ శాతాన్ని, ప్యాడీ క్లీనర్ ను పరిశీలించారు. ఆ కేంద్రంలో నిల్వ ఉన్న బస్తాలను లోడింగ్ చేసేందుకు 4 లారీలు కావాలని నిర్వాహకులు కలెక్టర్ ను కోరగా, లారీలు సమకూర్చి బుధవారం సాయంత్రం వరకు ధాన్యం బస్తాలను లోడింగ్ చేయించాలని సివిల్ సప్లై అధికారి సైదులు కు సూచించారు. అనంతరం దొరేపల్లి వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు.ధాన్యం బస్తాల తుకాన్ని చెక్ చేశారు.కేంద్రంలో నిల్వ ఉన్న బస్తాలను అవసరమైతే ట్రాక్టర్ల ద్వారా మిల్లులకు తరలించాలని ఆమె తెలిపారు.కొనుగోలు కేంద్రంలో తాగునీటి వసతి కల్పించాలన్నారు. ఆ తర్వాత గుండుమాల్ వరి కొనుగోలు కేంద్రానికి వెళ్లి ఎంత మంది రైతులకు ధాన్యం డబ్బులు వారి ఖాతాల్లో జమ అయ్యాయని కేంద్రం ఇన్ ఛార్జ్ ని ప్రశ్నించగా 70 మంది రైతులకు డబ్బులు పడ్డాయని ఇన్ ఛార్జ్ కలెక్టర్ కు తెలిపారు.టాబ్ ఎంట్రీ ఎప్పటికప్పుడు చేయాలని చెప్పారు. కేంద్రంలో టార్పా లైన్లను అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం కోస్గి మండలం కడెం పల్లి మహా లక్ష్మి రైస్ మిల్లును సందర్శించారు.మిల్లు యజమానితో మాట్లాడుతూ ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన దాన్యం బస్తాలను ఆన్ లోడింగ్ చేయించాలన్నారు. మిల్లుకొచ్చిన లారీలు వెంటనే అన్లోడ్ చేసుకుని తిరిగి కొనుగోలు కేంద్రాలకు పంపించాలని ఆదేశించారు. అవసరమైతే హమాలీలను ఎక్కువ మందిని ఏర్పాటు చేసుకొని అన్లోడ్ ను పెంచాలన్నారు. రానున్న 10 రోజులు జిల్లాలో ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని, ప్రత్యేకించి ప్రభుత్వ కేంద్రాల ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలన్నారు .వ్యవసాయ ,రెవెన్యూ, ఆర్టీవో, పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో కొనుగోళ్లు సజావుగా జరిగేలా, ధాన్యం బస్తాల లోడింగ్, అలాగే రైస్ మిల్లులకు వెళ్లిన లారీల్లోని బస్తాలను ఆన్ లోడింగ్ చేసే వరకు దగ్గరుండి పర్యవేక్షణ చేయాలని, రెండు రోజుల పాటు ఆయా మండలాల లోనే అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. కేంద్రాల్లో లోడింగ్, మిల్లుల వద్ద ఆన్ లోడింగ్ చేసే ఫోటోలను ఎప్పటికప్పుడు తనకు పంపించాలని కలెక్టర్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. చివరగా గుండుమాల్ మండలం అమ్లికుంట కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆ కేంద్రంలో కొనుగోలు చేసిన 1500 బస్తాలు లోడింగ్ చేసేందుకు వాహనాలు రావడం లేదని అమ్లికుంట నుంచి బొగారాం వెళ్ళే దారి ఇరుకుగా ఉన్నందున పెద్ద వాహనాలు( లారీలు) రావడం కష్టమని, ట్రాక్టర్ల ద్వారా బస్తాలను లోడింగ్ చేసి మిల్లులకు తరలించాలని రైతులు కలెక్టర్ ను కోరారు. కేంద్రానికి ట్రాక్టర్లు తెప్పించి బుధవారం సాయంత్రం వరకు ధాన్యం బస్తాలు లోడింగ్ చేయించి మిల్లులకు తరలించే వరకు దగ్గరుండి చూసుకోవాలని తహసిల్దార్, వెహికల్ ఇన్స్పెక్టర్ లకు ఆమె సూచించారు. ఆయా కార్యక్రమాలలో పౌరసరఫరాల జిల్లా మేనేజర్ సైదులు, డీసీఓ హరి ప్రసాద్, తహసిల్దార్లు మహేష్, భాస్కర్, బక్క శ్రీనివాస్, సీఐ సైదులు, ఏవోలు, ఇతర అధికారులు, తదితరులు ఉన్నారు.

# ఔషధ వర్తక బంద్ కు అందరూ సహకరించాలి





**సమయం న్యూస్ గజ్వేల్ మే 12:** ఆల్ ఇండియా మెడికల్ షాప్స్ బంద్ చేయాలని దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆన్లైన్లో ఔషధ విక్రయాలను నిలిపివేయాలని కార్పొరేట్ సంస్థల భారీ డిస్కౌంట్లను నిలిపివేయాలని నకిలీ ఔషధాలను నివారించాలి ఆన్లైన్లో దొరికే స్టెరాయిడ్స్ లాంటి మందులను డాక్టర్ యొక్క రసీదు ఉంటేనే అమ్మకాలు జరపాలని దేశవ్యాప్తంగా దుకాణాలను 20-05- 2026 తేదీనాడు దేశవ్యాప్తంగా ఉన్న కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్ట్ ఔషధ దుకాణాలు బందు చేయాలని భారతదేశ కెమిస్ట్రీ డ్రగ్గిస్ట్ అధ్యక్షుడు తెలియజేశారు గజ్వేల్ ఏరియా ఉన్న మెడికల్ షాప్స్ అన్ని మూసివేయాలని తెలియజేశారు గజ్వేల్ ఆర్డిఓ చంద్రకళ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఇవ్వడం జరిగిందిఈ కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గజ్వేల్ అధ్యక్షులు రాళ్ల బండి పద్మజ్యోతి గజ్వేల్ కెమిస్ట్రీ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ గజ్వేల్ అధ్యక్షులు పేర్ల దేవదాస్ కార్యదర్శి జనగామ రాజ గౌడ్ ప్రధాన కార్యదర్శి సీత యాదగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల వెంకటేశ్వర్లు బారు అరవింద్ పబ్బా సాయిరాం సూరం సత్యం రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ పట్టివేత కేసు నమోదు

● ప్రభుత్వ అనుమతులు లేకుండ ఇసుక తరలిస్తే కఠిన చర్యలు...



● యాలాల ఎస్సై విఠల్ రెడ్డి

**యాలాల మండలం మే,12(సమయం న్యూస్) :** ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై విఠల్ రెడ్డి అన్నారు.వికారాబాద్ జిల్లా యాలాల మండలం ఆడల్పూర్ గ్రామ శివారులో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేయుచున్నారని తెలిసి యాలాల పోలీసులు అక్కడికి వెళ్లగా ఒక ట్రాక్టర్ నంబర్ ఇంజన్ ౧+08 జీ= 5775 ట్రాలీ నంబర్ యా34ది 9179 గల ట్రాక్టర్ ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేయుచుండగా పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చెసినట్లు యాలాల ఎస్సై విఠల్ రెడ్డి తెలిపారు.ఇట్టి ట్రాక్టర్ యజమాని ఆడల్పూర్ గ్రామానికి చెందిన బాలప్పది గుర్తించినట్లు ఎస్సై తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ అనుమతులు లేకుండా మండలంలో అక్రమం ఇసుక తరలిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

# మైనర్ బాలికకు న్యాయం చేయాలి

## -- బండి సంజయ్ కుమారుడిని వెంటనే అరెస్టు చేయాలి



**ఖమ్మం మే12( సమయం న్యూస్) :** ఖమ్మం జిల్లా పార్టీ కార్యాలయంలో నగర మాజీ అధ్యక్షుడు పగడాల నాగరాజు ఆధ్వర్యంలో నిరసన - బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం.

ఖమ్మం జిల్లా పార్టీ కార్యాలయంలో నగర మాజీ అధ్యక్షుడు పగడాల నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు సాయి భగీరథపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తూ తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయని, అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మరియు బీజేపీ పార్టీ పరస్పరం ఒకరిని ఒకరు కాపాడుకునే రాజకీయాలకు పాల్పడుతున్నాయని మండిపడ్డారు. సాధారణ ప్రజలకు ఒక న్యాయం, అధికార నాయకుల కుటుంబాలకు మరో న్యాయం అమలు అవుతోందని ఆరోపించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో "చట్టం ముందు అందరూ సమానులే" అని చెప్పినా, ఇప్పుడు మైనర్ బాలికకు జరిగిన అన్యాయంపై ప్రభుత్వం మౌనం వహించడం దురదృష్టకరమన్నారు. మైనర్ బాలిక కుటుంబం ఫిర్యాదు చేసినప్పటికీ, కఠినమైన సెక్షన్లు నమోదు చేయకుండా కేసును బలహీనపరిచే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.

"బేటీ బచావో -- బేటీ పడావో" అంటూ పెద్ద పెద్ద మాటలు చెప్పే బీజేపీ నాయకులు, ఇప్పుడు బాలికల రక్షణ విషయంలో ఎందుకు మౌనం పాటిస్తున్నారని ప్రశ్నించారు. దేశం కోసం, ధర్మం కోసం అంటూ ప్రజలను మోసం చేసే నాయకుల అసలు స్వరూపం బయటపడిందన్నారు. బండి సంజయ్ వెంటనే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని, లేకపోతే ప్రధాని నరేంద్ర మోదీ ఆయనను పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. నిందితుడిని కాపాడే ప్రయత్నాలు ఆపి, బాధిత బాలికకు న్యాయం జరిగేలా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్య, బిచ్చల తిరుమలరావు, మాజీ కార్పొరేటర్ మక్బుల్, జ్యోతి రెడ్డి, మేకల సుగుణరావు, షకీనా, ఎండీవై పాషా, కందాల వీరేందర్, సత్తార్ మియా, కోడి వీరబాబు, చిన్న నాగరాజు, ఉస్మాన్, బలుసు మురళీకృష్ణ, సతీష్, కోడిరెక్కల ఫ్రాన్సిస్, తీగల సతీష్ గౌడ్, పోలెపొంగు వెంకట్, పిట్టల తిరుమల్, మైబూబ్, జావిద్, రమేష్, ప్రవీణ్, దేవరకొండ నాగేశ్వరరావు, గుంటి రాజు, పిట్టల హరి, మిర్యాల రమేష్, సత్తి శివకృష్ణ, దోసపాటి మణికంఠ, ధారా విజయ్ కుమార్, సన్మంతరావు, వెంకట్ లాలు తదితరులు పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడి: ఏడుగురు వ్యక్తుల అరెస్ట్.



**యాలాల మండలం,12(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఞూ ఆదేశానుసారం జిల్లాలో అసాంఘిక కార్యకలాపాల పైన ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని టాస్క్ ఫోర్స్ ఇన్ స్పెక్టర్ షేక్ అన్వర్ పాషా తెలిపారు. ఈ క్రమంలో యాలాల పోలీస్ స్టేషన్ పరిధిలోని పగిడ్యాల్ గ్రామ శివారులో బహిరంగ ప్రదేశంలో కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారం అందడంతో, టాస్క్ ఫోర్స్ బృందం మెరుపు దాడి నిర్వహించింది.ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.వీరి వద్ద నుండి జూదానికి ఉపయోగిస్తున్న రూ. 65,610/- (అరవై ఐదు వేల ఆరు వందల పది రూపాయలు) నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్న నగదుతో పాటు పట్టుబడిన ఏడుగురు నిందితులను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం యాలాల పోలీస్ స్టేషన్లో అప్పగించినట్లు ఇన్ స్పెక్టర్ అన్వర్ పాషా పేర్కొన్నారు.జిల్లాలో ఎక్కడైనా చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు, జూదం వంటివి నిర్వహిస్తే జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఞూ ఆదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

# రైల్వే చీఫ్ ఇంజనీర్ ను కలిసిన జలమండలి అధికారులు



**.సికింద్రాబాద్ మే12( సమయం న్యూస్) :** మల్కాజ్గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు రైల్వే చీఫ్ ఇంజనీర్ సదర్మ రాయల్, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ గణేషన్ ను హెచ్ఎం డబ్ల్యూఎస్ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా గౌతమ్ నగర్ లెవెల్ క్రాసింగ్ వద్ద 42 కోట్లతో నిర్మించనున్న ఆర్యుబి నిర్మాణం కోసం రాను స్టామ్ వాటర్ పైప్ లైన్ ఏర్పాటు, డ్రైనేజీ నిర్మాణం ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీజీఎం శ్రీనివాస్ రెడ్డి, జీ.ఎం. సునీల్ మేనేజర్ నవీన్, బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్ తదితరులున్నారు

# నీట్ పేపర్ లీక్పై కేంద్రంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు


**హైదరాబాద్, మే 12( సమయం న్యూస్).**

నీట్ ప్రశ్నాపత్రం లీకై పరీక్షనే రద్దు చేయాల్సిన పరిస్థితి రావడం కేంద్ర ప్రభుత్వానికి సిగ్గుచేటని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఖ. ౧. ఞఖ ఞఖ విమర్శించారు. పగలు రాత్రి కష్టపడి చదివిన విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటమాడిందన్నారు.

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడంలో ఎన్డీఏ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, 2024లో జరిగిన నీట్ పేపర్ లీక్ ఘటన నుంచి గుణ-పాఠం నేర్చుకోకపోవడం వల్లే మరోసారి ఇదే పరిస్థితి తలెత్తిందని ఆరోపించారు.వందకు పైగా ప్రశ్నలు పరీక్షకు ముందు రోజే లీక్ కావడం వ్యవస్థలో ఉన్న తీవ్రమైన లోపాలను బయటపెట్టిందన్నారు. దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష రాసిన సుమారు 23 లక్షల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులను కేంద్ర ప్రభుత్వం తీవ్ర మానసిక ఆందోళనకు గురిచేసిందని పేర్కొన్నారు. పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్రం వెంటనే ఉన్నతస్థాయి దర్యాప్తు జరిపించాలని, ఇందులో ఎంత పెద్దవాళ్లు ఉన్నా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సాధ్యమైనంత త్వరగా పారదర్శకంగా మళ్లీ నీట్ పరీక్ష నిర్వహించాలని కోరారు.నీట్ పేపర్ లీక్ ఘటనకు పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర ప్రభుత్వం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు క్షమాపణలు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# పశువుల అక్రమ రవాణాపై కఠిన నిఘా

జిల్లా కలెక్టర్




**నిజామాబాద్, మే 12:( సమయం న్యూస్)** పశువుల అక్రమ రవాణా, గోవధ నిషేధ చట్ట ఉల్లంఘనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి, సీపీ పి. సాయి చైతన్య అధికారులను ఆదేశించారు.జిల్లాలో అంతర్రాష్ట్ర, అంతర్జిల్లా చెక్పోస్టుల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా పశువులను తరలిస్తే వెంటనే సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.పశువులను స్లాటర్ హౌస్లలోనే వధించాలని, బహిరంగ ప్రదేశాల్లో వధించరాదని స్పష్టం చేశారు. బక్రీద్ వేడుకలు శాంతియుత వాతావరణంలో జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు ఆదేశించారు.



# యూరప్ క్రికెట్‌లో ద్రవిడ్ కొత్త ప్రయాణం

**డబ్లిన్, మే 12 :** భారత క్రికెట్ దిగ్గజం రాహుల్ ద్రవిడ్ యూరప్ క్రికెట్ రంగంలోకి అడుగుపెట్టారు. యూరప్ ఇరవై ఓవర్ల ప్రీమియర్ లీగ్‌లో భాగంగా "డబ్లిన్ గార్డియన్స్" జట్టును ఆయన సొంతం చేసుకున్నారు. యూరప్‌లో క్రికెట్‌ను మరింత అభివృద్ధి చేయడం, యువ ఆటగాళ్లకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతోనే ఈ ప్రాజెక్టులో భాగమైనట్లు ద్రవిడ్ తెలిపారు. ఈ పరిణామం యూరప్ క్రికెట్ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. డబ్లిన్ గార్డియన్స్ జట్టుకు భారత స్టార్ ఆల్‌రౌండర్ రవిచంద్రన్ అశ్విన్ సారథ్యం వహించనున్నారు. అశ్విన్ అనుభవం జట్టుకు బలంగా మారుతుందని యాజమాన్యం భావిస్తోంది. ఈ లీగ్‌లో డబ్లిన్ జట్టు బెల్ఫాస్ట్, ఎడిన్‌బరో, గ్లాస్గో, రోటర్‌డామ్, ఆమ్‌స్టర్‌డామ్ జట్లతో తలపడనుంది. ప్రారంభ కార్యక్రమంలో పలువురు మాజీ క్రికెట్ దిగ్గజాలు పాల్గొని సందడి చేశారు. గ్లాస్గో జట్టు తరఫున విపుల్ అగర్వాల్, రోటర్‌డామ్ ప్రతినిధులుగా జోంటీ రోడ్స్, మధుకర్ శ్రీ హాజరయ్యారు. అలాగే లీగ్ సహ వ్యవస్థాపకులు అభిషేక్ బచ్చన్, సౌరవ్ బానర్జీ, ప్రియాంక కౌల్, ధీరజ్ మల్హోత్రా కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు. ఐర్లాండ్ క్రికెట్ బోర్డు, స్కాట్లాండ్ క్రికెట్ బోర్డు, నెదర్లాండ్స్ క్రికెట్ సంఘం సంయుక్త భాగస్వామ్యంతో ఈ లీగ్ నిర్వహించబడుతోంది. ఇందులో ప్రపంచ స్థాయి ఇరవై ఓవర్ల క్రికెటర్లు పాల్గొననున్నారు. ఆగస్టు 26న ప్రారంభమయ్యే ఈ టోర్నీ సెప్టెంబర్ 20 వరకు కొనసాగనుంది. యూరప్‌లో క్రికెట్‌కు మరింత ఆదరణ తీసుకురావడమే ఈ లీగ్ ప్రధాన లక్ష్యంగా నిర్వాహకులు చెబుతున్నారు. ఈ లీగ్‌లోని జట్ల యాజమాన్యాల్లో కూడా పలువురు అంతర్జాతీయ క్రికెట్ ప్రముఖులు భాగస్వాములయ్యారు. బెల్ఫాస్ట్ జట్టుతో గ్లెన్ మాక్స్‌వెల్, రోహన్ లండ్ అనుబంధముండగా, ఎడిన్‌బరో జట్టులో కైల్ మిల్స్, నాథన్ మెక్‌కల్లమ్, రాచెల్ వైస్‌మాన్ ఉన్నారు. గ్లాస్గో జట్టుతో క్రిస్ గేల్ అనుబంధం కలిగి ఉన్నారు. ఆమ్‌స్టర్‌డామ్ జట్టుతో స్టీవ్ వా, జేమీ డ్వైర్, టిమ్ థామస్ పనిచేస్తుండగా, రోటర్‌డామ్ జట్టుతో జోంటీ రోడ్స్, ఫాఫ్ డు ప్లెసిస్, సమీర్ షా తదితరులు భాగస్వాములయ్యారు.



# అక్షర్‌కు భారీ జరిమానా

**ధర్మశాల, మే 12 :** ధర్మశాల వేదికగా పంజాబ్ జట్టుతో జరిగిన ఉత్కంఠభరిత పోరులో ఢిల్లీ జట్టు అద్భుత విజయం సాధించింది. అయితే మ్యాచ్ అనంతరం ఢిల్లీ కెప్టెన్ అక్షర్ పటేల్‌కు భారీ షాక్ తగిలింది. నిర్ణీత సమయంలోగా ఓవర్లు పూర్తి చేయకపోవడంతో నెమ్మదైన ఓవర్ల వేగం కారణంగా అతనిపై రూ.12 లక్షల జరిమానా విధించారు. ఈ సీజన్‌లో ఢిల్లీ జట్టుకు ఇది తొలి తప్పిదం కావడంతో కనీస జరిమానాతోనే సరిపెట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ముందుగా బ్యాటింగ్ చేసిన పంజాబ్ జట్టు భారీ స్కోరు నమోదు చేసింది. ప్రియాన్ష్ ఆర్య, శ్రేయస్ అయ్యర్, సూర్యాన్ష్ షెడ్గే దూకుడుగా ఆడటంతో 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 210 పరుగులు చేసింది. ఢిల్లీ బౌలర్లపై పంజాబ్ బ్యాటర్లు ఆరంభం నుంచే దాడి చేస్తూ స్టేడియం నలుమూలలా బౌండరీలు బాదారు. 211 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ జట్టుకు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కేవలం 33 పరుగులకే మూడు కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ సమయంలో కెప్టెన్ అక్షర్ పటేల్ బాధ్యతాయుతంగా ఆడి 30 బంతుల్లో 56 పరుగులు చేశాడు. అతనికి డేవిడ్ మిల్లర్ అద్భుత సహకారం అందిస్తూ 51 పరుగులు నమోదు చేశాడు. వీరిద్దరి భాగస్వామ్యం జట్టును తిరిగి పోటీలోకి తీసుకొచ్చింది. చివర్లో మాధవ్ తివారీ, అశుతోష్ శర్మ వేగంగా పరుగులు సాధించడంతో ఢిల్లీ జట్టు 19 ఓవర్లలోనే 216 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. ఈ విజయంతో ఢిల్లీ జట్టు ప్లేఆఫ్ అవకాశాలను సజీవంగా ఉంచుకోగా, పంజాబ్ జట్టు నాలుగో స్థానంలో కొనసాగుతోంది.

# సన్‌రైజర్స్ పరాజయం!

## సాయి సుదర్శన్, సుందర్ అద్భుత అర్ధశతకాలు.. గుజరాత్ భారీ స్కోరు

## 82 పరుగుల తేడాతో చిత్తయిన హైదరాబాద్.. పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి టైటాన్స్





**అహ్మదాబాద్ :** ఐపీఎల్ లో భాగంగా నరేంద్ర మోడీ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్ లో సన్ రైజర్స్ హైదరాబాద్ (ఎస్ ఆర్ హెచ్) పై గుజరాత్ టైటాన్స్ (జీ టీ) అద్భుత విజయం సాధించింది. ఆల్రౌండ్ షోతో అదరగొట్టిన గుజరాత్ 82 పరుగుల భారీ తేడాతో హైదరాబాద్ ను చిత్తు చేసింది. ఈ విజయంతో గుజరాత్ టైటాన్స్ పాయింట్ల పట్టికలో 16 పాయింట్లతో అగ్రస్థానానికి (టేబుల్ టాపర్) దూసుకెళ్లగా.. పరాజయంతో సన్ రైజర్స్ హైదరాబాద్ 14 పాయింట్లతో మూడో స్థానానికి పడిపోయింది. తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 168 పరుగులు సాధించింది. అనంతరం లక్ష్యఛేదనలో తడబడిన హైదరాబాద్ 14.5 ఓవర్లలో కేవలం 86 పరుగులకే కుప్పకూలి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. గుజరాత్ బ్యాటర్లలో సాయి సుదర్శన్, వాషింగ్టన్ సుందర్ లు అద్భుత అర్ధశతకాలతో కదంతొక్కగా.. బౌలింగ్ లో సకిబ్ హుస్సేన్, ప్రఫుల్ హింగే తలో 2 వికెట్లు తీసి విజయంలో కీలకపాత్ర పోషించారు.

### సుదర్శన్, సుందర్ల జోరు..


టాస్ గెలిచిన సన్ రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో మొదట బ్యాటింగ్ కు దిగిన గుజరాత్ టైటాన్స్ కు ఆరంభంలోనే సన్ రైజర్స్ బౌలర్లు సవాలు విసిరారు. అయితే క్రీజులోకి వచ్చిన యువ కెరటం సాయి సుదర్శన్ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా ఎక్కడా తొణకకుండా స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. సన్ రైజర్స్ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ 44 బంతుల్లోనే 61 పరుగులు సాధించి ఇన్నింగ్స్ కు వెన్నెముకలా నిలిచాడు. అతనికి తోడుగా క్రీజులోకి వచ్చిన ఆల్ రౌండర్ వాషింగ్టన్ సుందర్ సైతం అద్భుతమైన షాట్లతో అలరించాడు. కేవలం 33 బంతుల్లోనే 50 పరుగులు సాధించి సాయి సుదర్శన్ కు చక్కటి సహకారం అందించాడు. చివర్లో నిశాంత్ సింధు కేవలం 14 బంతుల్లోనే 22 పరుగులు బాదడంతో గుజరాత్ టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 168 పరుగుల గౌరవప్రదమైన స్కోరు సాధించింది. సన్ రైజర్స్ బౌలర్లలో కాగిసో రబాడ 28 పరుగులిచ్చి 3 వికెట్లు, జేసన్ హోల్డర్ 20 పరుగులిచ్చి 3 వికెట్లు, ప్రసిద్ధ్ కృష్ణ 23 పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టి గుజరాత్ ను కట్టడి చేసే ప్రయత్నం చేశారు.

### కుప్పకూలిన సన్ రైజర్స్..

169 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సన్ రైజర్స్ హైదరాబాద్ కు ఆరంభం నుంచే గుజరాత్ బౌలర్లు చుక్కలు చూపించారు. కట్టుదిట్టమైన బౌలింగ్ తో సన్ రైజర్స్ బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టారు. దీంతో హైదరాబాద్ ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. వరుస విరామాల్లో వికెట్లు కోల్పోతూ పీకల్లోతు కష్టాల్లో పడింది. కెప్టెన్ పాట్ కమిన్స్ 9 బంతుల్లో 19 పరుగులు, సలిల్ అరోరా 13 బంతుల్లో 16 పరుగులు, విధ్వంసక బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ 16 బంతుల్లో 14 పరుగులు చేసి నిరాశపరిచారు. మిగతా బ్యాటర్లు సైతం క్రీజులో నిలవలేకపోవడంతో సన్ రైజర్స్ ఇన్నింగ్స్ పేకమేడలా కూలిపోయింది. కేవలం 14.5 ఓవర్లలోనే 86 పరుగులకు ఆలౌట్ అయి భారీ పరాజయాన్ని చవిచూసింది. గుజరాత్ బౌలర్లలో సకిబ్ హుస్సేన్ 37 పరుగులిచ్చి 2 వికెట్లు, ప్రఫుల్ హింగే 17 పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టి హైదరాబాద్ పతనాన్ని శాసించారు. పాట్ కమిన్స్ 20 పరుగులిచ్చి 1 వికెట్ తీశాడు.

### పట్టికలో అగ్రస్థానానికి గుజరాత్..

ఈ అద్భుత విజయంతో గుజరాత్ టైటాన్స్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన్ని ఆక్రమించింది. మొత్తం 12 మ్యాచ్ లు ఆడిన గుజరాత్ 8 విజయాలు, 4 పరాజయాలతో 16 పాయింట్లు సాధించి టేబుల్ టాపర్ గా నిలిచింది. రన్ రేట్ సైతం ప్లస్ 0.551 కు పెరిగింది. మరోవైపు ఈ మ్యాచ్ కు ముందు వరకు మెరుగైన స్థితిలో ఉన్న సన్ రైజర్స్ హైదరాబాద్ ఈ ఘోర పరాజయంతో పట్టికలో మూడో స్థానానికి పడిపోయింది. మొత్తం 12 మ్యాచ్ ల్లో 7 విజయాలు, 5 పరాజయాలతో 14 పాయింట్లు ఖాతాలో వేసుకుంది. రెండో స్థానంలో ఉన్న ఆర్ సీ బీ సైతం 14 పాయింట్లతోనే ఉన్నప్పటికీ.. రన్ రేట్ (ప్లస్ 1.103) మెరుగ్గా ఉండటంతో సన్ రైజర్స్ (ప్లస్ 0.331) మూడో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. వరుస విజయాలతో దూసుకుపోతున్న గుజరాత్ ఈ మ్యాచ్ లోనూ అదే జోరు కొనసాగించి ప్లే ఆఫ్స్ అవకాశాలను మరింత మెరుగుపరుచుకుంది.



# తెలంగాణ క్రికెట్‌కు కొత్త ఊపు

**హైదరాబాద్, మే 12:** తెలంగాణ యువ క్రికెటర్లకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రీమియర్ లీగ్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహి స్తున్నట్లు మాజీ క్రికెటర్ అంబటి రాయుడు తెలిపారు. హైదరాబాద్ ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో నిర్వహించిన సమావేశంలో హైదరాబాద్ క్రికెట్ సంఘం కార్యదర్శి మన్నె జీవన్ రెడ్డి, కార్యనిర్వహణ విభాగాధిపతి ఇంతియాజ్ అలీ కలిసి లీగ్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. వచ్చే నెలలో జరగనున్న తెలంగాణ ప్రీమియర్ లీగ్ కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు మూడు వేల మంది ప్రతిభావంతులైన ఆటగాళ్లను గుర్తించి ఎంపిక చేయను న్నట్లు నిర్వాహకులు తెలిపారు. యువ క్రికెటర్లకు సరైన వేదిక కల్పించడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. హైదరాబాద్ క్రికెట్ సంఘం కార్యదర్శి మన్నె జీవన్ రెడ్డి మాట్లాడుతూ, ఎలాంటి రాజకీయ ప్రభావం లేకుండా పూర్తిగా పారదర్శక విధానంలో పది మంది మాజీ క్రికెటర్లతో ఎంపిక కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడిం చారు. ఎంపిక ప్రక్రియలో అవకతవకలకు తావులేకుం డా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నిజమైన ప్రతిభ కలిగిన ఆటగాళ్లను గుర్తించేందుకు కృత్రిమ మేధస్సు సాంకేతికతను వినియోగిస్తున్నామని చెప్పారు. ప్రతి ఎంపిక ప్రక్రియను దృశ్యరూపంలో నమోదు చేయడంతో పాటు భౌతిక రికార్డులను కూడా భద్రపరుస్తామని వెల్లడించారు. యువ ఆటగాళ్లకు అవకాశాలు కల్పించడంలో భారత ప్రీమియర్ లీగ్ కీలక పాత్ర పోషించిందని, అదే తరహాలో హైదరాబాద్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో కూడా పారదర్శకంగా లీగ్‌లు నిర్వహిస్తామని అంబటి రాయుడు తెలిపారు. బహిరంగ ఎంపిక పరీక్షలు, లీగ్ పోటీల నిర్వహణను మరింత విస్తృతంగా చేపడుతున్నామని, ప్రతి నిర్ణయం నిష్పక్షపాతంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. సీనియర్ ఎంపిక కమిటీకి అక్షాంత్ రెడ్డి అధ్యక్షుడిగా వ్యవహరించనుండగా, సుమన్, మెహది హసన్, పవన్ కుమార్, ఇందర్ శేఖర్ రెడ్డి సభ్యులుగా ఉన్నారు. జూనియర్ ఎంపిక కమిటీకి ఆకాశ్ బండారి అధ్యక్షుడిగా, రమేష్ కుమార్, షోయబ్, సర్వేష్ కుమార్, తిమోతి కుమార్ సభ్యులుగా బాధ్యతలు నిర్వహించనున్నారు.






13-05-26 Samayam_Layout 1 5/13/2026 5:21 AM Page 12





# కమల్-రజనీ మూవీలో త్రిష

తమిళనాడులో ఎన్నికల సందడి మొదలు.. గత కొన్ని రోజులుగా త్రిష పేరు మార్మోగిపోతోంది. ముఖ్యమంత్రిగా తమిళ సూపర్‌స్టార్ విజయ్ ప్రమాణ స్వీకారోత్సవంలోనూ త్రిష ప్రధాన ఆకర్షణగా నిలిచారు. తమిళనాడు రాజకీయాల్లోకి ఆమె కూడా ప్రవేశిస్తారన్న ప్రచారం సామాజిక మాధ్యమాల్లో మొదలైంది. అయితే ఆమె వరుస సినిమాలతో సందడి చేయబోతోంది. మరోవైపు కొత్త ప్రాజెక్టుల విషయంలోనూ ఆమె పేరు బలంగా వినిపిస్తోంది. రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి చేయనున్న సినిమాలోనూ త్రిష కథానాయికగా నటించనున్నట్టు సమాచారం. నాలుగున్నర దశాబ్దాల తర్వాత రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆ సినిమాలోనే త్రిష ఓ కథానాయికగా నటించనున్నట్టు తెలుస్తోంది. అదే నిజమైతే ఈ కలయిక మరింత ప్రత్యేకం కానుంది. దీనిపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన అనంతరం ఇన్‌స్టాలో ఓ పోస్ట్‌ని పంచుకున్నారు త్రిష. ప్రేమ ఎప్పుడూ గట్టిగానే వినిపిస్తుంది... అనే వ్యాఖ్యని జోడిస్తూ, తన ముస్తాబు వెనకున్న తన బృందానికి కృతజ్ఞతలు చెప్పింది.

# మీనాక్షికి వరుస అవకాశాలు



**హైదరాబాద్, మే 12:** తెలుగు సినీ పరిశ్రమలో కథానాయికల ప్రయాణం ఎప్పుడు ఎలా మారుతుందో చెప్పడం కష్టం. ఒక విజయం వస్తే అవకాశాలు వరుసగా వస్తుంటాయి. అయితే ఒకే నిర్మాణ సంస్థలో వరుసగా అవకాశాలు దక్కడం మాత్రం చాలా అరుదుగా జరుగుతుంది. ప్రస్తుతం టాలీవుడ్‌లో ఈ అరుదైన గుర్తింపును అందుకుంటోంది నటి మీనాక్షి చౌదరి. హారిక హాసిని, సితార సంస్థలకు ఆమె ఇప్పుడు అత్యంత నమ్మకమైన కథానాయికగా మారినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. మీనాక్షి చౌదరి ప్రయాణం సితార సంస్థతో ప్రత్యేకంగా కొనసాగుతోంది. ఇప్పటికే ఈ సంస్థ నిర్మించిన చిత్రాల్లో దుల్కర్ సల్మాన్ సరసన 'లక్కీ భాస్కర్', నవీన్ పోలిశెట్టి జోడీగా 'అనగనగా ఒక రాజు' చిత్రాల్లో నటించింది. అలాగే హారిక హాసిని నిర్మాణంలో మహేష్ బాబు హీరోగా వచ్చిన 'గుంటూరు కారం' చిత్రంలో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. సాధారణంగా ఒక సినిమాలో నటించిన తర్వాత కథానాయికలు ఇతర నిర్మాణ సంస్థలకు వెళ్లడం సహజం. కానీ మీనాక్షి విషయంలో మాత్రం నిర్మాత నాగవంశీ బృందం పూర్తి నమ్మకంతో వరుస అవకాశాలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే ఆమెకు వరుసగా చిత్రాలు ఆఫర్ చేస్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం, సితార సంస్థలో మీనాక్షి తన ఐదో చిత్రాన్ని కూడా ఖరారు చేసుకున్నట్లు తెలుస్తోంది. తమిళ స్టార్ హీరో అ కార్తీ, దర్శకుడు కళ్యాణ్ శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ చిత్రంలో మీనాక్షిని కథానాయికగా ఎంపిక చేసినట్లు సమాచారం. 'మ్యాడ్', 'మ్యాడ్ స్క్వేర్' చిత్రాలతో సితార సంస్థకు విజయాలు అందించిన కళ్యాణ్ శంకర్, ఇప్పుడు మరో వినోదాత్మక చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల ఈ సినిమా పూజా కార్యక్రమాలు హైదరాబాద్‌లో నిశ్శబ్దంగా జరిగినట్లు సమాచారం. కేవలం వెండితెరపైనే కాకుండా డిజిటల్ వేదికలపై కూడా మీనాక్షి దూసుకుపోతోంది. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా సితార సంస్థ నిర్మిస్తున్న ఒక వెబ్ ధారావాహికలో కూడా ఆమె నటిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఒకే నిర్మాణ సంస్థలో ఐదు ప్రాజెక్టులు దక్కడం అంటే ఆ సంస్థకు ఆమె ఎంత అదృష్టకరమైన కథానాయికగా మారిందో అర్థమవుతోందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఆమె చేతిలో కార్తీ సినిమా తో పాటు నాగచైతన్య నటిస్తున్న 'వృషకర్మ', అలాగే హిందీలో 'భాగమ్ భాగ్ 2' వంటి భారీ చిత్రాలు ఉన్నాయి. అందం మాత్రమే కాకుండా నటనలోనూ మంచి గుర్తింపు తెచ్చుకుంటున్న ఈ హర్యానా భామ, రాబోయే రోజుల్లో టాలీవుడ్ అగ్ర కథానాయికల జాబితాలో చోటు దక్కించుకోవడం ఖాయం వంనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



# విడాకుల జాబితాలో మరో నటి



నటి మౌనీరాయ్ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఒక వార్త కొన్ని రోజులుగా నెట్టింట వైరల్ అవుతోంది. భర్త సూరజ్ నంబియార్‌తో ఆమె విడిపోతున్నట్లు నెట్టింట ప్రచారం జరుగుతోంది. తాజాగా ఈ వార్తలకు బలం చేకూర్చేలా ఇన్‌స్టాగ్రామ్‌లో వీరిద్దరూ ఒకరికొకరు అన్‌ఫాలో చేసుకున్నారు. ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే మౌనీ రాయ్ తనకు సంబంధించిన విషయాలను పంచుకుంటూ టూర్స్ ఫొటోలను షేర్ చేస్తుంటారు. కొన్ని రోజులుగా భర్తతో ఉన్న ఫొటోలు పోస్ట్ చేయలేదు. మరోవైపు సూరజ్ నంబియార్ ఇన్‌స్టాలో పెళ్లి ఫొటోలు కూడా కనిపించడం లేదు. అలాగే రూమర్స్‌ను ఇద్దరూ ఖండించకపోవడంతో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. 2022 జనవరిలో తన ప్రియుడు సూరజ్ నంబియార్‌ను మౌనీరాయ్ గోవాలో వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. సినిమాల విషయానికొస్తే.. మౌనీరాయ్ 'విశ్వంభర'లో ఓ స్పెషల్ సాంగ్ చేసినట్లు సమాచారం. చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. చిరంజీవి సూపర్ హిట్ సినిమా 'ఖైదీ'లోని రగులుతోంది మొగలిపొద.. పాట రీమేక్‌కు మౌనీరాయ్‌తో కలిసి చిరు మరోసారి మెస్మరైజ్ చేయనున్నట్లు తెలుస్తోంది.

# నెటిజన్‌కు సీరత్ ఘాటు సమాధానం


**హైదరాబాద్, మే 12:** అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా నటి సీరత్ కపూర్ ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ కొన్ని ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. అల్లు అర్జున్‌తో కలిసి ప్రైవేట్ విమానం వద్ద దిగిన ఈ చిత్రాలు అభిమానులను ఆకట్టుకున్నాయి. అయితే ఈ ఫొటోలపై స్పందించిన ఓ నెటిజన్ అత్యుత్సాహం ప్రదర్శిస్తూ సీరత్‌పై అగౌరవకర వ్యాఖ్య చేశాడు. "నువ్వు అల్లు అర్జున్ ఆస్తి" అంటూ చేసిన ఈ వ్యాఖ్య సామాజిక మాధ్యమాల్లో చర్చకు దారితీసింది. ఒక నటిని వస్తువుతో పోలుస్తూ చేసిన ఈ వ్యాఖ్యపై సీరత్ కపూర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సదరు నెటిజన్‌కు ఏమాత్రం తగ్గకుండా గట్టిగా సమాధానం ఇచ్చారు. "ముందు మర్యాదగా మాట్లాడటం నేర్చుకోండి" అంటూ ఆమె తన స్పందనను ప్రారంభించారు. మహిళల ఉనికిని తక్కువ చేసి చూసే ధోరణిని ఆమె తీవ్రంగా తప్పుబట్టారు. "ఒక స్త్రీ ఎప్పటికీ ఎవరి ఆస్తి కాదు. ఆమెకు తనదైన గుర్తింపు, సొంత ఆలోచనలు, కలలు ఉంటాయి" అంటూ సీరత్ స్పష్టం చేశారు. మహిళలను ఎవరి ఆధీనంలో ఉండే వస్తువుల్లా చూడటం మానుకోవాలని, సమాజంలో వారికి ఉన్న ప్రత్యేక వ్యక్తిత్వాన్ని గౌరవించాలని హితవు పలికారు. సీరత్ కపూర్ ఇచ్చిన ఈ సమాధానానికి సామాజిక మాధ్యమాల్లో విశేష స్పందన లభిస్తోంది. కేవలం సినీ ప్రముఖులే కాకుండా, సామాన్య మహిళలు కూడా ఆమె వ్యాఖ్యలను సమర్థిస్తున్నారు. భావ ప్రకటన స్వేచ్ఛ పేరుతో ఎదుటివారిని, ముఖ్యంగా మహిళలను కించపరిచే హక్కు ఎవరికీ లేదని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. ఇంటర్నెట్ వేదికగా ట్రోలింగ్ చేసే వారికి సీరత్ స్పందన ఒక గట్టి హెచ్చరికలా నిలిచిందని పలువురు కామెంట్లు చేస్తున్నారు. ఆమె చూపిన ధైర్యసాహసాలపై సినీ వర్గాల నుంచి కూడా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# కష్టాలపై అంజలి పోరాటం



**హైదరాబాద్, మే 12:** అందాల భామ అంజలి వరుస సినిమాలతో దూసుకుపోతున్నారు. ఇప్పటికే యాభైకి పైగా చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆమె, ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన సినీ ప్రయాణం, వ్యక్తిగత జీవితంలో ఎదురైన కష్టాల గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. 'గీతాంజలి' సినిమా గురించి మాట్లాడుతూ, భయానక కథాంశంతో పాటు కథానాయిక ప్రాధాన్య పాత్రలో నటించడం తనకు ప్రత్యేక అనుభవమని అంజలి తెలిపారు. జీవితంలో ఎదురైన ప్రతి సంఘటనను తాను సానుకూలంగానే స్వీకరిస్తానని, జరిగేదంతా మంచికేనని నమ్ముతానని చెప్పారు. తన నేపథ్యం గురించి మాట్లాడిన అంజలి, తాను రాజోలులో పుట్టి అక్కడే పాఠశాల విద్య పూర్తిచేశానని తెలిపారు. అనంతరం చెన్నై, హైదరాబాద్ నగరాల్లో గడిపిన ఆమె, నటనపై ఆసక్తితో సినీ రంగంలోకి అడుగుపెట్టినట్లు చెప్పారు. మోడలింగ్ ప్రారంభించిన కొద్ది నెలల్లోనే తమిళం, తెలుగులో అవకాశాలు రావడంతో పెద్దగా కష్టపడాల్సిన అవసరం రాలేదని వెల్లడించారు. కెరీర్ ప్రారంభంలో 'జర్నీ' చిత్రం ద్వారా గుర్తింపు వచ్చిందని, తర్వాత 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' సినిమాతో తెలుగులో తన నటనను నిరూపించుకోగలిగానని అంజలి పేర్కొన్నారు. అయితే కెరీర్ సాఫీగా సాగుతున్న సమయంలో కొన్ని వ్యక్తిగత, ఆర్థిక సమస్యలు ఎదురయ్యాయని తెలిపారు. కుటుంబ సభ్యులు, దర్శకుడు కలంజియంతో సహా కొందరి స్వార్థపూరిత చర్యల వల్ల తాను ఆర్థిక మోసాలకు గురయ్యానని అంజలి ఆరోపించారు. ప్రస్తుతం ఈ వ్యవహారం న్యాయస్థానంలో విచారణలో ఉందని స్పష్టం చేశారు. ఈ పరిస్థితుల కారణంగా మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురైన తాను, స్వచ్ఛందంగానే సినీ పరిశ్రమకు కొంతకాలం దూరంగా ఉన్నట్లు తెలిపారు. ఈ విరామాన్ని చాలామంది తాను కనిపించకుండా పోయానని భావించారని, కానీ తాను ఎక్కడికీ పారిపోలేదని అంజలి స్పష్టం చేశారు. తన స్నేహితులు, సన్నిహితులకు తాను ఎక్కడ ఉన్నానో తెలుసని చెప్పారు. 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' విజయం తర్వాత వచ్చిన గుర్తింపును తాను ఆస్వాదించానని, కానీ ఆ తర్వాత వచ్చిన సమస్యలు జీవితాన్ని కఠినంగా మార్చాయని తెలిపారు. అయితే కష్టాలను అధిగమించి మళ్లీ కెరీర్‌పై దృష్టి పెట్టడం తనకు గొప్ప విజయంగా భావిస్తున్నట్లు అంజలి పేర్కొన్నారు. సినీ పరిశ్రమలో తనకు ప్రత్యేకంగా ఎలాంటి అండదండలు లేకపోయినా, మంచి స్నేహితుల వర్గం ఎప్పుడూ తనకు తోడుగా నిలిచిందని చెప్పారు. ఎదురైన అన్ని సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని, పూర్తి ఆత్మవిశ్వాసంతో తన సినీ ప్రయాణాన్ని మళ్లీ నిర్మించుకుంటున్నట్లు అంజలి వెల్లడించారు.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNIVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **7036644111, 9490140565**




# పలు ప్రత్యేకతల సమాహారం 'గైడ్' చిత్రరాజం

## నేడు ఆర్‌కే నారాయణ్ వర్ధంతి

హిందీ చలన చిత్ర రంగంలో తనదయిన ముద్ర వేసుకున్న అలనాటి మేటి చిత్ర రాజం గైడ్. ప్రఖ్యాత ఆంగ్ల భారత రచయిత మాల్గుడి డేస్ సృష్టి కర్త అర్. కె. నారాయణ్ అద్భుత రచన గైడ్. ఈ చిత్రం పలు విశేషాల సమాహారం. అయితే.. దేవానంద్ నటించిన "హం దొనో", చిత్రం 1962 బెర్లిన్ చలన చిత్రోత్సవానికి, భారత దేశ అధికారిక చిత్రంగా ఎంపికకాగా, బెర్లిన్లో దేవానంద్ అమెరికా దర్శకుడు టాడ్ డేనియల్ ను కలిసే అవకాశం కలగడం, టాడ్, పెర్ల్ ఎస్ బక్ ఆహ్వానం పై అమెరికా వెళ్లి వారితో ఒప్పందం కుదుర్చుకుని, గైడ్ చిత్రంలో నటించటానికి అంగీకరించడం యాదృచ్ఛికంగా జరిగాయి. గైడ్ చిత్రానికి ఆంగ్ల చిత్రానికి టాడ్ చిత్రానువాదం నోబెల్ సాహిత్య బహుమతి గ్రహీత పెర్ల్ ఎస్ బక్ చేశాడు. స్ట్రాట్టన్ ఇంటర్నేషనల్ పతాకం కింద, టాడ్ డేనియల్ నిర్మాత, దర్శకత్వ బాధ్యతలు నిర్వహించాడు. ఒకే సారి ఆంగ్ల, హిందీ చిత్రాల చిత్రీకరణ సాంకేతిక కారణాలవలన సాధ్యం కాకపోవటంతో, తొలుత ఆంగ్ల చిత్రాన్ని చిత్రీకరించారు. ఈ కారణంగా హిందీ చిత్రం ఆలస్యం వలన అప్పటి దాక దర్శకత్వం వహించిన చేతన్ ఆనంద్, తన సొంత చిత్రం హకీకత్ నిర్వహణ బాధ్యతను నిర్వహించటానికై, గైడ్ దర్శకత్వ బాధ్యత నుంచి తప్పుకున్నాడు. విజయ ఆనంద్ గైడ్ దర్శకత్వం స్వీకరించాడు. తొలుత ఆంగ్ల చిత్రాన్ని చిత్రీకరించారు. అది విడుదల కాగా, చిత్రానువాదం ఆశించిన స్థాయిలో లేక, ఆంగ్ల ప్రేక్షకులను చిత్రం ఆకట్టుకో వడంలో విఫలమయింది.

చిత్రంలో నాయకుడు ఒక వివాహితతో అక్రమ సంబంధం ఏర్పరచుకొని, ఆమెను మోసం చేసి జైల్ కు వెళ్తాడు. చివరకు ఒక సాధువుగా మారి, ఎడారిలో నిరాహార దీక్ష చేసి మరణిస్తాడు. ఎప్పుడూ అందంగా కనిపించే దేవ్ చిత్రంలో అందవిహీనంగా కనిపించటాన్ని విమర్శలకు హేతు వైంది. నాయకుడు వివాహేతర సంబంధం పెట్టుకోవడం భారతీయ చిత్రాలకు అనుగుణంగా ఉండ లేక పోయింది. చిత్రం కొనటానికి పంపిణీదారులెవరూ ముందుకు రాలేదు. హిందీలో ఆనంద్ గైడ్ దర్శకత్వ బాధ్యత స్వీకరించి, ఆంగ్ల చిత్రానువాదం కాకుండా, భారతీయ ప్రేక్షకులకు నచ్చే విధంగా కొత్త చిత్రానువాదం తయారు చేశాడు. గైడ్ చిత్రాన్ని హిందీలో తీద్దామని అనుకుని వహీదా రెహమాన్ ను నాయికగా ఉండాలని ముందు సత్యజిత్ రే, అనంతరం దేవానంద్ కోరారట. అయితే చిత్రం చిత్రీకరణ హక్కులను దేవానంద్ రచయిత ఆర్కె నారాయణ్ నుంచి ముందు పొందారు. అలా దేవానంద్, వహీదా కాంబినేషన్లో రూపు దిద్దుకున్న చిత్రం బాక్స్ ఆఫీస్ వద్ద విజయ దుందుభి మోగించింది. ఊహించని డబ్బును సమకూర్చింది. మనసును పూర్తిగా లగ్నం చేసి దర్శకత్వం వహించిన విజయ్ ఆనంద్ కృషి సఫలీకృతం కాగలిగింది. అచ్చంగా దేవానంద్, వహీదా రెహమాన్ ల నట జీవితంలో గైడ్ ఒక అణి ముత్యమే అయింది.

విజయానంద్ సందర్భోచిత చిత్రానువాదం, దర్శకత్వం, కథలో వైవిధ్యం, ఎస్.డి.బర్మన్ సంగీతం, వహీద నృత్యాలు, దేవానంద్ నటనా కౌశల్యం ప్రేక్షకుల మనో ఫల కాలపై చెరగని ముద్ర వేశాయి. ప్రేక్షకుల అనూహ్య ఆదరణ ద్వారా చిత్రం అనుకోని విధంగా కలెక్షన్లు సాధించింది. సంగీత దర్శకత్వం మినహా, మిగతా అన్ని శాఖలలోను ఫిల్మ్ ఫేర్ ఉత్తమ బహుమతులను 7 శాఖలలో గెల్చుకొని, అపూర్వ కళాఖండ చిత్రరాజమై నిలచింది. విదేశీ చిత్రాల కోవలో, ఆస్కార్ చిత్రోత్సవానికి భారత దేశ అధికార చిత్రంగా ఎంపికయ్యింది. టైమ్ మ్యాగజైన్ దాని ఉత్తమ బాలీవుడ్ క్లాసిక్స్ జాబితాలో 4 స్థానంలో ఉంది. విడుదలయిన 42 ఏళ్ల తర్వాత, 2007 లో కేన్స్ చిత్రోత్సవంలో ఈ చిత్రాన్ని ప్రదర్శించారు. సుదీర్ఘ సమయానంతరం దూరదర్శన్ లో ఈ చిత్రం ప్రదర్శిత మైనపుడు చాలా మంది ఇళ్లలో టీవీలకే అంకితం అయినారంటే ఎంత గొప్పగా తీసారో స్పష్టం అవుతుంది.

**"ఆజ్ ఫిర్ జీన్‌కి తమన్నా హై"**
**"దిన్ ఢల్ జాయే",**
**"గాతా రహే మేరా దిల్"**
**"క్యా సే క్యా హో గయా",**
**"పియా తోస్ నైనా లాగే రే"**
**"తేరే మేరే సాప్నే", "వహన్ కౌన్ హై తేరా", "హే రామ్ హమారే రామ్‌చంద్ర"**
**"అల్లాహ్ మేఘ్ దే పానీ దే" అన్ని పాటలూ ఆణిముత్యాలే.**

1965 డిసెంబర్ 6 న సినిమా విడుదల కాగా, అంతకు ముందు ఢిల్లిలో ఈ చిత్రం ప్రివ్యూ ప్రదర్శనకు , ప్రధాన మంత్రి మినహాయించి భారత ప్రభుత్వ మంత్రులంతా చిత్రాన్ని ఆసాంతం, ఆసక్తిగా చూశారు. డిస్ట్రిబ్యూటర్లు ఆసక్తి చూపక పోయినా, గైడ్ చిత్రం గురించి ముందే జరిగిన విస్తృత ప్రచారం వల్ల ప్రేక్షకులు మళ్ళీ మళ్ళీ చూసి కలెక్షన్లు సాధించేలా చేశారు..అయితే చిత్రం గురించి ఆర్.కే.నారాయణ్... called it The Misguided Guide." అంటూ.. గైడ్ చిత్రం విడుదల అయ్యాక రచయిత ఆర్.కే.నారాయణ్ చూసి అసంతృప్తి వ్యక్తం చేయడం కొసమెరుపు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# మలేరియా వ్యాధి పట్ల అవగాహన అవసరం

## నేడు సర్ రోనాల్డ్ రాస్ జయంతి



ప్రాణాంతక వ్యాధి మలేరియా పట్ల ప్రజలలో అవగాహన పెంచడం, చికిత్స చేయడం, నివారించడం గురించి ప్రజలకు అవగాహన కలిగించడం అత్యవసరం. మలేరియా అనే పేరు "మల అరియ" అనే ఇటాలియను పదాల నుండి పుట్టింది. "మల అరియ" అంటే చెడిపోయిన గాలి అని అర్థం. చిత్తడి నేల ఉన్న చోట్ల మలేరియా అధికంగా ఉండటం వలన ఈ జ్వరాన్ని చిత్తడి జ్వరం అని కూడా పిలిచేవారు.

సర్ రోనాల్డ్ రాస్ (13 మే, 1857 -- 16 సెప్టెంబర్, 1932) బ్రిటిష్ వైద్యుడు, శాస్త్రవేత్త. ఆయనకు మలేరియా పారసైట్ జీవిత చక్రానికి చెందిన పరిశోధనకు 1902లో వైద్య శాస్త్రంలో నోబెల్ బహుమతి ప్రదానం చేయబడింది. 1897 లో ఒక దోమ యొక్క జీర్ణశయాంతర ప్రేగులలో మలేరియా పరాన్నజీవిని ఆయన కనుగొన్నప్పుడు మలేరి యా దోమల ద్వారా వ్యాపిస్తుందని ఋజువు చేసింది. ఈ వ్యాధిని ఎదుర్కొనే పద్ధతికి పునాది వేసింది. భారతీయ వైద్య సేవలో 1881 లో ప్రవేశించి 25 సంవత్సరాలు పని చేశాడు. తన సేవలోనే అతను సంచలనాత్మక వైద్య ఆవిష్కరణ చేశాడు.

1895 మార్చి 20న ఆయన లండన్ నుండి బయలుదేరి, ఏప్రిల్ 24న సికింద్రాబాదు చేరాడు. కస్టమ్ ఆఫీసులో తన సామాను క్లియర్ కావడానికి ముందే, అతను నేరుగా బొంబాయి సివిల్ హాస్పిటల్ కి వెళ్లి, మలేరియా రోగుల కోసం వెతుకు తూ రక్త నమూనాలు సేకరించడం ప్రారంభించాడు. రాస్ మే 1895 లో దోమల కడుపు లోపల మలేరియా పరాన్నజీవి ప్రారంభ దశలను గమనించి నప్పుడు తన పరిశోధనలో మొదటి ముఖ్యమైన అడుగు వేశాడు. 1896 జూన్‌లో ఆయనను సికింద్రాబాద్‌కు బదిలీ చేశారు. రెండు సంవత్సరాల పరిశోధన వైఫల్యం తరువాత, జూలై 1897 లో అతను సేకరించిన లార్వా నుండి 20 వయోజన "గోధుమ" దోమలను సంవర్థనం చేయ గలిగాడు. మలేరియా పరాన్నజీవి జీవిత చక్రాన్ని సర్ రోనాల్డ్ రాస్ అనే శాస్త్రవేత్త సికింద్రాబాదు నగరంలో పరిశోధన చేస్తున్నప్పుడు 1897 ఆగస్టు 20న కనుగొన్నారు. తద్వారా ఆయనకు 1902లో నోబెల్ బహుమతి లభించింది. రోనాల్డ్‌రాస్.. మలేరియా పరాన్న జీవికి ప్లాస్మోడియం అని పేరు పెట్టారు. రొనాల్డ్ రాస్ భారతదేశం లోని ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని అల్మోరాలో జన్మించాడు. ప్రస్తుతం "మినిస్టర్స్ రోడ్"గా పిలిచే రహదారిని 2000 సంవత్సరం వరకు "సర్ రోనాల్డ్ రాస్ రోడ్" అనేవారు. మలేరియా ప్లాస్మోడియం అనే పరాన్నజీవి వలన కలుగుతుంది. మనుషుల్లో ఆడ అనోఫీలస్ దోమ ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. పరాన్నజీవిని కలిగివున్న దోమ మనుషులను కరిచినపుడు అవి మనుషులతో చేరి వారి కాలేయం లో విభజన చెంది తదనంతరం ఎర్ర రక్తకణాలను నాశనం చేస్తాయి. ప్రపంచంలో ఏటా 500 మిలియన్ల జనాభా మలేరియా జ్వరాల బారిన పడి వారిలో 2.7 మిలియన్ల మంది మరణిస్తున్నట్లు సర్వేలు వెల్లడిస్తు న్నాయి.

ప్లాస్మోడియం" అనే ప్రొటోజోవా పరాన్నజీవి మలేరియా వ్యాధి కారకము. ప్రోటోజోవాలు ఏకకణ జీవులు. వీటి నిర్మాణము బ్యాక్టీరియా కంటే క్లిష్టమైనది. బ్యాక్టీరియా చాలా సులువయిన నిర్మాణము కలిగి ఉంటాయి. వివిధ ప్లాస్మోడియం స్పీసీస్లు మనుష లలో వివిధ రకాల మలేరియాలను కలుగజేస్తాయి. అందులో ... ప్లాస్మోడియం ఫాల్సిపారం, ప్లాస్మో డియం వైవాక్స్, ప్లాస్మోడియం మలేరియై, ప్లాస్మోడియం ఒవేల్, ప్లాస్మోడియం సెమీ ఒవేల్, ప్లాస్మోడియం నోవెస్లి ముఖ్య మైనవి.

దోమ మనుషులను కరిచినపుడు అవి మనుషులతో చేరి వారి కాలేయంలో విభజన చెంది తదనంతరం ఎర్ర రక్తకణాలను నాశనం చేస్తాయి. ఎర్ర రక్తకణాలలో చేరిన 48 నుండి 72 గంటలలో ఈ పరాన్నజీవులు విభజన చెంది చిట్లిపోతాయి. దీనివలన ఫ్లూ, వణుకుతో కూడిన జ్వరం, అసాధారణ రక్తస్రావం, దీర్ఘ శ్వాస, రక్తలేమి చిహ్నాలు మరియు స్పృహ కోల్పోవడం జరుగుతుంది. చలి జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పి, ఛాతిలో నొప్పిగా ఉండటం, దగ్గు, చెమటలు పట్టడం, వాంతు లు, విరేచనాలు, నీరసంగా ఉండటం, ఆయాసం మొదలైనవి మలేరియా లక్షణాలు. ప్రారంభ దశలోనే ఈ వ్యాధిని గుర్తించడం వల్ల మెరుగైన చికిత్స అందించ వచ్చు. దోమకాటుకు గురైన ఏడు నుంచి 18 రోజుల మధ్య ఈ లక్షణాలు కనిపిస్తాయి. రక్త నమూనాలను సేకరించి మైక్రోస్కో పిక్ ల్యాబోరేటరీ టెస్టులు లేదా ఆర్డీటీ టెస్టుల ద్వారా మలేరియా వ్యాధిని నిర్ధారిస్తారు.

1946నుండి మలేరియా అదుపు చేయడానికి డి.డి.టి వినియోగం మొదలయ్యింది. 1953లో 7 కోట్ల పైగా ప్రజలు మలేరియా బారిన పడ్డారు. 8 లక్షల వరకు మరణాలు అందువలన సంభవించాయి. అప్పుడు 1958లో జాతీయ మలేరియా నిర్మూలన కార్యక్రమం ప్రారంభించారు. డాక్టర్లు రక్తపరీక్ష చేసి మలేరియా అని నిర్ధారిస్తారు. వ్యాధిగ్రస్తుని నుండి సేకరించిన రక్తం బొట్టును ఒక సన్నటి గాజు పలకపై ఉంచి, దానిపై గీంసా ద్రావకం వేస్తారు. దీనివలన డాక్టర్లు సూక్ష్మదర్శిని (మైక్రోస్కోపు) కింద మలేరియా జీవులను చూడ గలుగుతారు. మలేరియా బారిన పడిన తర్వాత చికిత్స తీసుకోవడం కంటే.. వ్యాధి సోకకుండా జాగ్రత్త వహించడం మేలు. దోమలు ఉండకుండా చూసుకోవాలి. ఇందుకోసం పరిసరాలను పరిశుభ్రంగా, పొడిగా ఉంచుకోవాలి. మస్కిటో రిపెల్లెంట్స్ క్రీములు, స్ప్రేలు వాడటం ఉపకరిస్తుంది. ఘాటైన వాసనలను వెదజల్లే మొక్కలు, పుష్పాలను దోమలు ఇష్టపడవు. కాబట్టి బంతి రోస్‌మేరీ, పుదీనా మొక్కలను ఇంటి పరిసరాల్లో పెంచడం వల్ల దోమలు రాకుండా ఉంటాయి.

ఆరోగ్యకరమైన ఆహారం తీసుకో వడం, ఎక్కువగా ద్రవాహారం తీసుకోవడం ముఖ్యం. తద్వారా రోగ నిరోధక వ్యవస్థ బలోపేతమై, రోగాల బారిన పడకుండా ఉంటాం. వీధుల్లో అమ్మే అపరిశుభ్ర ఆహారం తీసుకోవడం మానేయాలి.

అధిక ప్రొటీన్లు ఉన్న పాలు పెరుగు, మజ్జిగ మలేరియా వ్యాధి ఉన్న వారు కణజాలాన్ని అధికంగా కోల్పోవడం వలన మలేరియా ఉన్నవారు తమ ఆహార ప్రణాళిక లో ప్రొటీన్లను చేర్చుకోవాలి. అధిక ప్రోటీన్ మరియు అధిక చెక్కెరలు ఉన్న ఆహార పదార్థాలు కణజాల నిర్మాణానికి దోహద పడతాయి. అధిక ప్రొటీన్లు ఉన్న పాలు, పెరుగు, మజ్జిగ, చేపలు, లస్సీ, చికెన్ సూప్, గుడ్లు మొదలైనవి తీసుకోవాలి.

ఎలాక్ట్రోలైట్స్ మరియు నీటిని కోల్పోవడం మలేరియా వ్యాధి ఉన్నవారిలో సర్వ సామాన్యం. కనుక పండ్ల రసాలు, సూపులు, గంజి, కొబ్బరి నీరు, పప్పు నీరు మొదలైనవి తీసుకోవడం శ్రేయస్కరం. బీట్ రూట్, క్యారెట్, బొప్పాయి, నిమ్మ జాతి పండ్ల విటమిన్ ఎ, విటమిన్ సి సమృద్ధిగా కలిగిన బీట్ రూట్, క్యారెట్, బొప్పాయి, నిమ్మ జాతి పండ్లయిన నారింజ, బత్తాయి, ద్రాక్ష, అనాసపనస, నిమ్మ మొదలైన ఆహార పదార్థాలతో పాటు బి- కాంప్లెక్స్ విటమిన్లు తీసుకుంటే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ఐదో రాష్ట్రపతి.. ఫక్రుద్దీన్ అలీ అహ్మద్

### భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఒక సంక్లిష్ట అధ్యాయం


### స్వాతంత్ర్య సమరయోధుడి నుండి రాజ్యాంగ అధినేత వరకు..

భారత రాజకీయ యవనికపై ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ పేరు ఒక నిశ్శబ్ద సంచలనం. దేశ అత్యున్నత రాజ్యాంగ పీఠాన్ని అధిరోహించిన ఐదవ రాష్ట్రపతిగా ఆయన చరిత్రలో నిలిచినప్పటికీ, ఆయన పదవీకాలం భారత ప్రజాస్వామ్యం ఎదుర్కొన్న అతిపెద్ద సవాలుకు -1975 నాటి అత్యవసర పరిస్థితికి (ఎమర్జెన్సీ) -సాక్షిగా నిలిచింది. స్వాతంత్ర్య సమరయోధుడిగా ప్రారంభమై, రాజనీతిజ్ఞుడిగా ఎదిగి, చివరకు వివాదాస్పద రాజకీయ నిర్ణయాల నీడలో కాలం చేసిన ఆయన ప్రస్థానం ఆధునిక భారతదేశం నేర్చుకున్న ఒక రాజ్యాంగ పాఠం.

#### నేపథ్యం మరియు విద్యాభ్యాసం:

1905 మే 13న ఢిల్లీలోని ఒక సంపన్న కుటుంబంలో జన్మించిన ఫక్రుద్దీన్, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం నుండి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. లండన్‌లో 'బార్-అట్-లా' పూర్తి చేసిన సమయంలోనే జవహర్‌లాల్ నెహ్రూతో ఏర్పడిన పరిచయం ఆయనను జాతీయవాద భావాల వైపు మళ్లించింది. 1931లో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన, ముస్లిం లీగ్ వంటి మత ప్రాతిపదిక సంస్థల వైపు మొగ్గు చూపకుండా లౌకికవాదానికి కట్టుబడ్డారు. క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో సుమారు మూడున్నరేళ్ల పాటు జైలు శిక్ష అనుభవించి జాతీయ స్థాయి నేతగా ఎదిగారు.





#### రాజకీయ ప్రస్థానం:

స్వాతంత్ర్యానంతరం అస్సాం ప్రభుత్వంలో మంత్రిగా పరిపాలనా దక్షతను చాటుకున్న ఆయన, 1966లో ఇందిరా గాంధీకి అత్యంత విశ్వసనీయ నేతగా ఢిల్లీ రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. కేంద్ర మంత్రిగా ఆహార, వ్యవసాయ మరియు పారిశ్రామికాభివృద్ధి శాఖలలో కీలక బాధ్యతలు నిర్వహించి, హరిత విప్లవ ఫలాలను దేశవ్యాప్తంగా విస్తరించడంలో కృషి చేశారు. 1974 ఆగస్టు 24న భారత రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన ఆయన హయాంలోనే దేశం తీవ్ర రాజకీయ అస్థిరతలోకి జారుకుంది.

#### ఎమర్జెన్సీ, వివాదాలు:

1975 జూన్ 25 అర్ధరాత్రి రాష్ట్రపతి భవన్‌కు చేరిన ఎమర్జెన్సీ ఆర్డినెన్స్‌పై ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ సంతకం చేయడం భారత చరిత్రలో ఒక కీలక మలుపు. క్యాబినెట్ అధికారికంగా సమావేశం కాకముందే, కేవలం ప్రధానమంత్రి సిఫార్సుపైనే ఆయన సంతకం చేయడం తీవ్ర చర్చకు దారితీసింది. ఆ ఒక్క సంతకం ఆయనను విమర్శకుల దృష్టిలో 'రబ్బర్ స్టాంప్' రాష్ట్రపతిగా చిత్రీకరించేలా చేసింది. ఎమర్జెన్సీ కాలంలో పౌర హక్కుల హరణ, పత్రికా స్వేచ్ఛ అణచివేత వంటి చర్యలకు ఆయన మూగ సాక్షిగా మిగిలిపోయారు.



#### వారసత్వం.. ముగింపు:

వ్యక్తిగత జీవితంలో మృదుస్వభావి, క్రీడాభిమాని అయిన ఫక్రుద్దీన్, మత సామరస్యం పట్ల అచంచల నిబద్ధత కలిగిన వ్యక్తి. దురదృష్టవశాత్తు, ఎమర్జెన్సీ ముగియక ముందే 1977 ఫిబ్రవరి 11న పదవిలో ఉండగానే ఆయన కన్నుమూశారు. ఆయన పదవీకాలం నేర్పిన పాఠాల వల్లనే తదనంతర కాలంలో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా రాష్ట్రపతి అధికారాలకు మరియు ఎమర్జెన్సీ విధింపునకు మరిన్ని భద్రతలు కల్పించబడ్డాయి. ఒక గొప్ప దేశభక్తుడిగా, పరిపాలనా దక్షుడిగా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమైనవి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

13-05-26 Samayam_Layout 1 5/13/2026 5:21 AM Page 14



# జగన్‌వి నీతి మాలిన రాజకీయాలు

- అభివృద్ధి అంటే గిట్టని వైసిపి నేత
- అమరావతిని చూసి ఓర్వలేక మావిగన్ జపం
- జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి కొల్లు రవీంద్ర



**మచిలీపట్నం, మే 12:** మూడు రాజధానుల వ్యవహారం ముగిసినా..ఇప్పుడు మావిగన్ పేరుతో జగన్ విన్యాసాలు చేస్తున్నారని, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుంటే చూసి ఓర్వలేక జగన్ రెడ్డి విషం చిమ్ముతున్నారని ధ్వజమెత్తారు. మంగళవారం మచిలీపట్నంలో మంత్రి కొల్లు రవీంద్ర పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ రెడ్డి లాంటి దుర్మార్గుడి చూపు రాష్ట్రంపై పడకూడదని నాడు ఆయన తండ్రే తరిమేశారని ఆరోపించారు. ప్రజావేదిక కూల్చివేతతో జగన్ రెడ్డి రాష్ట్రంపై తన దుర్మార్గాలకు శ్రీకారం చుట్టారని దుయ్యబట్టారు. మూడు రాజధానుల పేరుతో అధికారంలో ఉన్న ఐదేళ్లు అరాచకం సృష్టించారని మంత్రి కొల్లు రవీంద్ర ఆగ్రహించారు. భూములిచ్చిన రైతన్నలను పోలీసుల లాఠీలతో కొట్టించి, బూటు కాళ్లతో తన్నించారని విమర్శించారు. పేదల బియ్యాన్ని పందికొక్కులా బొక్కేసినోళ్లు కూడా నీతులు మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. జగన్ తన తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని క్విడ్ ప్రో కో ద్వారా ప్రజల ఆస్తులను దోచారని మండిపడ్డారు. ఐదేళ్లు అడ్డగోలుగా దోచుకుని అమరావతి నిర్మాణంపై నిందలేయడం సిగ్గుచేటని అన్నారు. మావిగన్ అంటూ ఇప్పుడు మాట్లాడే వైసీపీ నేతలు.. గత ఐదేళ్లు ఏం చేశారు..? అని ప్రశ్నించారు. జగన్ రెడ్డికి భజన చేయడం తప్ప వైసీపీ నేతలు సొంత బుర్రలు వాడటం మానేశారని సెటైర్లు గుప్పించారు. అమరావతే రాజధాని అని ఒకసారి.. మూడు రాజధానులని మరోసారి.. ఇప్పుడు మావిగన్ అంటూ నీతి లేని వ్యాఖ్యలు చేస్తున్నారని కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. కృష్ణా గుంటూరు జిల్లాల్లోని వైసీపీ నేతలు జగన్ రెడ్డికి భజన చేయడం తప్ప రాష్ట్రాభివృద్ధి పట్టదా..? అని నిలదీశారు. మూడు ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. రాయలసీమకు గతంలో కియా, ఇప్పుడు డ్రోన్స్, డిఫెన్స్, రాయల్ ఎన్ ఫీల్డ్ తీసుకువచ్చామని ప్రస్తావించారు. ఉత్తరాంధ్రలో భోగాపురం, గూగుల్ డేటా సెంటర్, అర్సెలార్ మిట్టల్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇప్పుడు నీతులు మాట్లాడుతున్న బియ్యం దొంగ ఐదేళ్లలో బందరు పోర్టు ఎందుకు పూర్తి చేయలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పేర్ని నాని తన స్థాయి మరిచి ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురించి మాట్లాడుతున్నారని కొల్లు రవీంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ప్రతిభ చాటుతున్న బీసీ సంక్షేమ స్కూళ్ల విద్యార్థులు

## టెన్త్‌లో ర్యాంకులు సాధించిన వారికి మంత్రి అభినందనలు

## 400 మంది విద్యార్థులకు పురస్కారాలు, మెమొంటోలు

**విజయవాడ, మే 12:** టెన్త్ క్లాస్‌లో మంచి మార్కులు సాధించిన గురుకుల విద్యార్థులను మంత్రి సవిత సత్కరించారు. దాదాపు 400 మంది విద్యార్థులకు పురస్కారాలు, మెమోంటోలను అందజేశారు. టెన్త్ క్లాస్‌లో ఎంజేపీ గురుకుల పాఠశాల విద్యార్థిని, నంద్యాలకు చెందిన సాయి శ్రీ 596 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రం అంతా బీసీ సంక్షేమ స్కూల్స్‌వైపే చూడ్డానికి కారణం ప్రిన్సిపాల్స్, సెక్రటరీస్, డైరెక్టర్లు అని అన్నారు. బీసీ సంక్షేమ స్కూళ్లలో చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని విద్యార్థులు నిరూపించారన్నారు. వేదిక మీద చాలామంది గవర్నమెంట్ స్కూళ్లలో చదువుకున్నవారే ఉన్నారన్నారు. 'తల్లిదండ్రులు మమ్మల్ని నమ్మి.. మీ బిడ్డలను బీసీ సంక్షేమ స్కూల్స్‌కు పంపించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు' అని మంత్రి అన్నారు. తల్లిదండ్రులు కోరుకున్న విధంగానే విద్యార్థులకు మంచి మార్కులు వచ్చాయని తెలిపారు. రోజుకి 20 గంటలు పేద ప్రజల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తున్నారని మంత్రి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీ సంక్షేమ స్కూల్స్‌పై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. అధికారంలోకి రాగానే డైట్ బిల్లు రూ.110 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. మస్కిటో మెష్, ఇన్వెటర్స్, ఆర్వో ప్లాంట్స్, సన్న బియ్యం, 100 డేస్ యాక్షన్ ఎ÷-లాన్ వంటి సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇంట్లో ఎంతమంది బిడ్డలు ఉంటే అంతమందికి 'తల్లికి వందనం' అందిస్తున్నామన్నారు. విద్యతో పాటు స్పోర్ట్స్ డెవలప్ చేసే దిశగా కృషి చేస్తున్నామని మంత్రి చెప్పారు. 1500 టాయిలెట్స్ బీసీ స్కూళ్లలో రెడీ అవుతున్నాయని అన్నారు. భావితరాల భవిష్యత్తు కోసం మంచి రాజధాని నిర్మిస్తున్నామని తెలిపారు. ఎంజేపీ గురుకులాల్లో ప్రస్తుతం స్కూల్స్ మాత్రమే ఉన్నాయని.. 6 కాలేజీల ఏర్పాటుకు అనుమతి వచ్చిందని మంత్రి అన్నారు. బీసీ సంక్షేమ స్కూళ్లలో చదివే విద్యార్థులకు ఇంటర్నేషనల్ అవార్డ్స్ కూడా వచ్చాయన్నారు. బీసీ సంక్షేమ స్కూళ్లలో ఒక హాస్టల్ విద్యార్థికి 75 వేల రూపాయలు ప్రభుత్వం ఖర్చు చేస్తోందని మంత్రి సవిత పేర్కొన్నారు.






# దేశంలో తగినన్ని ఇంధన నిల్వలు

## ప్రస్తుతానికి లోటు లేదన్న కేంద్రమంత్రి

**న్యూఢిల్లీ, మే 12:** దేశంలో ఇంధన సరఫరాకు ఎలాంటి సమస్య లేదని, తగినన్ని క్రూడాయిల్ నిల్వలు ఉన్నాయని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి అన్నారు. సీఐఐ వార్షిక వాణిజ్య సదస్సులో మంగళవారంనాడు ఆయన మాట్లాడుతూ, భారతదేశంలో ప్రస్తుతం 69 రోజులకు సరిపడా క్రూడాయిల్, ఎల్ఎన్జీ నిల్వలు, 45 రోజులకు సరిపడా ఎల్పీజీ నిల్వలు ఉన్నాయని తెలిపారు. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో డిమాండ్‌కు అనుగుణంగా, నిరంతరాయ సరఫరాకు వీలుగా ప్రభుత్వం ఎల్పీజీ ఉత్పత్తిని రోజుకు 35,000-36,000 టన్నుల నుంచి 54,000 టన్నులకు పెంచిందని హర్దీప్ సింగ్ పురి చెప్పారు. ఎల్పీజీ సరఫరాలో ఎలాంటి సమస్యలు లేవన్నారు. సంక్షోభాన్ని బాధ్యతాయుతంగా ఎదుర్కొంటున్నామని, ఎక్కడా ఎలాంటి డ్రై-ఔట్లు లేవని చెప్పారు. ఇంధన సరఫరా గొలుసు స్థిరంగా ఉందని స్పష్టం చేశారు. పశ్చిమాసియా సంక్షోభం నుంచి ఆర్థిక ఒత్తిళ్లను తగ్గించేందుకే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల తగిన సూచనలు చేసిన్నట్టు కేంద్ర మంత్రి చెప్పారు. ప్రధానమంత్రి గత ఆదివారం హైదరాబాద్‌లో తెలంగాణ బీజేపీ నిర్వహించిన సదస్సులో దేశ ప్రజలకు పలు సూచనలు చేశారు. పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించుకోవాలని, సిటీల్లో మెట్రో రైల్ సేవలు, కార్‌పూలింగ్ సేవలను ఉపయోగించుకోవాలని, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచాలని, పార్సిల్స్ కోసం రైల్వే సేవలు వినియోగించుకోవాలని, వర్క్ ఫ్రం హోంకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. విదేశీ మారక ద్రవ్య నిల్వలను కాపాడుకునేందుకు ఏడాది పాటు బంగారం కొనుగోళ్లు, విదేశీ ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని కోరారు.

# క్వాంటమ్ కంప్యూటర్‌ను సందర్శించిన మంత్రి కొండపల్లి

- స్వాభిమాన్ పర్వ కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షుడు మాధవ్



**అమరావతి, మే 12:** ఏపీ ఎస్ఆర్ ఎం యూనివర్సిటీలో ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించిన క్వాంటం కంప్యూటర్ సెంటర్‌ను రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం సందర్శించారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య సిహెచ్ సతీష్ కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ వినాయక్ కల్లూరీలు మంత్రి శ్రీనివాస్ కు సాదర స్వాగతం పలికి క్వాంటం రీసెర్చ్ కంప్యూటర్ వివరాలను వెల్లడించారు. క్వాంటం కంప్యూటర్ ప్రాధాన్యత, ప్రపంచ దేశాల్లో క్వాంటం కంప్యూటర్లకు పెరుగుతున్న ఆదరణ గురించి సతీష్ కుమార్ మంత్రికి వివరించారు. క్వాంటం కంప్యూటర్ల పనితీరు, ఏ ఏ రంగాల్లో కంపోనెంట్లు తయారీ, వాటి ప్రాముఖ్యతల గురించి ఏపీ క్వాంటం మిషన్ డైరెక్టర్ సివి శ్రీధర్ మంత్రి శ్రీనివాస్ కు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ క్వాంటం కంప్యూటర్లను ఆసక్తిగా తిలకించి పారిశ్రామిక రంగంలో కంప్యూటర్ల ప్రాముఖ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. యూనివర్సిటీలోని క్వాంటం డీన్ డాక్టర్ సోమనాథ్, ప్రొఫెసర్ వర్ష, రిజిస్టర్ డాక్టర్ వినాయక్ మంత్రి శ్రీనివాస్ కు యూనివర్సిటీ వివరాలు వెల్లడించారు. అనంతరం మంత్రి శ్రీనివాస్ యూనివర్సిటీ భవనాలను, అడితోరియం,, లేబోరేటరీ లను సందర్శించారు




# 24 గంటల్లోనే వాహన రిజిస్ట్రేషన్

## రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**అమరావతి, మే 12:** ఏపీలో కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై 24 గంటల్లోనే కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ పూర్తి చేయనున్నట్లు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రకటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈ కొత్త విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. వాహనదారులకు వేగవంతమైన సేవలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. డీలర్ టెంపరరీ రిజిస్ట్రేషన్ అనంతరం 24 గంటల్లోనే రిజిస్ట్రేషన్‌కు ఆమోదం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఫ్యాన్సీ నంబర్ వాహనాలకు మాత్రమే మినహాయింపు ఉంటుందని మంత్రి తెలిపారు. గడువులోపు సంబంధిత అధికారులు స్పందించకపోతే ఆటోమేటిక్‌గా రిజిస్ట్రేషన్ ఆమోదం అయినట్లు పరిగణించనున్నట్లు తెలిపారు. సెలవు రోజుల్లో కూడా ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్‌ను ఆమోదిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లకు చెక్ పెట్టనున్నట్లు తెలిపారు. ప్రజలకు పారదర్శకంగా, సులభంగా సేవలు అందించడం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ఈ కొత్త విధానం అమలు చేయనున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రకటించారు.

# భారీ గంజాయి ముఠా అరెస్ట్

## ₹97 లక్షల విలువైన గంజాయి స్వాధీనం

**అనకాపల్లి, మే 12:** అనకాపల్లి జిల్లాలో భారీ గంజాయి అక్రమ రవాణా ముఠాను పోలీసులు పట్టుకున్నారు. బుచ్చయ్యపేట పోలీసులు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో ₹97 లక్షల విలువైన 194 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారానికి సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మీడియా సమావేశంలో వెల్లడించారు. గత ఏడాదిన్నర కాలంగా జిల్లాలో గంజాయి అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ తెలిపారు. ఈ ఏడాది ఇప్పటివరకు 46 కేసులు నమోదు చేసి, మొత్తం 1,177 కేజీల గంజాయిని సీజ్ చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా 7.14 లీటర్ల హషీష్ ఆయిల్ కూడా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులు గంజాయి కంటే హషీష్ ఆయిల్ రవాణా సులభమని భావించి ఆ దిశగా మారుతున్నట్లు గుర్తించామని ఎస్పీ పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ విభాగంతో సమన్వయం ద్వారా ఈ ఏడాది 13 కేసుల్లో 24 మందికి శిక్షలు పడేలా చేశామని తెలిపారు. అందులో 16 మందికి 10 నుంచి 15 ఏళ్ల జైలు శిక్ష విధించబడటం కీలక పరిణామమని అన్నారు. ఎన్‌డీపీఎస్ కేసుల్లో ఆర్థిక దర్యాప్తు ద్వారా ఇప్పటివరకు ₹1.25 కోట్ల విలువైన ఆస్తులను సీజ్ చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. గంజాయి అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు కఠిన చర్యలు కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. తాజా ఘటనకు సంబంధించి, ఈ నెల 11వ తేదీన ఈగిల్ టీమ్, స్పెషల్ బ్రాంచ్, బుచ్చయ్యపేట పోలీసులు సంయుక్తంగా బంగారుమెట్ట-అనకాపల్లి రోడ్డులోని గొన్నవానిపాలెం జంక్షన్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో అనకాపల్లి వైపు వేగంగా వస్తున్న స్కూటీ, మారుతి సియాజ్ కారును అడ్డగించి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టైన నిందితుల్లో గుమ్మాల పేరునాయుడు ప్రధాన రవాణాదారుడిగా గుర్తించారు. అతనిపై గతంలో ఆరు కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మండిపల్లి సత్తిబాబు సాగుదారుడిగా, గొల్లవెల్లి గణేష్ డ్రైవర్‌గా వ్యవహరిస్తున్నట్లు గుర్తించారు. నిందితుల నుంచి గంజాయితో పాటు ఒక కారు, ఒక స్కూటీ, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి, డ్రగ్స్ విషయంలో జిల్లా పోలీసులు జీరో టాలరెన్స్ విధానాన్ని అమలు చేస్తున్నారని ఎస్పీ స్పష్టం చేశారు. మీ ప్రాంతాల్లో ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నా, వినియోగిస్తున్నా వెంటనే 112 లేదా 1972 టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. ఈ ఆపరేషన్‌లో ప్రతిభ కనబరిచిన డీఎస్పీ ఎం. శ్రావణి, సీఐ జి. కోటేశ్వరరావు, ఎస్సైలు ఎం. శ్రీనివాస్, ఏ. శ్రీనివాసరావు తదితర పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేశారు.

# ఆంజనేయస్వామికి మంత్రి దుర్గేష్ పూజలు

**రాజమహేంద్రవరం, మే 12:** హనుమాన్ జయంతి సందర్భంగా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తూ రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా కడియపులంకలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గత 2024 ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా విజయం సాధిస్తే స్వామివారికి తులాభారం సమర్పిస్తానని జనసేన నాయకుడు తోటసాని దుర్గారావు మొక్కుకున్నట్లు తెలిపారు. ఆ మొక్కు మేరకు నిలువెత్తు బెల్లంతో తులాభారం నిర్వహించి స్వామివారికి సమర్పించారు. తులాభారం కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు, హారతులతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. భక్తులు "జై శ్రీరామ్", "జై హనుమాన్" నినాదాలతో ఆలయ ప్రాంతాన్ని మార్మోగించారు. అనంతరం శ్రీ సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామివారికి విశేష అర్చనలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని మంత్రి కందుల దుర్గేష్ ప్రార్థించారు. రైతులు, యువత, మహిళలు అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయాల్లో భక్తుల రద్దీ అధికంగా కనిపించింది. పలు గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు. హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించేందుకు గ్రామస్థులు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.